www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 18-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 282 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి తె.4:59 తదుపరి అమావాస్య నక్షత్రం: అనూరాధ రా.8:07 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.2:21-తె.4:08, దుర్ముహూర్తం: ఉ.10:22-11:06, మ.2:45-3:29, అమృతఘడియలు: ఉ.8:26-10:14, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:42, సూర్యాస్తమయం: 5:40 | గుంటూరు సిటీ


Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాష్ట్రపతిగా వాజపేయిని పంపి ప్రధానిగా ఆద్వాణీ!

నాడు అంతర్గతంగా బీజేపీలో ప్రతిపాదన

అందుకు అంగీకరించని వాజపేయి

ఆయన మీడియా సలహాదారు టాండన్ వెల్లడి



2





కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనగాని, సీఎస్ విజయానంద్, డీజీపీ గుప్తా, హాజరైన కలెక్టర్లు, అధికారులు

ప్రజలు మెచ్చాలి!

నాకైనా అదే కొలమానం.. కలెక్టర్ల పనితీరుపై 'సంతృప్తి' లేదు

ఎక్కడో తేడా ఉన్నట్లుంది.. చెక్ చేసుకోండి: సీఎం

ఏదైనా విషయంలో ఒక రాష్ట్రం మనకంటే బాగా చేసిందంటే అప్‌సెట్ అవుతాను. మనం ఎలా మిస్ అయ్యామనేది సమీక్షించుకుంటా. తిరిగి పురోగతి సాధించేవరకూ విశ్రమించను. ఇదీ నా స్వభావం. మీరు కూడా అలాంటి విధానం పెట్టుకోండి. సమష్టిగా పనిచేసి ఉత్తమ విధానం సృష్టిద్దాం.

దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాకే మనుషుల ఆలోచనా విధానం మారింది. సంస్కరణలు రాకముందు ప్రతి ఒక్కరూ సిద్ధాంతాలు మాట్లాడారు. కానీ అవి మనుషులకు తిండిపెట్టవు. సిద్ధాంతాలు, విలువలు వేర్వేరు. మెరుగైన జీవన ప్రమాణాలు అందాలంటే రోడ్లు, విద్యుత్, విద్యా సౌకర్యాలు బాగుండాలి.

- సీఎం చంద్రబాబు

పౌరులతో ప్రవర్తించే తీరు మారాల్సిందే

గ్రామంలో ప్రతి వర్గాన్నీ టచ్ చేయాలి

పెట్టుబడుల క్లియరెన్స్‌లో జాప్యం చేయొద్దు

మన విధానాలు చూసి రాష్ట్రానికొస్తున్నారు

అనుమతుల కోసం తిప్పించుకోవద్దు

ప్రెస్‌మీట్‌లు, సోషల్ మీడియాతోనే లక్ష్యాలు సాధించలేరు

చేతల్లో ప్రభుత్వంపై నమ్మకం తీసుకు రండి

జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): "మీరు బాగా పనిచేశామని అనుకుంటున్నారు. నేను కూడా అదే అనుకుంటున్నా. కానీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. మీ పనితీరును ప్రజలు మెచ్చడం లేదు. ఏ ప్రజల కోసం మీరు పనిచేస్తున్నారో...వారే మిమ్మల్ని మెచ్చుకోవడం లేదంటే ఎక్కడో ఏదో తేడా ఉంది. అదే మీతో గుర్తించండి. లోపాలు సరిదిద్దుకొని, జాగ్రత్తగా పనిచేయండి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు హితబోధ చేశారు. తన సహజశైలికి విరుద్ధంగా కలెక్టర్ల పనితీరుపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. "గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన అనేక సమస్యలను పరిష్కరించుకుంటూనే ఒక వైపు ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. కానీ కలెక్టర్ల పనితీరుపై

మిగతా 13వ పేజీలో...

రెవెన్యూ అవస్థలకు తక్షణమే స్వస్తి!

బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ తెస్తున్నాం: ముఖ్యమంత్రి

ఫైళ్ల పరిష్కారమంటే కిందకు తోసెయ్యడమే!

తన వద్ద లేకుండా ఇతరులకు పంపేస్తున్నారు

దీనివల్లే ప్రజల్లో సంతృప్తి రావడం లేదు

లింక్ ఫైళ్లు కూడా మాయమయ్యాయి

దీంతో రెవెన్యూ శాఖను ట్రాక్ చేస్తున్నాం

ఇక ఫైలుపై ఎవరు ఏం రాసినా తీసివేయలేరు: సీఎం

సమగ్ర కథనాలు 12, 13లో..

కూటమి పాలనపై 51% సంతృప్తి

ఇది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.. 49 శాతం ప్రజలకు పలు సమస్యలు

గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన వాటిపైనే అసంతృప్తి ఉంది

అసంతృప్తిలో రెవెన్యూదే అగ్రస్థానం.. కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

జనవరి నుంచి ఆకస్మిక తనిఖీలు!



ప్రభుత్వంపై ప్రజల స్పందన తెలుసుకుంటా

ఉగాది రోజున 5 లక్షల గృహ ప్రవేశాలు

వాట్సాప్ గవర్నెన్స్ వినియోగం పెంచాలి

ఈసారి 17.11% వృద్ధి!

ఫలితాల కోసం విద్యార్థిలా ఎదురుచూస్తా

వ్యవసాయ రంగానికి ఎంత చేస్తున్నా చేయాల్సింది ఇంకా ఉంటుంది: సీఎం

కేంద్ర నిధులన్నీ ఖర్చు చేయాలి

జనవరి 15 నాటికి మిగిలిపోయిన వాటిని వినియోగించాలి

నిధుల్లేక ఇబ్బందులు పడుతుంటే అలసత్వమేల?: చంద్రబాబు

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు న్యాయమే జరిగింది

రాజకీయ ప్రాతిపదికన నీటి పంపకాలు ఉండవు: ఏపీ

బ్రిజేశ్ ట్రైబ్యునల్ ముందు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా పటిష్ఠ వాదనలు



సమన్యాయం కోసమే ఎస్ఎల్‌బీసీ, ఎస్ఆర్‌బీసీకి ఒకేసారి అనుమతులు

విభజన జరిగి 11 ఏళ్లయినా ఎస్ఎల్‌బీసీని తెలంగాణ పూర్తి చేసుకోలేదు

ఎస్ఆర్‌బీసీని ఏపీ పూర్తిచేయడాన్ని ఎలా తప్పుబడతారు?: గుప్తా

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ట్రైబ్యునళ్లు, న్యాయస్థానాలూ రాజకీయ ప్రాతిపదికన నదీ జలాలను కేటాయించవని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేసింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు న్యాయమే జరిగిందని తేల్చిచెప్పింది. కొత్త రాష్ట్రంగా పేర్కొంటూ అన్ని హక్కులూ తమవేనంటే.. నీటి కేటాయింపులు జరిగిపోవని.. రాజకీయ వాదనలతో జరిగేది నీటియుద్ధాలే తప్ప.. కేటాయింపులు కాదని పేర్కొంది. కృష్ణా ట్రైబ్యునల్-1, రాష్ట్ర విభజన చట్టం(2014)లోని సెక్షన్ 85లో నీటి కేటాయింపులపై స్పష్టంగా పేర్కొన్నారని గుర్తుచేసింది. కృష్ణా జలాల పునఃపంపిణీపై

మిగతా 11వ పేజీలో...



14

కాగితాలతో ఖాకీల కుస్తీ

టెక్నాలజీకి దూరంగా క్షేత్రస్థాయి పోలీసులు

హెడ్ క్వార్టర్స్‌లోనే టెక్.. జిల్లాల్లో మాన్యువల్

చాలా జిల్లాల ఎస్పీలు ఈ-గవర్నెన్స్‌కు దూరం

ప్రభుత్వం జీవో విడుదల చేసి పలుమార్లు ఆదేశాలిచ్చినా పట్టని వైనం

బాధితులకు అందని సత్వర న్యాయం

నేతలతో జగన్ చెడుగుడు!

అగమ్యగోచరంగా వారి రాజకీయ భవిష్యత్తు

పక్కన పెట్టేశారని కీలక నాయకుల్లో అసంతృప్తి

మళ్లీ చిలకలూరిపేట కావాలంటున్న రజిని

ఈసారి రేపల్లెకు మార్చాలని జగన్ యోచన

పెనమలూరు కోరుతున్న దేవినేని అవినాశ్

నిర్దిష్ట హామీ ఇవ్వని పార్టీ అధినేత

అంజాద్‌బాషా, నారాయణస్వామికి పూర్తిగా గుడ్‌బై

మార్గాని, రోజా, కొడాలికీ రాజకీయ కష్టాలే



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధికారంలో ఉండగా కీలక పాత్ర పోషించిన పలువురు ముఖ్య నేతల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల ముందు పలువురు నియోజకవర్గాలను మార్చేసి జగన్ చెడుగుడు ఆడుకున్నారు. ఇప్పుడు ఆయా నేతలను నిర్దాక్షిణ్యంగా పక్కనపెట్టేశారు. దీంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. దీంతో... అసంతృప్తులు, అలకలు పెరిగిపోతున్నాయి. మాజీ మంత్రి విడదల రజినికి నాడు జగన్ మంత్రి పదవి ఇచ్చారు. ఐదేళ్లపాటు ఆమె హవా పార్టీలో కొనసాగింది. చిలకలూరిపేటతోపాటు జిల్లాను సైతం శాసించేస్థాయిలో అప్పట్లో వ్యవహరించారు. అంత చేసినా... ఎన్నికల సమయంలో సర్వే పేరిట ఆమెను గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి పంపించారు. ఈ పరిణామంపై ఆమె విస్తుబోయినా.. చేసేదేమీ లేక పశ్చిమ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా తనకు మళ్లీ చిలకలూరిపేట కావాలని కోరుతున్నారు. కానీ.. ఆమె మాటను జగన్ ఏమాత్రం వినిపించుకోవడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2029 ఎన్నికల్లో రేపల్లె నుంచి పోటీ చేయించాలని జగన్ భావిస్తున్నట్టు

మిగతా 14వ పేజీలో...

ఏపీలో విద్యావిధానం భేష్

మాతృభాష ఆధారంగా విద్యార్థులకు బహు భాషల్లో పాఠ్యాంశాల బోధన



కోయ, కువి, జాతాపు, ఆదివాసీ సహా పలు భాషలపై అందుబాటులో పుస్తకాలు

ఆదివాసీ చిన్నారుల హాజరు అత్యధికం

ప్రశంసించిన యునెస్కో విద్యా నివేదిక

'స్టేట్ ఆఫ్ ఎడ్యుకేషన్-2025' విడుదల

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 'జాతీయ విద్యావిధానం-2020'కి అనుగుణంగా మాతృభాష ఆధారంగా వివిధ భాషలను నేర్చుకోవడంపై వినూత్న ప్రయోగాలు జరుగుతున్నాయని యునెస్కో తెలిపింది. 'భాషా విషయాలు' శీర్షికతో మాతృభాష సహా బహుభాషల్లో విద్యపై యునెస్కో బుధవారం 'స్టేట్ ఆఫ్ ఎడ్యుకేషన్-2025' నివేదికను విడుదల చేసింది. ఆదివాసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ఏపీలో

మిగతా 14వ పేజీలో...

పది గంటల ముందే రైల్వే రిజర్వేషన్ చార్టు


ప్రయాణికుల్లో అనిశ్చితి తగ్గించేందుకు నిర్ణయం

చార్టు రూపొందించే సమయాన్ని తొలిసారిగా సవరించిన రైల్వే శాఖ

2

పది గంటల ముందే రైల్వే రిజర్వేషన్ చార్టు

» ప్రయాణికుల్లో అనిశ్చితి తగ్గించేందుకు కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, డిసెంబరు 17: ఇకపై రైలు బయలుదేరడానికి 10 గంటల ముందే రిజర్వేషన్ చార్టు సిద్ధం కానుంది. ప్రయాణికుల్లో అనిశ్చితి తగ్గించి, వారు మరింత సజావుగా ప్రయాణ ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రైల్వేశాఖ తొలిసారిగా రిజర్వేషన్ చార్టు రూపొందించే సమయాన్ని సవరించింది. ఇప్పటి వరకు రైలు బయలుదేరడానికి 4గంటల ముందు మాత్రమే రిజర్వేషన్ చార్టును సిద్ధం చేసేవారు. దీంతో ప్రత్యేకించి వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికుల్లో చివరి క్షణాల వరకు ఉత్కంఠ కొనసాగేది. పది గంటలు ముందుగా చార్టు సిద్ధం చేయడం వల్ల తాత్కాలిక బస, రైల్వేస్టేషన్‌కు చేరుకునే ఏర్పాట్లు, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించుకునేందుకు ప్రయాణికులకు అవకాశం కలుగుతుందని రైల్వేశాఖ పేర్కొంది. అన్ని రైల్వే జోన్లు దీన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది.


పరిమితి దాటిన లగేజీకి చార్జీ

రైల్లో ప్రయాణించే సమయంలో నిర్దేశిత బరువు దాటిన లగేజీకి చార్జీలు చెల్లించాల్సిందేనని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభకు తెలిపారు. విమానాల్లో వలే రైళ్లలోనూ లగేజీకి నిబంధనలను అమలు చేయనున్నారా? అని టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం క్లాస్ వైజ్‌గా రైళ్లలో లగేజీకి కనిష్ఠ, గరిష్ఠ పరిమితులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఐఆర్‌సీటీసీ ఈ-వాలెట్‌లో నగదు జమచేసిన వ్యక్తులు ఆ డబ్బును రైలు టికెట్లు కొనేందుకు మాత్రమే ఉపయోగించుకోగలరని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆ డబ్బును వెనక్కి తీసుకోవడం కుదరదని తేల్చిచెప్పారు. అయితే, ఈ-వాలెట్‌ను రద్దు(క్లోజ్) చేసుకున్నప్పుడు అందులోని డబ్బును వినియోగదారుడి బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేస్తామని తెలిపారు. లోక్‌సభలో బీజేపీ ఎంపీ జనార్దన్ సింగ్ సిగ్రివాల్ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. మరోవైపు, రైలు ప్రమాదాలను నివారించేందుకు కవచ్ వ్యవస్థ ఏర్పాటు ప్రక్రియ చాలా వేగంగా కొనసాగుతోందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం 2 వేల కిలోమీటర్ల పరిధికి మించి కవచ్ వ్యవస్థ అమలవుతోందన్నారు.

కొత్త సమయాలు ఇవీ..

- ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య బయలుదేరే రైళ్లకు ఇకపై తొలి రిజర్వేషన్ చార్టును ముందురోజు రాత్రి 8 గంటలకే తయారు చేయనున్నారు.
- మధ్యాహ్నం 2.01 నుంచి రాత్రి 11.59 గంటల మధ్య, అలాగే అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య బయలుదేరాల్సిన రైళ్లకు 10 గంటలు ముందుగా తొలి రిజర్వేషన్ చార్టును రూపొందిస్తారు.

లోకం తీరు



కలాం కంటే ముందు రాష్ట్రపతి పదవికి వాజపేయి పేరు!

» ఆయన స్థానంలో ప్రధానిగా ఆడ్వాణీ!!

» నాడు అంతర్గతంగా బీజేపీలో ప్రతిపాదన

» వాజపేయి మీడియా సలహాదారు టాండన్

న్యూఢిల్లీ, డిసెంబరు 17: కేఆర్ నారాయణన్ పదవీవిరమణ తర్వాత 2002లో భారత రాష్ట్రపతి పదవికి ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అభ్యర్థిత్వాన్ని పరిశీలించడానికి ముందు.. నాటి ప్రధాని వాజపేయిని అత్యున్నత రాజ్యాంగాధినేతగా చూడాలని బీజేపీలో అంతర్గతంగా ప్రతిపాదనలు వచ్చాయా? ఆయన స్థానంలో బీజేపీ అగ్రనేత ఆడ్వాణీని ప్రధానమంత్రిని చేయాలని భావించారా..? ప్రధాని వాజపేయికి ఆరేళ్లపాటు మీడియా సలహాదారుగా పనిచేసిన అశోక్ టాండన్ అవుననే అంటున్నారు. తన తాజా పుస్తకం 'అటల్ సంస్మరణ్'లో ఈ వివరాలు వెల్లడించారు. అయితే నాడు ఎన్‌డీఏకి ఉన్న మెజారిటీ ఆధారంగా ఈ పదవిని చేపట్టడం తప్పని వాజపేయి భావించి సదరు ప్రతిపాదనను తిరస్కరించారని తెలిపారు. కలాం 2002 నుంచి 2007 వరకు రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే. 'రాష్ట్రపతి పదవి స్వీకరించడానికి వాజపేయి సిద్ధంగా లేరు. ప్రజాదరణ కలిగిన ప్రధాని.. మెజారిటీ ప్రాతిపదికన రాష్ట్రపతి కావడం భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, అది తప్పుడు సంకేతాలు పంపుతుందని, ఇలాంటి ప్రతిపాదనకు మద్దతివ్వనని ఆయన స్పష్టం చేశారు' అని వివరించారు. 2001 డిసెంబరు 13న పార్లమెంటుపై దాడి జరిగినప్పుడు సోనియా వాజపేయికి ఫోన్ చేశారని టాండన్ తెలిపారు. "అప్పుడు ప్రధాని తన నివాసంలోనే ఉన్నారు. భద్రతాదళాలు చేపట్టిన ఆపరేషన్‌ను మంత్రివర్గ సహచరులతో కలిసి టీవీలో చూస్తున్నారు. ఈ సమయంలో ఆయనకు సోనియా ఫోన్ చేశారు. 'మీ గురించే ఆందోళన చెందుతున్నాను.. మీరు క్షేమమే కదా' అని అడిగారు" అని టాండన్ వివరించారు.

కన్నీర్ర చేయలేదు...కళ్లను దానం చేసింది!

» భర్త ప్రాణాలకోసం తల్లడిల్లిన భార్య మానవత్వపు సందేశం


వెంకట రమణన్ (ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విపత్కర స్థితిలో ఉన్న ఆమెను సమాజం పట్టించుకోలేదు....సాయం కోసం చేతులెత్తి మొక్కినా ఎవరూ స్పందించలేదు...ఫలితంగా భర్తను కోల్పోయింది. అయినా, ఆమె సమాజంపై కన్నెర్ర చేయలేదు...మానవతా దృష్టితో భర్త కళ్లను దానం చేసింది. బెంగళూరు నగరంలోని బనశంకరి ప్రాంతానికి చెందిన వెంకట రమణన్(34) గుండెపోటుతో నడిరోడ్డుపై కుప్పకూలి... వాహనదారులెవరూ సాయం చేయక, సమయానికి ఆస్పత్రికి చేరుకోలేక మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన భార్య రూప సాయం కోసం అర్థిస్తున్న వీడియో వైరల్ అయింది. అయితే, 'సమాజం నా భర్త ప్రాణాలు కాపాడేందుకు రాలేదు., కానీ నేను మానవత్వంతో మరో ఇద్దరికి కంటిచూపు ఇవ్వాలని నిర్ణయించుకున్నా' అని రూప.. తన భర్త వెంకటరమణన్ కళ్లను దానం చేశారు. సమాజానికి మానవత్వపు సందేశం పంపించారు.

మోదీ, షా రాజీనామా చేయాలి: ఖర్గే

న్యూఢిల్లీ, డిసెంబరు 17: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు రాజీనామా చేయాలంటూ బుధవారం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు మంగళవారం నిరాకరించిన నేపథ్యంలో కాంగ్రెస్ ఈ మేరకు డిమాండ్ చేసింది. కోర్టు తీర్పు మోదీ, అమిత్ షాలకు చెంపపెట్టులాంటిందని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వం గత 11ఏళ్ల కాలంలో 50మందికిపైగా విపక్ష నేతలను బెదిరించడానికి, బ్లాక్‌మెయిల్ చేయడానికి ఈడీ, సీబీఐ, ఐటీలను దుర్వినియోగం చేసిందని ఆయన పేర్కొన్నారు.

భారత్‌లో తయారీ తగ్గుముఖం: రాహుల్


టీవీఎస్ 450 సీసీ బైక్‌పై రాహుల్

న్యూఢిల్లీ, డిసెంబరు 17: ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థలకు తయారీ రంగమే కీలకంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బుధవారం పేర్కొన్నారు. అయితే భారత్‌లో ఆ రంగం తగ్గిపోతోందని పేర్కొన్నారు. జర్మనీ దేశంలోని మూనిక్‌లో బీఎండబ్ల్యూ ప్లాంటును సందర్శించిన అనంతరం పెట్టిన ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ఆయన ఈమేరకు పేర్కొన్నారు. బీఎండబ్ల్యూ, భారత్‌కు చెందిన టీవీఎస్ సంస్థ కలిసి తయారుచేస్తోన్న టీవీఎస్ 450 సీసీ మోటార్‌సైకిల్‌ను చూడడం ప్రత్యేకంగా ఉందని వివరించారు. ప్రపంచంలోని 117 ప్రగతిశీల పార్టీలతో కూడిన 'ప్రోగ్రెసివ్ అలయన్స్' ఆహ్వానం మేరకు ఆయన జర్మనీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో అక్కడి భారతీయులతోపాటు ఆ దేశ మంత్రులను కూడా ఆయన కలుసుకొంటారు.

బుర్ఖా వేసుకోలేదని.. భార్య, ఇద్దరు కూతుళ్లను చంపి, పూడ్చేసి!

» యూపీలో ఘోరం.. నిందితుడి అరెస్టు

లఖ్‌నవూ, డిసెంబరు 17: బుర్ఖా ధరించలేదని కట్టుకున్న భార్య, ఇద్దరు కూతుళ్లను అతి దారుణంగా చంపేసి.. ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టాడో కిరాతకుడు.. ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాలో చోటు చేసుకున్న ఈ దారుణం.. వారం రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. గడిదౌలత్ గ్రామానికి చెందిన ఫరూఖ్‌కు భార్య తాహీరా (35), కూతుళ్లు షరీన్ (14), అఫ్రీన్ (6) ఉన్నారు. అయితే తాహీరా ఫరూఖ్‌ను ఏదో విషయమై డబ్బులు అడగ్గా.. అది ఇద్దరి మధ్య గొడవకు దారి తీసింది. ఈ నేపథ్యంలోనే కోపంతో తాహీరా బుర్ఖా వేసుకోకుండానే ఇద్దరు కూతుళ్లను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తాహీరా తన పరువు తీసిందని ఫరూఖ్ మనసులో రగిలిపోయాడు. ఒక నెల తర్వాత భార్యాకూతుళ్లను నమ్మించి ఇంటికి తీసుకొచ్చాడు. అనంతరం వారిని తుపాకీతో ఇంట్లోనే కాల్చి చంపాడు. ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే ఓ గొయ్యి తీసి మృతదేహాలను పాతిపెట్టాడు.

రాష్ట్రపతి భవన్‌లో పరమ్‌వీర్ గ్యాలరీ ప్రారంభం

న్యూఢిల్లీ, డిసెంబరు 17: విజయ్ దివస్‌ను పురస్కరించుకుని దేశంలో అత్యున్నత సైనిక పురస్కారం పరమవీర చక్రకు అంకితం చేస్తూ రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన పరమ్‌వీర్ గ్యాలరీని మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. పరమవీర చక్ర అవార్డు పొందిన 21 మంది అమరవీరుల చిత్రపటాలను ఈ గ్యాలరీలో ఉంచారు. యుద్ధ సమయంలో వారు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, వారి ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ వీటిని ఏర్పాటు చేశారు.

జనవరి 1 నుంచి ఢిల్లీలో 'భారత్ ట్యాక్సీ' సేవలు

న్యూఢిల్లీ, డిసెంబరు 17: ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేటు క్యాబ్ సేవలకు ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం 'భారత్ ట్యాక్సీ' పేరుతో సరికొత్త యాప్‌ను తీసుకువచ్చింది. దేశంలో తొలిసారిగా ప్రారంభించిన ఈ సహకార ట్యాక్సీ సేవలు జనవరి 1 నుంచి ఢిల్లీ ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ అనే సంస్థ నిర్వహిస్తున్న ఈ యాప్ పూర్తిగా జీరో కమీషన్ మోడల్‌పై ఆధారపడి పనిచేస్తుంది. కార్లు, ఆటోలు, బైకులు ఈ సేవలో అందుబాటులో ఉంటాయి. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వేదికలపై ఈ యాప్‌ను వినియోగించవచ్చు. ఢిల్లీ పోలీస్ సహా ఇతర భద్రతా సంస్థలతో అనుసంధానం, డ్రైవర్ల ధ్రువీకరణ, రైడ్ వివరాలు పంచుకోవడం వంటి అనేక సదుపాయాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. అత్యవసర సమయాల్లో క్యాబ్ అగ్రిగేటర్లు విధిస్తున్న అధిక ధరలను నియంత్రించడమే లక్ష్యంగా ఈ యాప్‌ను రూపొందించారు.

ఢాకాలోని భారత హైకమిషన్ వద్ద ఉద్రిక్తత

ఢాకా, న్యూఢిల్లీ, డిసెంబరు 17: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో భారత హైకమిషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ ఆందోళనకారులు హైకమిషన్ వైపు దూసుకుపోయేందుకు యత్నించారు. భారత్‌లో ఉంటోన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు ఉద్రిక్తతలు, భద్రతా కారణాల దృష్ట్యా వీసా కేంద్రాన్ని భారత్ మూసివేసింది. ఢాకాలోని భారత హైకమిషన్ కార్యాలయానికి బెదిరింపుల నేపథ్యంలో వీసా కేంద్రాన్ని మూసివేసింది. మరోవైపు ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి వేరు చేస్తామంటూ బంగ్లాదేశ్ రాజకీయ నేతలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న తరుణంలో ఆ దేశ హైకమిషనర్ ముహమ్మద్ రియాజ్ హమిదుల్లాకు భారత్ సమన్లు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లో క్షీణిస్తున్న శాంతి భద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది.

గుజరాత్ మాదిరిగానే

ఇథియోపియా సింహాల భూమి!

» నాకు ఇక్కడ స్వస్థలంలో ఉన్నట్టే అనిపిస్తోంది: మోదీ

» ఆ దేశ పార్లమెంటును ఉద్దేశించి ప్రధాని ప్రసంగం


ఇథియోపియా పార్లమెంటులో ప్రధాని మోదీ

అడిస్ అబాబా, ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, డిసెంబరు 17: ఇథియోపియా ఆఫ్రికాకు కూడలి అయితే భారత్ హిందూ మహాసముద్రానికి హృదయం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రాదేశిక శాంతి, భద్రత, అనుసంధానంలో భారత్-ఇథియోపియా 'సహజ భాగస్వాములు' అని అన్నారు. బుధవారం మోదీ, ఇథియోపియన్ పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. మరింత సమానత్వం, మరింత శాంతిసామరస్యాలతో కూడిన ప్రపంచం కోసం ఇరుదేశాలు కలిసి పనిచేయాలని ఉద్ఘాటించారు. ఇథియోపియాకు రావడం తనకు అద్భుతమైన అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. ఇథియోపియా సింహాల భూమి అని, ఇక్కడ తనకు స్వదేశంలో ఉన్నట్టే అనిపిస్తోందని చెప్పారు. ఎందుకంటే.. తన స్వరాష్ట్రమైన గుజరాత్ కూడా సింహాల భూమేనని మోదీ పేర్కొన్నారు. భారత్‌లోని 140 కోట్ల మంది జనం తరపున స్నేహ, సోదర, సద్భావనలతో కూడిన సందేశాన్ని తాను తీసుకొచ్చానని చట్టసభ్యుల కరతాళ ధ్వనుల మధ్య మోదీ పేర్కొన్నారు. మోదీ ప్రసంగం పూర్తయ్యాక అక్కడి చట్టసభ్యులంతా గౌరవసూచకంగా లేచి నిల్చుని చప్పట్లు కొట్టారు. మోదీ ప్రసంగిస్తుండగా చట్టసభ్యులు దాదాపు 50సార్లు చప్పట్లు కొట్టడం విశేషం. ప్రధాని హోదాలో మోదీ, ఇథియోపియాకు వెళ్లడం ఇదే తొలిసారి అయితే ఒక దేశ పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించడం ఇది 18వసారి. అంతకు ముందు మంగళవారం రాత్రి మోదీ గౌరవార్థం ఇథియోపియా ప్రధాని అబి అహ్మద్ అలీ విందు ఇచ్చారు. ఆ కార్యక్రమంలో ఇథియోపియాకు చెందిన ముగ్గురు గాయకులు, భారత జాతీయ గేయమైన వందేమాతరాన్ని ఆలపించారు. వారు ఆ గేయాన్ని పాడుతుండగా మోదీ రెండు చేతులు పైకెత్తి అభినందన పూర్వకంగా చాలాసేపు చప్పట్లు కొట్టారు. అనంతరం.. దీనికి సంబంధించిన ఓ వీడియోను మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వందేమాతర గేయం 150 ఏళ్ల వేడుకలను భారత్ జరుపుకొంటున్న సందర్భంగా ఇథియోపియా గడ్డమీద ఆ గేయాన్ని ఆలపించడం తననెంతో కదిలించిందని ఆ పోస్టులో ప్రధాని రాశారు.

ఒమన్ ఉప ప్రధాని స్వాగతం

బుధవారం సాయంత్రంతో ఇథియోపియాలో మోదీ రెండురోజుల పర్యటన ముగిసింది. తర్వాత ఆయన అక్కడి నుంచి రెండు రోజుల పర్యటన కోసం ఒమన్ రాజధాని మస్కట్‌కు మోదీ చేరుకున్నారు. ఈ పర్యటన సందర్భంగా భారత్, ఒమన్ మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) జరగనుంది. మోదీకి మస్కట్ విమానాశ్రయంలో ఆ దేశ ఉప ప్రధాని, రక్షణమంత్రి సయ్యద్ షీహాబ్ అల్ సయీద్ స్వాగతం పలికారు. ఒమన్ రాజు హైతం బిన్ తారిఖ్‌తో మోదీ గురువారం సమావేశం కానున్నారు. కస్టమ్స్, ఇతర సుంకాలను తొలగించడం ద్వారా ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా రెండేళ్లుగా భారత్ కృషిచేస్తోంది. ఒమన్‌తో వాణిజ్య ఒప్పందం దిశగా తాము ఆశావహంతో ఉన్నట్లు భారత రాయబారి జీవీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని బలుచిస్థాన్‌తో సరిహద్దు కలిగిన ఒమన్‌కు భారత్‌తో నౌకాదళ విన్యాసాలకు సంబంధించిన ఒప్పందం కూడా ఉంది. ఇరుదేశాల మధ్య ఎగుమతి, దిగుమతి సగానికిపైగా అంతరం ఉంది. ఆరోగ్యసేవలు, ఖనిజ, సహజ వాయువు అంశాలకు సంబంధించి భారతీయ వాణిజ్యవర్గాల డిమాండ్ ఒమన్ వద్ద పెండింగ్‌లో ఉండగా గురువారం జరగనున్న ఒప్పందంలో దీనిపై ఓ స్పష్టత వస్తుందని ఆశిస్తున్నారు. ఇక ఒమన్‌కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో వైద్యచికిత్స కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి వస్తున్న నేపథ్యంలో ఒమన్‌లో సొంతంగా అడుగుపెట్టాలని అపోలో చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. అపోలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి కూడా భారతీయ వాణిజ్య బృందంలో సభ్యురాలిగా ప్రస్తుతం మస్కట్‌లోనే ఉన్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీతో బహిరంగసభ ఏర్పాటు చేయాలని ప్రయత్నించినా కొన్ని కారణాల వల్ల అది సాధ్యం కాలేదని తెలుస్తోంది. కాగా జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల్లో నాలుగురోజుల పర్యటన నిమిత్తం మోదీ ఈనెల 15న ఢిల్లీ నుంచి బయలుదేరిన సంగతి తెలిసిందే. గురువారంతో మోదీ విదేశీ పర్యటన ముగియనుంది.

వాళ్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే!

» పార్టీ ఫిరాయించినట్లు ఆధారాల్లేవ్

» చట్టప్రకారం నిలబడే సాక్ష్యాధారాలు ఇవ్వలేదు

» టీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట లభించింది. బీఆర్ఎస్ తరపున గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ దాఖలైన అనర్హత పిటిషన్లను శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ కొట్టివేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలను పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్‌లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఐదుగురూ పార్టీ మారినట్లు నిరూపించే ఆధారాలను పిటిషనర్లు సమర్పించలేకపోయారని తెలిపారు. వీరు బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదిలేసుకున్నట్లేనని పేర్కొన్న పిటిషనర్లు.. ఆ విషయాన్ని నిరూపించలేకపోయారని స్పీకర్ చెప్పారు. పత్రికల్లోని వార్తలు, ధ్రువీకరించని టీవీ చానళ్ల వీడియోలు సమర్పించారు తప్ప చట్ట ప్రకారం నిలబడే ఆధారాలు చూపలేకపోయారని వెల్లడించారు. ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ, వారంతా ఎమ్మెల్యేలుగా కొనసాగుతారంటూ స్పీకర్ బుధవారం కీలక తీర్పు వెలువరించారు. గత శాసనసభ ఎన్నికల్లో అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరువు), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల) బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అనంతరం వీరు పార్టీ ఫిరాయించి, కాంగ్రెస్‌లో చేరారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభాపతికి ఫిర్యాదు చేశారు. వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరారు. తమ ఫిర్యాదుపై స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదంటూ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఫిరాయింపు ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లపై డిసెంబరు 19లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

టీసీఎస్, ఇన్ఫోసిస్‌పై హెచ్-1బీ ఫీజుల భారం!

న్యూఢిల్లీ, డిసెంబరు 17: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్-1బీ వీసాలపై విధించిన లక్ష డాలర్ల ఫీజు ఐటీ దిగ్గజ కంపెనీలకు భారంగా మారుతోంది. బ్లూమ్‌బెర్గ్ న్యూస్ విశ్లేషణ ప్రకారం.. హెచ్-1బీ ఉద్యోగులు అవసరమైన ఐటీ కంపెనీలకు మధ్యవర్తులుగా వ్యవహరించే బహుళజాతి సంస్థలపై ఈ విధానం తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. టీసీఎస్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు అమెరికా క్లయింట్ల కోసం పెద్దసంఖ్యలో విదేశీ నిపుణులను నియమించుకుంటున్నాయి. 2020 మే నుంచి 2024 మే మధ్య కాలంలో ఈ మూడు సంస్థల్లో దాదాపు 90శాతం కొత్త హెచ్-1బీ నియామకాలు అమెరికా కాన్సులేట్లలో ఆమోదం పొందాయి. అయితే, ప్రస్తుతం చట్టపరమైన సవాళ్ల కారణంగా హెచ్1బీ వీసాలకు లక్ష డాలర్ల ఫీజును తాత్కాలికంగా నిలిపివేసినా, ఈ వీసాకు డిమాండ్ బాగా తగ్గుతుందని, విదేశాల్లో నియామకాలు జోరందుకుంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆపరేషన్ సిందూర్ తొలి రోజే మనం ఓడిపోయాం

కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చౌహాన్ వ్యాఖ్యలు

» మన సాయుధ దళాలను అవమానించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది: బీజేపీ

» చౌహాన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్

» క్షమాపణ ఎందుకు చెప్పాలి.. ఆ ప్రసక్తే లేదు: చౌహాన్



న్యూఢిల్లీ, డిసెంబరు 17: ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ నేత, మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చౌహాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్ మొదటి రోజే మనం పూర్తిగా ఓడిపోయాం. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఇదే నిజం. మే 7న అరగంట పాటు జరిగిన గగనతల యుద్ధంలో భారత యుద్ధ విమానాలను పాకిస్థాన్ కూల్చివేసింది. దాంతో వైమానిక దళం మిగతా అన్ని యుద్ధ విమానాలను కిందకు దించేసింది. తర్వాత ఒక్కటి కూడా ఎగరలేదు. ఒకవేళ గ్వాలియర్, బఠిండా, సిర్సా నుంచి యుద్ధ విమానాలను పంపించినా పాకిస్థాన్ కూల్చివేసే ప్రమాదం ఉండడంతో వైమానిక దళం వెనక్కి తగ్గిందని చౌహాన్ వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన పుణెలో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో వైమానిక, క్షిపణి దాడులు మాత్రమే జరిగాయని, పదాతి దళాలు ఒక్క కిలోమీటరు కూడా కదల్లేదని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో యుద్ధాలు జరుగుతాయని, అలాంటప్పుడు 12 లక్షల మంది సైనికులతో ఆర్మీని నిర్వహించడం అవసరమా అని ప్రశ్నించారు. వారిని వేరే పనికి వినియోగించుకోవాలని సూచించారు. చౌహాన్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. మన సాయుధ దళాలను అవమానించడం, దేశ కోసం చేపట్టే ఆపరేషన్లను చులకన చేయడం కాంగ్రెస్‌కు రివాజుగా మారిందని బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. 'చౌహాన్ మాత్రమే కాదు.. గతంలో రాహుల్ గాంధీ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ఇవి మన సైన్యమంటే కాంగ్రెస్‌కు ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమ'న్నారు. మన సాయుధ దళాల పరాక్రమాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదని, చౌహాన్ క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ డిమాండ్ చేశారు. చౌహాన్ స్పందిస్తూ తాను క్షమాపణ ఎందుకు చెప్పాలని, ఆ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగం తనకు ప్రశ్నించే హక్కు ఇచ్చిందని పేర్కొన్నారు.

రాష్ట్రాలకు అత్యాధునిక అంబులెన్సులు

» 100 నుంచి 150 వరకూ ఇవ్వడానికి సిద్ధం

» 10 నిమిషాల్లో ప్రమాద స్థలానికి చేరాలి

» రాజ్యసభలో కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, డిసెంబరు 17: రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక మరణాలు సంభవించడంపై విచారం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ... రాష్ట్రాలకు అత్యాధునిక అంబులెన్సులను సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని రాజ్యసభలో ప్రకటించారు. అయితే అవి ప్రమాద స్థలానికి 10 నిమిషాల్లో చేరాలన్నదే తమ షరతని పేర్కొన్నారు. ఐఐఎం అధ్యయనం మేరకు ప్రమాద ఘటనా స్థలానికి అంబులెన్సు 10 నిమిషాల్లో చేరితే కనీసం 50వేల మందిని రక్షించగలిగే అవకాశం ఉండేదన్న విషయాన్ని గడ్కరీ అంగీకరిస్తూ... "ప్రమాద బాధితులను రక్షించే వారిని 'రహ్‌వీర్' పేరుతో గౌరవించాలని, వారికి రూ.25 వేలు ప్రోత్సాహక బహుమతిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంబులెన్సులను నడపడం జాతీయ రహదారుల బాధ్యత కాదు. అందుకని రాష్ట్ర ప్రభుత్వాలతో కిలోమీటర్ల పద్ధతిలో అంబులెన్సులను నడపడానికి ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించాం. కేంద్రం వారికి 100-150 అత్యాధునిక అంబులెన్సులను ఇవ్వడానికి సిద్ధంగా ఉంది" అని స్పష్టం చేశారు. కాగా, దేశ వ్యాప్తంగా 2026 చివరి నాటికి మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో, ఏఐ ఆధారిత జాతీయ రహదారి యాజమాన్య పద్ధతులను ప్రవేశపెట్టనున్నట్లు గడ్కరీ తెలిపారు. 'ఇది అమలులోకి వస్తే టోల్ గేట్ల వద్ద క్షణం కూడా ఆగాల్సిన అవసరం ఉండదు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.6వేల కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుంది' అన్నారు.

సిడ్నీ శివార్లలో తుపాకీ రాజ్యం!

» ప్రతి 33 మందిలో ఒకరికి లైసెన్స్..మొత్తం 11.3లక్షల తుపాకులు


సిడ్నీ, డిసెంబరు 17: అక్కడ ఎక్కడ చూసినా తుపాకులే! ఒక్కొక్కరి వద్ద వందల కొద్దీ గన్స్.. కావాలనుకున్నప్పుడు పెద్దదో, చిన్నదో ఓ తుపాకీ తీసుకుని బయల్దేరడమే!! ఆస్ట్రేలియాలో యూదులపై ఉగ్రదాడి జరిగిన సిడ్నీ బోండి బీచ్ ఉన్న న్యూసౌత్‌వేల్స్ రాష్ట్రం వ్యవహారమిది. బోండి బీచ్ దాడిలో 15 మంది మరణించిన నేపథ్యంలో.. ఆస్ట్రేలియా ఆయుధాల రిజిస్ట్రీ గణాంకాలతో 'సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్' పత్రిక తాజాగా కథనం ప్రచురించింది. ముఖ్యంగా బోండి బీచ్ సహా సిడ్నీ శివారు ప్రాంతాల్లో గన్ కల్చర్ ఎక్కువగా ఉన్నట్టు పేర్కొంది. ఆయుధాల రిజిస్ట్రీ వివరాల ప్రకారం.. ఆస్ట్రేలియా మొత్తంలో ఎక్కువ సంఖ్యలో వ్యక్తిగత తుపాకులున్న టాప్ 10 మందిలో ఆరుగురు సిడ్నీ శివారు ప్రాంతాల్లోనే ఉన్నారు. అందులో ఒకరి వద్ద ఏకంగా 295 ఆయుధాలు ఉన్నాయి. మిగతా ఐదుగురి వద్దా 200కుపైనే గన్స్ ఉన్నాయి. ఆస్ట్రేలియాలో తుపాకీ లైసెన్సు సులువుగానే లభిస్తుంది. లైసెన్సు ఉన్నవారు ఎన్ని గన్స్ అయినా కొనుక్కునే వెసులుబాటు ఉంటుంది. సగటున చూస్తే సిడ్నీ నగరంలో లైసెన్సు ఉన్న ఒక్కొక్కరి వద్ద సగటున 3కుపైగా గన్స్ ఉంటే.. న్యూసౌత్‌వేల్స్ రాష్ట్రంలో ఈ సగటు 5కుపైనే కావడం గమనార్హం. ఈ రాష్ట్రంలో సగటున ప్రతి 33 మంది జనాభాలో ఒకరికి తుపాకీ లైసెన్సు ఉంది. వారివద్ద మొత్తంగా 11,33,690 గన్స్ ఉన్నాయి. ఇక ది ఆస్ట్రేలియన్ క్రిమినల్ ఇంటెలిజెన్స్ కమిషన్ అంచనాల ప్రకారం.. మరో 2లక్షలకుపైనే అక్రమ ఆయుధాలు ఉన్నాయి.

ఉగ్రపోరులో కలిసి రండి!

» ఆస్ట్రేలియాలో కాల్పుల ఘటనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిలుపు



వాషింగ్టన్, డిసెంబరు 17: ఆస్ట్రేలియాలోని బోండి బీచ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంతర్జాతీయ సమాజానికి కీలక పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని అణిచివేసేందుకు దేశాలన్నీ కలిసి రావాలని ఆయన కోరారు. "ఇస్లామిక్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశాలన్నీ ఏకంకావాలి." అని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను 'రాడికల్ ఇస్లామిక్ టెర్రరిస్టులు'గా ఆయన పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో మంగళవారం జరిగిన 'హనుక్కా' కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. మరోవైపు.. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఖనన ప్రక్రియను ఆస్ట్రేలియా ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. మరోవైపు, దేశ, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని ట్రంప్ పలు దేశాల ప్రజలకు ప్రయాణ నిషేధం(ట్రావెల్ బ్యాన్) విధించిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో తాజాగా పాలస్తీనా సహా మరో 20 దేశాలను చేర్చారు. దీనికి సంబంధించిన ప్రకటనపై మంగళవారం ట్రంప్ సంతకం చేశారు. ఆయా దేశాల ప్రజలు అగ్రరాజ్యంలోకి ప్రవేశించేందుకు మరిన్ని పరిమితులు, నిబంధనలు విస్తరించారు. మరో 15 దేశాలపై పాక్షిక నిబంధనలు వర్తింపజేశారు.



గ్లాస్ బ్రిడ్జిపై అమెరికన్ కాన్సుల్ జనరల్

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కైలాసగిరిపై కొత్తగా ఏర్పాటు చేసిన గ్లాస్ బ్రిడ్జిని అమెరికన్ కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) లారా విలియమ్స్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సముద్ర తీరాన కొండపై నిర్మించిన ఈ నిర్మాణం ఆకర్షణీయంగా ఉందని, గ్లాస్ బ్రిడ్జి పై నుంచి సముద్రం, విశాఖ నగరం చాలా అందంగా కనిపిస్తున్నాయని తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే మంచి ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చారని ప్రశంసించారు.

కంభంపాటి రామ్మోహనరావుకు మాతృ వియోగం

ఉంగుటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ్మోహనరావు తల్లి వెంకట నరసమ్మ (99) కన్నుమూశారు. కృష్ణాజిల్లా పెదఅవుటపల్లిలోని స్వగృహంలో నివాసముంటున్న వెంకటనరసమ్మ మంగళవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. పిన్నమనేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. వెంకటనరసమ్మకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. కుమార్తె గృహిణి కాగా, పెద్దకుమారుడు కంభంపాటి వెంకటేశ్వరరావు రైతుగా గన్నవరంలో స్థిరపడ్డారు. రెండో కుమారుడు కంభంపాటి రామ్మోహనరావు రాజకీయ నాయకులుగా, పారిశ్రామికవేత్తగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

కంభంపాటికి సీఎం పరామర్శ

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కంభంపాటి రామ్మోహన్‌రావు తల్లి వెంకట నరసమ్మ మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. బుధవారం రాత్రి రామ్మోహన్‌రావును ఫోన్‌లో పరామర్శించారు. కంభంపాటి రామ్మోహన్‌రావు తల్లి వెంకట నరసమ్మ మరణంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామ్మోహన్‌రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాగా, చిత్తూరు టీడీపీ సీనియర్ నేత రామచంద్ర రాజు కుటుంబసభ్యులకూ చంద్రబాబు ఫోన్ చేసి పరామర్శించారు. ఎన్టీఆర్ రాజుగా పిలుచుకునే రామచంద్రరాజు బుధవారం కన్నుమూశారు.

ముంచెత్తుతున్న పొగమంచు..!

దేశవ్యాప్తంగా స్తంభిస్తున్న జన జీవనం.. అనేక ప్రాంతాల్లో అధిక పీడన ప్రభావం..

- తూర్పుగాలులు, వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ బలహీనం
- ఈ ఏడాది ముందే కురుస్తున్న పొగమంచు

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అసలే చలికాలం.. ఆపై పొగమంచు.. దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతోంది..! సాధారణంగా డిసెంబరు నెలాఖరు నుంచి జనవరి/ఫిబ్రవరి నెలల్లో కురిసే పొగమంచు ఈ ఏడాది ముందుగానే... అది కూడా దట్టంగా కురవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా రవాణా వ్యవస్థపై ఇది అధిక ప్రభావం చూపుతోంది. తెల్లవారుజామున మూడు/నాలుగు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ పొగమంచు కమ్మేయడంతో జనజీవనం స్తంభిస్తోంది. పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అధికపీడనం, వర్షాలు కురిసేలా వెస్ట్రన్ డిస్ట్రబెన్స్‌లు బలహీనంగా మారడం, తూర్పుగాలుల ప్రభావం లేకపోవడం, స్థిరమైన వాతావరణ పరిస్థితులు నెలకొనడం వల్ల పొగమంచు దట్టంగా కురుస్తోందని వాతావరణ నిపుణుడొకరు విశ్లేషించారు. ఇంకా అనేక ప్రాంతాల్లో గడ్డకట్టేలా చలి కొనసాగడంతో పొగమంచు తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా దేశం మొత్తం అధికపీడనం (యాంటీ సైక్లోన్) నెలకొని ఉంది. శీతాకాలంలో వాయవ్య భారతంలో మాత్రమే నెలకొనే అధికపీడనం ఈ ఏడాది దేశంలో అనేక ప్రాంతాలకు విస్తరించింది. అందువల్ల ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు, తూర్పు భారతం నుంచి పశ్చిమ భారతం వరకూ అనేక ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా ఉంటోంది. పగటిపూట ఆకాశం నిర్మలంగా ఉండడం.. రాత్రి పూట భూమి వేగంగా చల్లబడడంతో అర్ధరాత్రి తర్వాత మంచు కురుస్తోంది. దీనికి వాతావరణంలోని కాలుష్యం తోడవడంతో అనేక ప్రాంతాల్లో పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాదిలో ప్రధానంగా ఢిల్లీ, హరియాణా, ఉత్తరప్రదేశ్‌తోపాటు దేశంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నగరాలు, పట్టణాల్లో పొగమంచు కురుస్తోందని పేర్కొంటున్నారు. అధిక పీడనం ప్రభావంతోపాటు తూర్పుగాలులు, వెస్ట్రన్ డిస్ట్రబెన్స్‌లు బలహీనంగా ఉండడంతో పొగమంచు కురుస్తోందని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. కొన్నిచోట్ల బుధవారం విజిబిలిటీ 500 మీటర్ల కంటే తక్కువకు పడిపోయిందని పేర్కొన్నారు. బలమైన వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ సంభవిస్తే ఉత్తరాది నుంచి మధ్యభారతం వరకూ దాని ప్రభావం కొనసాగి వర్షాలు కురుస్తాయని, అలాంటప్పుడు పొగమంచు తక్కువగా కురుస్తుందని పేర్కొన్నారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో కురుస్తున్న మంచు

జి.మాడుగులలో 5.4 డిగ్రీలు

రాష్ట్రంలో బుధవారం అనేక ప్రాంతాల్లో చలి ప్రభావం కొనసాగింది. పొగమంచు దట్టంగా కురిసింది. విశాఖ ఎయిర్‌పోర్టులో బుధవారం ఏడు గంటలకు విజిబిలిటీ 800 మీటర్లకు పడిపోయింది. ఏజెన్సీలో విజిబిలిటీ 200 మీటర్ల కంటే తక్కువకు పడిపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 5.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఒకే రోజులో 3.11 లక్షలకు పైగా కేసులు పరిష్కారం

- లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 13న నిర్వహించిన లోక్ అదాలత్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఒక్క రోజే రికార్డు స్థాయిలో 3.11 లక్షలకు పైగా క్రిమినల్, సివిల్, ప్రమాద బీమా, వివాహ సంబంధ, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం రూ.400 కోట్ల పరిహారాన్ని అందజేశారు. లోక్ అదాలత్‌లో ఈ స్థాయిలో పెండింగ్ కేసులు పరిష్కారం కావడం ఇదే మొదటిసారి. లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించడానికి, ఇంత పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం కావడానికి హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ మార్గదర్శకంలో 13 జిల్లాల న్యాయసేవాధికార సంస్థలు సుదీర్ఘ కసరత్తు చేశాయి. వివిధ శాఖలను సమన్వయ పరిచేందుకు అధికారులతో 969 సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు 2,122 ప్రి లోక్ అదాలత్ సిట్టింగులు నిర్వహించాయి. కేసులు పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దిగువ కోర్టుల్లో 433 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. లోక్ అదాలత్ ద్వారా ఎటువంటి ఖర్చు లేకుండా తక్కువ సమయంలో న్యాయం పొందవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ కోరారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని, దీనిపై ఎలాంటి అప్పీల్ ఉండదని తెలిపారు. ఈ మేరకు ఏపీఎస్ఎల్ఎస్ఏ సభ్య కార్యదర్శి బీఎస్‌వి హిమబిందు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించండి

- హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నేతలు మడ్వి హిడ్మా, మడ్వి రాజే అలియాస్ రాజక్క, మరో నలుగురు నక్సల్స్ ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... మెజిస్టీరియల్ విచారణ పై పిటిషనర్లకు అభ్యంతరం ఉంటే సెషన్స్ జడ్జిని ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును కోర్టు ముందు ఉంచారు. ఆ తీర్పును అధ్యయనం చేసి రావాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఎన్‌కౌంటర్ ఘటన పై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని కోరుతూ పీపుల్స్ యునిటీ ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరమ్ జాతీయ అధ్యక్షురాలు జయ వింధ్యాల హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది చల్లా శ్రీనివాసరెడ్డి వాదనలు వినిపిస్తూ... మావోయిస్టు నేతలను ఈ ఏడాది నవంబర్ 15న అదుపులోకి తీసుకొని, అదే నెల 18న ఫేక్ ఎన్‌కౌంటర్ చేశారన్నారు. ఈ మరణాలపై జ్యుడీషియల్ విచారణ జరిగితేనే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తివేయాలి

- ఢిల్లీలో ఏపీ ఎమ్మార్పీఎస్ ధర్నా

న్యూఢిల్లీ: రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేసేందుకు పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఏపీ ఎమ్మార్పీఎస్) డిమాండ్ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 80 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేసింది. ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అధ్వర్యంలో బుధవారం జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఏపీలో దళిత, గిరిజన జనాభా ప్రతిపాదికన అసెంబ్లీ, పార్లమెంటు కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలని కోరారు. తెలుగు రాష్ట్రాల్లో దేశానికి 2వ రాజధానిని ఏర్పాటు చేయాలన్నారు.


సత్యవర్ధన్ కేసులో నలుగురికి పోలీసు కస్టడీ

విజయవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో తాజాగా అరెస్టయిన నలుగురు నిందితులను పోలీసు కస్టడీకి ఇస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. కొమ్మా కోట్లు, వజ్రకుమార్, ఎర్రంశెట్టి రామాంజనేయులు ప్రస్తుతం నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న విషయం తెలిసిందే. మరో నిందితుడు యతేంద్ర రామకృష్ణ గన్నవరం సబ్ జైలులో ఉన్నాడు. వారిని నాలుగు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పటమట పోలీసులు కొద్దిరోజుల క్రితం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో తీర్పు వెలువరించారు. నలుగురు నిందితులను గురు, శుక్రవారాల్లో కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

కస్టడీకి వచ్చేది ముగ్గురే

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నలుగురు నిందితులను కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ముగ్గురిని మాత్రమే జైలు అధికారులు అప్పగిస్తారు. ఈ కేసులో కొమ్మా కోట్లు, వజ్రకుమార్, రామాంజనేయులు, యతేంద్ర రామకృష్ణను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినప్పుడు రిమాండ్ విధించే సమయంలో న్యాయాధికారి నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశాలిచ్చారు. ఇది జరిగిన తర్వాత యతేంద్ర రామకృష్ణపై గన్నవరం కోర్టు పీటీ వారెంట్‌ను అనుమతించింది. దీంతో పోలీసులు నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న యతేంద్ర రామకృష్ణను తీసుకొచ్చి కొద్దిరోజుల క్రితం గన్నవరం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి అతడికి రిమాండ్ విధిస్తూ గన్నవరం సబ్ జైలుకు తరలించాలని ఆదేశాలిచ్చారు. అప్పటి నుంచి రామకృష్ణ అక్కడే ఉంటున్నాడు. ఏసీబీ కోర్టు మాత్రం ఈ నలుగురు నెల్లూరు జైల్లో ఉన్నందున వారిని రెండు రోజుల కస్టడీకి అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఉత్తర్వులు నెల్లూరు కేంద్ర కారాగారం అని స్పష్టంగా ఉండటంతో గన్నవరం సబ్‌జైలు అధికారులు రామకృష్ణను పోలీసులకు అప్పగించే అవకాశాలు ఏమాత్రం ఉండవు. దీంతో నెల్లూరులో ఉన్న ముగ్గురు నిందితుల్నే పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. రామకృష్ణ కోసం మరో పిటిషన్‌ను మళ్లీ కోర్టులో దాఖలు చేస్తారని తెలిసింది. యతేంద్ర రామకృష్ణ గన్నవరం సబ్‌జైలులో ఉన్నందున ఆ జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరాలని భావిస్తున్నారు.

టీటీడీకి రూ.1.20 కోట్ల విలువైన బ్లేడ్లు విరాళం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో దాత శ్రీధర్ దంపతులు

తిరుమల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి బుధవారం రూ.1.20 కోట్ల విలువైన బ్లేడ్లు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన వర్టెక్స్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ శ్రీధర్ బోడుపల్లి ఏడాదికి సరిపడా సిల్వర్ మాక్స్ హాఫ్ బ్లేడ్లను అందజేశారు. తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయన చైర్మన్ బీఆర్ నాయుడుకు వాటి ని అందజేశారు. భక్తుల తలనీలాల సమర్పణ కోసం రోజుకు 40 వేల హాఫ్ బ్లేడ్లను టీటీడీ వినియోగిస్తోంది.ఈ బ్లేడ్ల కోసం ఏడాదికి రూ1.16 కోట్లు ఖర్చు చేస్తోంది. ఏడాదికి సరిపడా బ్లేడ్లను విరాళంగా ఇచ్చిన దాతను చైర్మన్ అభినందించారు.

న్యాయ వ్యాజ్య విధానం-2025 పరిశీలనకు మంత్రివర్గ ఉప సంఘం

- సత్వర న్యాయానికి చర్యలు: మంత్రి ఫరూక్

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యాజ్య విధానం-2025 పరిశీలనకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సత్వర న్యాయానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని పెంపొందించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం, సకాలంలో ప్రతిభావంతమైన వివాద పరిష్కారాన్ని చూపడం, పారదర్శకత, వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. మంత్రుల కమిటీలో తనతో పాటు సత్యప్రసాద్, అనిత, మనోహర్, సత్యకుమార్ యాదవ్ ఉన్నారని తెలిపారు.

జగన్ తక్షణమే హిందువులకు క్షమాపణ చెప్పాలి

- పరకామణి వ్యవహారంలో ఆయన వ్యాఖ్యలు దారుణం
- ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



శ్రీనివాసానంద సరస్వతి

డాబాగార్డెన్స్(విశాఖపట్నం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణిలో చోరీని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్న విషయమేనంటూ కొట్టిపారేయడం దారుణమని, తక్షణమే ఆ వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకొని హిందువులకు క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. బుధవారం విశాఖపట్నంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా సేవలందించిన వ్యక్తి ఈ తరహా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. పరకామణి కేసును హైకోర్టు సైతం తీవ్రంగా పరిగణించిందని వెల్లడించారు. హిందువులపైన, హిందూ దేవాలయాలపై జగన్‌కు ఎందుకంత ద్వేషమో అర్థం కావడం లేదన్నారు. లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేయించినట్టు డ్రామా ఆడారన్నారు. గతంలో టీటీడీ చైర్మన్‌గా వ్యవహరించిన వైవీ సుబ్బారెడ్డి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం జరిగిందని శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. ఒక సాధారణ ఉద్యోగి రూ.14.4 కోట్లు తిరిగి ఎలా వెనక్కి ఇచ్చారో చెప్పాలన్నారు. అంటే.. ఎంత మొత్తంలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. జగన్‌కు హిందువులెవరూ ఓట్లు వేయలేదా? అని ప్రశ్నించారు. మెజారిటీ శాతం హిందువుల ఓట్లతోనే జగన్ నాడు అధికారం చేపట్టారన్నారు. పరకామణిలో దొంగతనం చేసిన వ్యక్తిని జగన్ వెనకేసుకురావడం దారుణమని పేర్కొన్నారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే ఇప్పటికే 11 సీట్లు ఇచ్చిన ప్రజలు 11లో ఒకటి తీసి ఒక్కసీటుకే పరిమితం చేస్తారని హెచ్చరించారు.

రెండు ఇండిగో విమాన సర్వీసులు రద్దు

గోపాలపట్నం (విశాఖపట్నం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ విమానాశ్రయం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన రెండు విమానాలను సాంకేతిక కారణాలతో బుధవారం రద్దు చేశారు. ఇవి సాయంత్రం 4 గంటలకు, రాత్రి 10.50 గంటలకు వెళ్లాల్సిన సర్వీసులుగా విమానాశ్రయ అధికారులు తెలిపారు.

కర్నూలులో లోకాయుక్త... విధాన నిర్ణయం

- అందులో మేము ఎలా జోక్యం చేసుకోగలం?
- మాకూ కొన్ని పరిధులు ఉంటాయి: హైకోర్టు
- కౌంటర్‌ను పరిశీలించి రావాలని పిటిషనర్‌కు సూచన

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌హెచ్‌ఆర్సీ, లోకాయుక్త కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి బుధవారం హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం 2021లో ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ రికార్డుల్లో లేకపోవడంతో విచారణను వాయిదా వేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ... కర్నూలులో ఏపీఎస్‌హెచ్‌ఆర్సీ, లోకాయుక్త ఏర్పాటు విధానపరమైన నిర్ణయమని, పాలసీ నిర్ణయాలలో తాము ఎలా జోక్యం చేసుకోగలమని పిటిషనర్‌ను ప్రశ్నించింది. తమకూ కొన్ని పరిధులు ఉంటాయని వ్యాఖ్యానించింది. ఏపీ పునర్విభజన చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఏపీ లోకాయుక్త, రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ప్రధాన కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరుతూ డాక్టర్ మద్దిపాటి శైలజ 2021లో హైకోర్టులో పిల్ వేశారు. మానవహక్కుల కమిషన్‌లో సిబ్బంది నియామకంతో పాటు ఫిర్యాదులు స్వీకరణకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ మరో పిల్ వేసింది. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది డీఎస్ఎన్‌వీ ప్రసాద్‌బాబు వాదనలు వినిపించారు. ఏపీహెచ్‌ఆర్సీ, ఏపీ లోకాయుక్త కార్యాలయాలు హైదరాబాద్ నుండి విజయవాడ తరలించాలని నిర్ణయించారని ఆయన పేర్కొన్నారు.

తొలి తెలుగు శాసనానికి అందలం!

కలమల్ల శాసనం తెలుగు ప్రాచీనతకు సాక్ష్యం.. మొత్తం 11 పంక్తులకు గాను మిగిలింది ఏడే

- 1904లో నమోదు చేసిన పురావస్తు శాఖ
- మళ్లీ 2022లో కలమల్లలోనే గుర్తింపు
- ఈ నెల 21న కడపలో నమూనా ఆవిష్కరణ



కలమల్లలో ఉన్న తొలి తెలుగు శిలా శాసనం



21న ఆవిష్కరించనున్న శాసనం నమూనా

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలో ఉన్న చెన్నకేశవ-సిద్ధేశ్వర ఆలయంలో 6వ శతాబ్దానికి చెందిన కలమల్ల శాసనం తెలుగు భాషా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. చోళరాజు ధనుంజయుడు దీన్ని రాయించారని చరిత్రకారులు గుర్తించారు. ఈ శాసనంలో మొత్తం 11 పంక్తులు ఉండగా ప్రస్తుతం ఏడు మాత్రమే మిగిలాయి. 'ఎరికల్ ముత్తురాజు అనే బిరుదు గల రాజు' అంటూ ప్రారంభమై 'ఈ శాసనానికి ఎటువంటి ఆటంకం కలిగించినా.. వారు పంచ మహాపాతకులవుతారని' పేర్కొంటూ ముగుస్తుంది. బ్రాహ్మీ లిపి నుంచి తెలుగు లిపి పరిణామం చెందిన క్రమం దీని ద్వారా తెలుస్తుంది. 'వారు' అనే బహువచన పద వాడకం ఇందులో కనిపిస్తోంది. 1904లో భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ) ఈ శాసనాన్ని నమోదు చేసింది. ఇది పూర్తిగా తెలుగులో ఉండటం విశేషం. కాగా.. ప్రారంభంలో సుమారు 5.6 అడుగుల ఎత్తున్న ఈ రాతి శాసనం ప్రస్తుతం 4 అడుగులకు పరిమితమైంది. అక్షరాలు మసకబారి చదవలేని స్థితికి చేరాయి. పురావస్తు శాఖ 1904లో నమోదు చేసినా.. ఆ శాసనం ఎక్కడ ఉందో తర్వాత ఎవరికీ తెలీదు. 2012లో తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఈ శాసనం కోసం అన్వేషణ సాగింది. దీంతో భాషావేత్త, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, అప్పటి ఏఎస్ఐ శాసన విభాగం డైరెక్టర్ కె.మునిరత్నంరెడ్డి నేతృత్వంలో చెన్నై ఎగ్మోర్ మ్యూజియం, లండన్ మ్యూజియం వరకు అన్వేషించినా ఫలితం లభించలేదు. చివరకు 2022 జనవరిలో కలమల్ల గ్రామంలోనే ఈ శాసనాన్ని గుర్తించారు. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ భవిష్యత్తులో అంతరించి పోయే దశలో ఉంది. దీంతో ఈ శిలాశాసనాన్ని కాపాడాలనే ఉద్దేశంతో జానమద్ది సాహితీ పీఠం చొరవతో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కడప సీపీ బ్రౌన్ పరిశోధనా కేంద్రంలో దీని నమూనా (రెప్లికా)ను ఏర్పాటు చేశారు. దీనిని జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న ఆవిష్కరించనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మైత్రీమత్సరాలు

బంగ్లాదేశ్ హైకమిషనర్ రిజాజ్ హమీదుల్లాకు భారత విదేశాంగ సమన్లు జారీచేసి, పొరుగుదేశంలో భద్రతాపరిస్థితులమీద ఆందోళన వెలిబుచ్చింది. బుధవారం మధ్యాహ్నం భారత దౌత్యకార్యాలయం ముట్టడికి బంగ్లాదేశ్‌లోని 'జూలై ఐక్య మంచ్' పిలుపునిచ్చిన వెంటనే, హైకమిషనర్‌ను పిలిపించుకొని భారత కార్యాలయాల రక్షణకు, సిబ్బంది భద్రతకు లోటు రానివ్వవద్దని హెచ్చరించింది. బంగ్లా రాజకీయాల్లో భారత్ వేలుపెడుతోందన్న ఆరోపణతో సదరు సంస్థ ఈ ముట్టడి కార్యక్రమాన్ని ప్రకటించింది. పోలీసులు మధ్యలోనే దానిని నిలువరించి, భారత దౌత్యకార్యాలయం వరకూ పోనివ్వలేదు.

బంగ్లాదేశ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న ఎన్నికలు ప్రకటించిన నేపథ్యంలో, భారత్ లక్ష్యంగా అక్కడ రాజకీయం వేడెక్కింది. పలువురు విద్యార్థి నాయకులు నోటికి అడ్డూఆపూ లేకుండా మాట్లాడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ విషం ఎక్కువైంది. గతవారం అక్కడ ఎన్నికలు ప్రకటించిన కొద్దిగంటల్లోనే షరీఫ్ ఉస్మాన్ హడి అనే విద్యార్థి నాయకుడిమీద హత్యాయత్నం జరిగింది. హసీనా ప్రభుత్వాన్ని గద్దెదించిన ఉద్యమంలో ఇతనిది కీలక పాత్ర. ఆమె దేశం విడిచిపోయినప్పటికీ, ఆమె పార్టీ మళ్ళీ ఎన్నికల్లో పాల్గొనడానికి వీల్లేకుండా అవామీలీగ్ రద్దుకోసం ఇతడి ఇంక్విలాబ్ మంచా సంస్థ పట్టుబట్టి సాధించింది. ఈ దాడిలో అతను ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో చేరిన వెంటనే బంగ్లాదేశ్ విదేశాంగశాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ భారత్‌ను నిందించింది. షేక్ హసీనా, అవామీలీగ్‌కు చెందిన ఇతర నాయకులు బంగ్లాదేశ్‌లో ఉగ్రదాడులకు పాల్పడుతున్నారని, ఉస్మాన్ హడి హంతకులు బంగ్లాదేశ్ దాటిపోకుండా భారత్ నిలువరించాలని అందులో పేర్కొంది. దీనిని భారత్ తీవ్రంగా ఖండించిన విషయాన్ని అటుంచితే, ఈ ప్రకటన అక్కడి రాడికల్ శక్తులకు మంచి ఉత్సాహాన్నిచ్చింది. నిన్నటివరకూ తాత్కాలిక ప్రభుత్వంలో ఉండి, రేపటి ఎన్నికల్లో పాల్గొనడం కోసం రాజీనామా చేసిన ఒక విద్యార్థినాయకుడు ఉగ్రవాదాన్ని ఎగుమతిచేస్తున్న భారత్ ఇకపై క్షేమంగా ఉండలేదని ఓ హెచ్చరిక చేశాడు. నేషనల్ సిటిజన్ పార్టీకి చెందిన హస్నత్ అబ్దుల్లా భారత్‌ను శత్రుదేశంగా ప్రకటించి, ఈశాన్యాన్ని విడగొడతామని హెచ్చరించాడు. 'జూలై యోధుల' ప్రాణరక్షణకోసం అవామీలీగ్ ఉగ్రవాదులను, వారికి అండగా ఉంటున్నవారినీ శిక్షించాలని ఇతడు డిమాండ్ చేస్తున్నాడు.

ఇప్పటికే దెబ్బతిన్న భారత్–బంగ్లా సంబంధాలు అక్కడ ఎన్నికల తేదీ ప్రకటన, అనంతర పరిణామాలతో మరింత దిగజారాయి. దాదాపు పన్నెండుకోట్ల డెబ్బయ్ఆరులక్షలమంది ఓటర్లు ఫిబ్రవరి 12న ఓటు చేయబోతున్నారు. షేక్ హసీనాపార్టీకి ఈ ఎన్నికల్లో స్థానం లేకపోవడంతో పాటు, ఆమె ప్రత్యర్థి, బీఎన్‌పీ అధినేత ఖలేదా జియా తీవ్ర అనారోగ్యంతో వెంటిలేటర్ మీద ఉన్నారు. ఖలేదా పార్టీ అత్యధిక స్థానాల్లో పోటీచేస్తున్న నేపథ్యంలో, ఎన్నికలు సమీపిస్తున్నదశలో ఆమె ఆరోగ్యస్థితి కూడా ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. పదిహేడు సంవత్సరాలుగా లండన్‌లో ఉంటున్న ఆమె కుమారుడు తారీఖ్ రహ్మాన్ డిసెంబరు 25న స్వదేశంలో అడుగుపెట్టబోతున్నారు. ఈ ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధిస్తుందని, తారిఖ్ రహ్మాన్ ప్రధాని అవుతారని విశ్లేషకులు అంచనా కడుతున్నారు. జమాత్–ఎ–ఇస్లామీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరిస్తుందట. ప్రజాభిప్రాయ సేకరణ కూడా ఈ ఎన్నికలతో పాటుగానే నిర్వహించాలన్నది సాహసోపేతమైన నిర్ణయం. జూలై తిరుగుబాటు అనంతరం అన్ని పార్టీలు ఒక్కటిగా సంకల్పించిన రాజ్యాంగ, రాజకీయ సంస్కరణలమీద ప్రజలు అదేరోజున ఓటుచేయబోతున్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం స్వతంత్రతలను బలోపేతం చేయడం, కార్యనిర్వాహక వ్యవస్థ అధికారాలకు కత్తెరవేయడం, శాంతిభద్రతల యంత్రాంగం దుర్వినియోగం కాకుండా చూడటం వంటి అనేక ఆదర్శాలు ఈ రెఫరెండమ్‌లో ఉన్నాయి. భారత్–బంగ్లా సంబంధాలు ప్రస్తుతానికి దిగజారినా, బంగ్లాదేశ్‌లో ఎన్నికలు సక్రమంగా జరిగి, అక్కడ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తిరిగి బలోపేతమవుతాయని కొందరి ఆశ. 54వ విజయ్‌దివస్ సందర్భంగా మంగళవారం కోల్‌కోతాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనడానికి బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మాజీ సైనికాధికారులు ఇదే హామీ ఇస్తున్నారు. హసీనా పతనం అనంతరం పొరుగుదేశంలో జరుగుతున్న పరిణామాలు నిరాశ కలిగిస్తున్నప్పటికీ, ఈ ముక్తిజోధాల మాట నిజం కావాలని కోరుకుందాం.

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

దేశంలో ముస్లిం జనాభా సుమారు 19.7 కోట్లు. మొత్తం జనాభాలో 14.2 శాతం. ఈ విస్తృత జనాభాలో పెద్ద భాగం ఇప్పటికీ ఆర్థికంగా వెనుకబడి జీవిస్తోంది. దీనికి ప్రధాన కారణం విద్యా లోపం. ఇందుకు ముస్లింల అవగాహనా రాహిత్యంతో పాటు, పాలకుల నిర్లక్ష్యం కూడా ఉంది. 2011 జనగణన గణాంకాల ప్రకారం దేశంలోని ముస్లింల అక్షరాస్యత రేటు 57.28 శాతం. ఇతర మత సమూహాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువే. విద్యా సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయల ఖర్చు చేశాక కూడా ముస్లింల విద్యా స్థితిలో గణనీయమైన మార్పు రాలేదు. ఇంకో విషయం ఏమిటంటే, 2011 తర్వాత మతాల వారీగా అక్షరాస్యతపై తాజా అధికారిక గణాంకాలను ప్రభుత్వం విడుదల చేయలేదు.

కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన ఏఐఎస్‌హెచ్ఈ (ఆలిండియా సర్వే ఆన్ హైయ్యర్ ఎడ్యుకేషన్) గణాంకాల ప్రకారం, దేశంలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో ముస్లింల వాటా ఐదు శాతం లోపే ఉంది. అంటే జనాభాలో 14 శాతానికి పైబడి ఉన్న సమాజం.. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో మూడో వంతు కూడా ప్రాతినిధ్యం పొందలేకపోతోంది. ఈ వాస్తవం ఉద్యోగ రంగాల్లో వారి వెనుకబాటుకు ప్రత్యక్ష కారణమవుతోంది. ఆర్థిక వెనుకబాటు, విద్యా లోపం...



ముస్లిం సమాజాన్ని రెంటికీ చెడ్డ రేవడిలా మార్చాయి. ప్రభుత్వ పాఠశాలలు బాధ్యతాయుతంగా పనిచేయకపోవడం, ప్రైవేట్ లేదా కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో ముస్లిం పిల్లలు మధ్యలోనే చదువును వదిలేస్తున్నారు. ఐదు నుంచి తొమ్మిదేళ్ల మధ్య వయసున్న ముస్లిం పిల్లల్లో ఎక్కువ మంది పాఠశాలల వెలుపలే ఉన్నారని ప్రభుత్వ సర్వేలు చెబుతున్నాయి. ఏదో ఒక విధంగా ఉన్నత చదువులు పూర్తి చేసినా ఉద్యోగాలు అంత సులభంగా దొరకడం లేదు. ప్రభుత్వ రంగంలోనే కాదు, ప్రైవేట్ రంగంలో కూడా వారిపై వివక్ష కొనసాగుతోంది. కొన్ని రంగాల్లో ముస్లింలకు ఉద్యోగాలు ఇవ్వకూడదన్న ధోరణి అనధికారికంగా కొనసాగుతోంది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 543 సభ్యుల్లో కేవలం 24 మంది మాత్రమే ముస్లిం ఎంపీలు ఉన్నారు. అంటే వీరి ప్రాతినిధ్యం సుమారు 4.4 శాతం మాత్రమే. వారి జనాభా వాటాతో పోలిస్తే ఇది చాలా తక్కువ. రాష్ట్ర శాసనసభల్లో కూడా పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. అనేక రాష్ట్రాల్లో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేరు. దేశంలోని అతిపెద్ద మైనారిటీ సమాజం అన్ని రంగాల్లో హక్కుల నిరాకరణకు గురవుతుంటే స్వాతంత్ర్యానికి, అభివృద్ధి–వికాసాలకు అర్థం ఏముంటుంది? భారత్ లాంటి లౌకిక, ప్రజాస్వామ్య దేశానికి ఇది ఎంతమాత్రం శోభించదు. మైనారిటీల హక్కుల ఉల్లంఘన, వివక్ష, పక్షపాత విధానాలను ఇలాగే కొనసాగిస్తే, అనేక త్యాగాలతో సాధించుకున్న స్వతంత్ర భారత భవిష్యత్తు కచ్చితంగా మసకబారుతుంది.

ఇప్పటికైనా పాలకవర్గాలు కళ్లు తెరిచి ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, రాజ్యాంగబద్ధమైన హక్కులను వారికి అందించడానికి నిజాయితీగా ప్రయత్నించాలి. సచార్ కమిటీ నివేదికను సమగ్రంగా అమలు చేయాలి. అదే సమయంలో ముస్లింలు కూడా ఎవరో ఏదో చేస్తారని ఎదురుచూడకుండా, తమ హక్కుల సాధనకు సామాజిక చైతన్యంతో, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలి. ప్రజాప్రాతినిధ్య చట్టాల్లో తమ హక్కుల వాటా కోసం కార్యాచరణ రూపొందించుకోవాలి.

● యం.డి. ఉస్మాన్ ఖాన్

(నేడు జాతీయ మైనారిటీ హక్కుల దినోత్సవం)

సర్ 2.0: పదికోట్ల ఓట్లకు ఎసరు!

బిహార్‌లో కంటే మెరుగ్గా ఉన్నదా? లేనే లేదు. దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలవుతున్న రెండవ విడత 'ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –సర్) గురించి మేము ప్రస్తావిస్తున్నాము. ఈ రెండో విడతలో ఓట్ల తొలగింపు మరింత అధికంగా, మరింత నష్టదాయకంగా ఉంటుందనేది స్పష్టం. ఐదు రాష్ట్రాలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని, మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వెలువడుతున్న వార్తలను సమష్టిగా పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతమున్న ఓటర్ జాబితాల నుంచి 11 కోట్ల పేర్లు సంభావ్య తొలగింపులకు గురయ్యేందుకు ఆస్కారమున్నది. ఈ రెండో విడతలో తుది తొలగింపుల సంఖ్య కొంచెం తక్కువగా ఉండవచ్చు. అయితే దేశంలోని మొత్తం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సర్ ప్రక్రియ పూర్తయినప్పుడు దాదాపు పది కోట్ల తొలగింపులను మనం చూసే అవకాశమున్నది.



■ యోగేంద్ర యాదవ్

పది కోట్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోవడమనేది భారత ప్రజాస్వామ్యానికి శుభప్రదమేనా? కానేకాదు. ఇది స్పష్టం. అయినా ఈ రాబోయే విపత్తు పతాకశీర్షికలలో ఉండడం లేదు. సంబంధిత సమాచారం చెల్లాచెదురుగా, క్రమరహితంగా ఉండడమే అందుకు కారణమని చెప్పవచ్చు. బిహార్ ఎన్నికల తరువాత జాతీయ పత్రికలలో సర్ గురించిన వార్తలు బాగా తగ్గిపోయాయి. ప్రాంతీయ మీడియాకు, స్థానిక పేజీలకు మాత్రమే పరిమితమైపోయాయి. ఓటర్ నమోదు గడువును ఈసీఐ (భారత ఎన్నికల సంఘం) పదే పదే పొడిగిస్తోంది. తుది ఓటర్ జాబితాలు నాలుగు విడతలుగా అందుబాటులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. తొలగింపు నెదుర్కొంటున్న వారి సంఖ్య; పాత ఓటర్ జాబితాలతో తమ పేర్లను సంధానించుకోలేక సంభావ్య తొలగింపు నెదుర్కొంటున్న వారి సంఖ్య.

ఐదు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల (రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, గోవా, లక్షద్వీప్, పాండిచ్చేరి) ముసాయిదా ఓటర్ జాబితాల విడుదలతో ప్రత్యేక సమగ్ర సవరణ నిజమైన వాస్తవాలను బహిరంగపరిచింది. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన సమాచారానికి మీడియా వార్తలే ఆధారంగా ఉన్నాయి. ఇవి వాస్తవ సమాచారాన్ని వెల్లడిస్తున్నాయని చెప్పవచ్చు. ఎందుకంటే రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ అధికారిక గణాంకాలు సంబంధిత రాష్ట్రాలలోని మీడియా వార్తలను ధ్రువీకరించాయి. ఎన్నికల సంఘం అధికారుల, రాజకీయ నాయకుల ప్రకటనలు కూడా మీడియా వార్తలను ధ్రువీకరించాయి. ఉత్తరప్రదేశ్‌కు సంబంధించి, మేము పరిగణనలోకి తీసుకున్న అనధికారిక గణాంకాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రే బహిరంగంగా ధ్రువీకరించారు.

వివిధ రాష్ట్రాలలో సామూహిక మినహాయింపులు ఎలా ఉంటాయో చూద్దాం. ఈసీఐ నిర్దేశించిన గడువులోగా వివరాలతో నింపిన ఎన్యూమరేషన్ ఫామ్‌లను సమర్పించనివారి సంఖ్య ఉత్తరప్రదేశ్‌లో 2.93 కోట్లుగా ఉన్నది. ఇటువంటి ఓటర్ల సంఖ్య తమిళనాడులో 80 లక్షలు, గుజరాత్‌లో 72లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 58లక్షలు, రాజస్థాన్‌లో 43లక్షలుగా ఉండగా, మధ్యప్రదేశ్‌లో 30లక్షలు, ఛత్తీస్‌గఢ్‌లో 28లక్షలు, కేరళలో 21 లక్షలుగా ఉన్నది. చిన్న రాష్ట్రాలకు సంబంధించిన గణాంకాలు ఈ విధంగా ఉన్నాయి. గోవాలో లక్ష, పాండిచ్చేరిలో లక్ష, అండమాన్ నికోబార్‌లో 0.6లక్షలుగా ఉన్నది. పెద్ద, చిన్న రాష్ట్రాలలో సర్‌కు పూర్వపు ఓటర్ జాబితాలలోని మొత్తం ఓటర్ల సంఖ్య నుంచి 6.3కోట్ల



ఉన్నది. బిహార్ ముసాయిదా సర్ జాబితా 8శాతం పాయింట్ల కంటే ఎక్కువ. ఉత్తరప్రదేశ్‌లో ఈ వ్యత్యాసం భారీ స్థాయిలో ఉన్నది: అలాగే తమిళనాడు, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా ఇటువంటి పరిస్థితే ఉన్నది.

ఈ తగ్గుదల గణాంకాల్లో రాబోయే రోజుల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకునే అవకాశమున్నది. అయితే గణనీయమైన మార్పులు ఉండబోవు. ఓటర్ల మినహాయింపుల అధిక రేటును ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్ అనే తరగతులుగా ఈసీఐ వర్గీకరించింది. చాలా రాష్ట్రాలకు సంబంధించి ఈ వేర్వేరు తరగతుల మినహాయింపులపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు. అయితే 'మృతులు', 'నకిలీ ఓటర్లు'గా గుర్తింపబడిన వారు చాలా రాష్ట్రాలలో ఇంచుమించు ఒకే విధంగా ఉండగా, 'ఆబ్సెంట్', 'షిఫ్టెడ్' తరగతుల మినహాయింపులు కొన్ని రాష్ట్రాలలో ఆందోళనకరంగా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో 9శాతం, గుజరాత్‌లో 10శాతం, ఉత్తరప్రదేశ్‌లో 13.7 శాతంగా ఉండగా పశ్చిమబెంగాల్‌లో 1.6శాతంగా ఉన్నది. సర్ ప్రక్రియ కొత్త తరగతి భారతీయులను– భారత్‌లో పుట్టి, భారత్‌లో నివసిస్తూనే స్వస్థలాలలో గానీ, ఉపాధి పొందుతున్న స్థలాలలోగానీ ఓటర్లుగా లేనివారు–సృష్టించే అవకాశమున్నది!

కొనసాగుతున్న రెండవ దశ సర్ ప్రక్రియ 'unmapped' ఓటర్ల తొలగింపునకు మరొక మార్గాన్ని సమకూర్చుతోంది. ఓటరుగా నమోదు చేయించుకునేందుకు, 2002 లేదా 2003 ఓటర్ జాబితాలలో తమ పేరు ఉన్నట్టు లేదా తమ 'బంధువు' (ఈ పదాన్ని ఎన్నికల సంఘం ఇప్పటికీ నిర్వచించలేదు) పేరు ఉన్నట్టు రుజువులు చూపకుండా తమ దరఖాస్తులను సమర్పించినవారే ఈ 'unmapped' ఓటర్లు. ఈ ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలలో తాత్కాలికంగా మాత్రమే చేర్చుతారు. తమ పౌరసత్వాన్ని ధ్రువీకరించే డాక్యుమెంట్లు సమర్పించాలని వారికి నోటీసు జారీ అవుతుంది. అయినా అటువంటి డాక్యుమెంట్లను నిర్దేశించిన గడువులోగా సమర్పించని పక్షంలో తుది ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లను తొలగిస్తారు.

సరే, ప్రస్తుతం 'unmapped' ఓటర్ల పేర్లు ఎన్ని ఉన్నాయి? ఈ పేర్లకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఏ రాష్ట్రమూ విడుదల చేయలేదు. కేరళ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సంబంధించిన అనధికారిక సమాచారం సైతం లేదు. ఈ ఓటర్లకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారంలో భారీ వైవిధ్యం కనిపిస్తోంది. ఎన్నికల సంఘానికి అందిన దరఖాస్తుల సంఖ్యతో పోలిస్తే ఈ ఓటర్ల సంఖ్య ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లలో దిగ్భ్రాంతికరంగా అధిక స్థాయిలో ఉన్నది. ఈ ఓటర్లు యూపీలో 27.1శాతం, గుజరాత్‌లో 16శాతంగా ఉన్నారు. తమిళనాడులో మధ్యస్థంగా 10శాతం మేరకు ఉన్నారు. అయితే పశ్చిమబెంగాల్ (4శాతం), రాజస్థాన్ (3శాతం), మధ్యప్రదేశ్‌లో (2.4శాతం) చాలా తక్కువగా ఉన్నారు. ఇది విచిత్రమైన విషయమే. మొత్తం మీద తుది ఓటర్ల జాబితా నుంచి 5.25 కోట్ల మంది సంభావ్య తొలగింపు నెదుర్కోనున్నారు. వీరిలో 3.39 కోట్ల మంది ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారే కావడం గమనార్హం.

ఎన్నికల సంఘం కోరిన వివరాలతో కూడిన ఎన్యూమరేషన్ ఫామ్‌లను సమర్పించని 6.3కోట్ల మంది, తమ పౌరసత్వాన్ని నిరూపించని 5.3కోట్ల మంది.. వెరసి 11.6 కోట్ల మంది ఓటు హక్కును కోల్పోయే ప్రమాదమున్నది. రెండవ దశ సర్ అమలవుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని ప్రస్తుతమున్న మొత్తం ఓటర్లలో, ఈ రెండు విధాలుగా ఓటు హక్కును కోల్పోయేవారి సంఖ్య ఐదో వంతుకు పైగా ఉంటుంది! రాబోయే కొద్ది రోజులలో వీరి సంఖ్య, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో గణనీయంగా తగ్గిపోయే అవకాశమున్నది. అయితే పశ్చిమబెంగాల్‌లో మాత్రం 'unmapped' ఓటర్ల సంఖ్యకు మరింత మందిని కలిపే అవకాశమున్నది. పౌరసత్వం నిరూపించుకోవాలని నోటీసు అందుకున్న వయోజనులలో అంతిమంగా ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగింపునకు గురయ్యే వారి నిష్పత్తి తక్కువగానే ఉంటుంది. ఇది నిజమే. అయితే అంతిమ తొలగింపులు తాత్కాలిక ఓటర్ల సంఖ్యలో సగంగా ఉంటాయని భావించినా ఈ ఓటు హక్కు తొలగింపులు ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలోనే అతి పెద్ద ఓట్ల తొలగింపు అనడంలో సందేహం లేదు.

> ఎన్నికల సంఘం కోరిన వివరాలతో కూడిన ఎన్యూమరేషన్ ఫామ్‌లను సమర్పించని 6.3 కోట్ల మంది, తమ పౌరసత్వాన్ని నిరూపించని 5.3 కోట్ల మంది.. వెరసి 11.6 కోట్ల మంది వారి ఓటు హక్కును కోల్పోయే ప్రమాదమున్నది. రెండవ విడత సర్ అమలవుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని ప్రస్తుతమున్న మొత్తం ఓటర్లలో, ఈ రెండు విధాలుగా ఓటుహక్కును కోల్పోయేవారి సంఖ్య ఐదో వంతుకు పైగా ఉంటుంది!

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చిన్న చిన్న వివరాలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

డిజిటలైజ్ చేసిన డేటా శాతం గురించి అద్భుతమనిపించే అర్థరహిత గణాంకాలు వెల్లడించడమనే కొత్త పద్ధతిని ప్రారంభించడం ద్వారా సత్యాన్ని దాచడానికి, గందరగోళాన్ని సృష్టించడానికి ఈసీఐ తన శక్తిమేరకు ప్రయత్నించింది. ఇది మనకు అవసరమైన రెండు రకాల డేటాను అర్థం కాకుండా చేసింది: ఎన్యూమరేషన్ ఫామ్‌లను నింపకుండా, ముసాయిదా జాబితా నుంచి పేర్లు ముసాయిదా జాబితాల నుంచి సగటు మినహాయింపులు బిహార్‌లో కంటే అధికంగా ఉండవచ్చని స్పష్టమవుతున్నది.

ఈ మినహాయింపులు సహజమైనవి కావు. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్నవని చెప్పక తప్పదు. తమిళనాడు, కొంతమేరకు కేరళలో మినహా, ఇంతకు ముందున్న ఓటర్ జాబితా– ఓటుహక్కుకు అర్హులైనవారి సంఖ్య కంటే పెద్దదిగా ఉన్న రాష్ట్రమేదీలేదు. ప్రతి రాష్ట్రంలోను వయోజనుల– ఓటర్ల జాబితా నిష్పత్తి తగ్గిపోనున్నది. మొత్తంగా ఈ తగ్గుదల 12శాతం పాయింట్ల వరకు

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

(భారత్ జోడో అభియాన్ పరిశోధకుడు
రాహుల్ శాస్త్రి సహకారంతో)

ఆ వ్యాఖ్యలు చరిత్రను వక్రీకరించడమే

గాంధీజీ ఆకాంక్షలను కూడా తుంగలో తొక్కి, నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్‌వారు వందేమాతరం గేయాన్ని ముక్కలు చేశారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొనడం చరిత్రను వక్రీకరించడమే. 1939 జూలై 1న 'హరిజన్' పత్రికలో రాసిన వ్యాసంలో కొన్ని వర్గాల ప్రజలు ఆక్షేపించేటట్లయితే వందేమాతరం గేయాన్ని పాడనవసరం లేదని గాంధీజీ స్పష్టం చేశారు. అలాగే తన పుస్తకం 'నిర్మాణాత్మక కార్యక్రమం'లో కూడా గాంధీజీ వందేమాతరం గేయాన్ని ఇతరులపై బలవంతంగా రుద్దరాదని పేర్కొన్నారు. ముస్లిమ్‌లకు అభ్యంతరకరంగా, కోపం తెప్పించేదిగా ఉండరాదని కూడా స్పష్టం చేశారు. 1896లోనే విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మొట్టమొదటిసారిగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. వందేమాతరంలోని తొలి రెండు చరణాలనే ఆయన పాడారు. అవి వివాదరహితమయినవని ఆయన అభిప్రాయపడ్డారు. మిగతా చరణాలు దుర్గామాతను స్తోత్రించే విధంగా ఉన్నాయని ఆయన భావించారు. తర్వాత 1937లో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వందేమాతరం గేయం ఎక్కడ పాడినా మొట్టమొదటి రెండు చరణాలే పాడాలంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఇది నెహ్రూ నిర్ణయం కాదు. ఆనాటి జాతీయ నాయకులందరి సమష్టి నిర్ణయం. ఈ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హిందూ, ముస్లిం నాయకులందరు పాల్గొన్నారు. తర్వాత 1950 జనవరి 24న జరిగిన భారత రాజ్యాంగ సభ సమావేశంలో వందేమాతరం మొట్టమొదటి రెండు చరణాలనే 'జాతీయ గేయంగా' నిర్ణయించారు. దానికి జాతీయగీతం 'జనగణమణ'తో సమాన హోదాను కల్పించాలని తీర్మానం చేశారు.

ఈ విధంగా వందేమాతరం గేయాన్ని మొదటి రెండు చరణాలకే పరిమితం చేయడాన్ని గాంధీజీ పూర్తిగా సమర్థించారు. వందేమాతరం గేయాన్ని పరిమితం చేయడంలో నెహ్రూ పాత్ర కూడ ఏమీ లేదనేది సుస్పష్టం. నెహ్రూ మీద అభాండాలు వేయడం మోదీ ప్రభుత్వం మొదటి నుంచి ఒక పద్ధతి ప్రకారం చేస్తున్నది.

– డా. పి.సి.సాయిబాబు

ఉపాధికి హామీ లేని పథకం

ఉపాధికి హామీ ఇచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇకపై తన పేరు, రూపు మార్చుకోబోతోంది. ఆ దిశగా రూపొందించిన బిల్లుని కేంద్రం పార్లమెంట్ సభ్యులకు అందజేసింది. ఇందులో ప్రతిపాదనలు ఇంతవరకూ ఉన్న హామీని నీరుకార్చేవిగా ఉన్నాయి. వంద రోజుల పని దినాలకు బదులు 125 రోజులు పని కల్పిస్తామని చెప్పడం ఒక్కటే బాగుంది.

ఈ పథకాన్ని డిమాండ్ ఆధారంగా కాకుండా సరఫరా ఆధారంగా చెయ్యడం ఇప్పుడు చేస్తున్న పెద్ద మార్పు. అంటే ఇప్పటిలా మా ఊరికి ఈ పని, ఇంత మందికి ఉపాధి కల్పిస్తూ, ఇన్ని రోజులకు అవసరం అని చెప్తే కేంద్రం మంజూరు చెయ్యడం కాదు. కేంద్రం ఇచ్చిన బడ్జెట్ మేరకు, కేంద్రమే గుర్తించిన ప్రాంతంలో ఆ పని పూర్తి అయ్యేలా చూడడమే. ఈ మార్పు వల్ల స్థానికులకు, ఆ రాష్ట్రాలకు డిమాండ్ చేసే స్వేచ్ఛ లేదు. పైగా కేంద్రం ఇస్తున్న నిధులను 60శాతానికి తగ్గించడం, రాష్ట్రం వాటా 40శాతానికి పెంచడం. దీంతో రాష్ట్రాలపై ఆర్థిక భారంతో పాటు, అమలులో ఉదాసీనత, సర్దుబాటు ధోరణి పెరుగుతుంది. ఇంతకుముందు వ్యవసాయ పనుల సీజన్‌లో కూడా ఈ పథకం ఉండడం వల్ల వ్యవసాయ కార్మికులకు డిమాండ్ ఉండి మెరుగైన వేతనాలు దక్కేవి. ఇప్పుడు ఆ సీజన్‌లో ఈ పథకం ఉండదు.

ఉదారంగా నిధులు కేటాయించి, పటిష్టంగా అమలు చేయడం ద్వారా గ్రామీణ భారతాన్ని ఆదుకోవాల్సిన కేంద్రం, ఈ మార్పులతో ఏ ఫలితాన్ని ఆశిస్తుందో తెలియడం లేదు. అన్ని రాష్ట్రాల్నీ ఒకే గాటన కట్టకుండా అమలులో మంచి పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలకు, ఆదాయం తక్కువ ఉన్న రాష్ట్రాలకు పాత పద్ధతిలో 90 శాతం నిధులు కేటాయించినా బాగుంటుంది. ఈ బిల్లుపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. వికసిత భారత్ అన్నది బిల్లు పేరులోనే కాకుండా చట్టం స్ఫూర్తిలో కనబడాలి.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

తరతరాల తరగని సంపద... అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పాలకవర్గానికి ఈ టర్మ్‌లో ఇంకా సుమారు మూడున్నరేళ్లు మాత్రమే ఉంది. ఈ లోపే 'రాజధాని అమరావతి'కి ఒక శాశ్వతత్వం తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ విశేషంగా కృషి చేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి, భూములిచ్చిన రైతులకు 2019–24 మధ్య జరిగిన పరాభవాల పరంపరలు, అగౌరవం, హేళనలు మొదలైన వికృత చేష్టలు పునరావృతం కాకూడదన్న దృఢ సంకల్పంతో చంద్రబాబు శక్తికి మించి శ్రమిస్తున్నారు. ఆయన ఆలోచనలను మంత్రి నారాయణ, తన భుజాలపై వేసుకుని లక్ష్యం దిశగా పరుగులు తీస్తున్నారు.

రాష్ట్ర పాలనకు అవసరమైన రాజధానిని ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడికైనా మార్చుకోవచ్చు. కానీ, ఒక ప్రపంచ స్థాయి నగరాన్ని ఏ కారణంతోనూ మరో చోటుకు మార్చలేరు. ఆ మాటకొస్తే, ఒక చిన్న పట్టణాన్ని కూడా మరో చోటుకు కదిలించలేరు. రాజధానిని సునాయాసంగా తరలించవచ్చు అనడానికి గుజరాత్ ఒక ఉదాహరణ. మహారాష్ట్ర నుంచి 1960లో గుజరాత్‌ను విడదీశారు. అప్పుడు అహ్మదాబాద్‌లో రాజధాని కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కానీ 1965లో గుజరాత్ ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టిన హితేంద్ర దేశాయ్ 1970లో రాజధానిని అహ్మదాబాద్ నుంచి గాంధీనగర్‌కు మార్చేశారు.

ఒక రాష్ట్ర రాజధాని ఏర్పాటుకు కావలసిన మౌలిక సదుపాయాలు– ఒక సచివాలయం కాంప్లెక్స్, శాఖాధిపతులకు కార్యాలయాలు, అసెంబ్లీ భవనం, డీజీపీ కార్యాలయ కాంప్లెక్స్, ఇతర పోలీసు సంబంధిత రాష్ట్ర స్థాయి కార్యాలయాలు అవసరం. వీటితో పాటు శాసనసభ్యులు, కార్యదర్శులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి వంటి వారి నివాస వసతులు, గవర్నర్ నివాస భవన సముదాయం, హైకోర్టు భవన సముదాయం, న్యాయమూర్తుల నివాసాలు ఉంటే సరిపోతుంది.

2014లో విభజన జరిగినప్పటి నుంచీ ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నాయి. 2019కి ముందు ఏర్పాటైన ఈ మౌలిక సదుపాయాలను గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా ఎక్కడికీ తరలించలేదు. ఆయన హయాంలో కూడా అవి పాలనకు ఉపయోగపడ్డాయి. చంద్రబాబుపై పుట్టు కక్షతో రాజధాని కార్యకలాపాలను తరలించాలనుకున్నా, పాలనానుభవ లేమితో జగన్ ఆ పని కూడా చేయలేకపోయారు. రాజధాని ఇప్పటికీ అక్కడే ఉంది. చంద్రబాబు ఇప్పటికీ ఆ మౌలిక సదుపాయాలనే పాలనకు వినియోగిస్తున్నారు. ఈ మొత్తం మౌలిక సదుపాయాల కల్పనకు మూడు, నాలుగొందల ఎకరాల ఖాళీ భూమి ఉంటే చాలని కేంద్ర ప్రభుత్వ హోమ్ శాఖ పూర్వపు కార్యదర్శి కంటిపూడి పద్మనాభయ్య నిశ్చితాభిప్రాయం. ఇంటర్‌నెట్, కమ్యూనికేషన్ సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానం ఊహాతీతంగా పెరిగిపోతున్న ఈ సాంకేతిక యుగంలో రాష్ట్ర రాజధాని భౌగోళికంగా ఎక్కడ ఉంటుందనే విషయానికి పెద్ద ప్రాధాన్యం లేదనే భావనను పలువురు రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ వ్యక్తం చేశారు.

> ప్రభుత్వ భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంతగా తహతహలాడుతున్నారో అలాగే నివాస గృహాలను కూడా ఏకకాలంలో నిర్మించడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ విధంగా ఏర్పాటయ్యే 'అమరావతి' నగరం తెలుగు వారి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది.

కానీ, చంద్రబాబు నాయుడు నిర్మించ తలపెట్టిన మయసభ లాంటి మహానగరం 'అమరావతి' మాత్రం సచివాలయ భవనాల వంటిది కాదు. ఒకసారి ఏర్పడితే ఇక మరో చోటుకు మార్చడం, జగన్మోహన్‌రెడ్డి మనస్తత్వం కలిగిన వందమంది పాలకులు వచ్చినా సాధ్యం కాదు. ఇప్పుడు అమరావతి అని మనం పిలుచుకునే ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాలన్నీ ప్రభుత్వ సంబంధిత మౌలిక సదుపాయాలే. వాటిని మినహాయిస్తే మిగిలినదంతా ఖాళీ భూములే.

'నగరం' అంటే కళ్ళు మిరుమిట్లు గొలిపే అందాల హర్మ్యాలే కాదు కదా! రోజువారీ కూలి నాలీ చేసుకు బతికే జనాల దగ్గరి నుంచి, సమస్త కుల, మత, ధనాదాయవర్గ సహజ జీవన రీతులను ప్రతిబింబించే ప్రజలు కూడా అన్ని రకాల జీవన సౌకర్యాలతో నివసించినప్పుడే– అది ఒక పట్టణమో, నగరమో, కాస్మోపాలిటన్ సిటీనో అవుతుంది. ప్రభుత్వ నిర్మాణాలతో పాటు, ఆస్పత్రులు, హోటళ్లు, విద్యాసంస్థలు, థియేటర్లు, కళాక్షేత్రాలు, వాణిజ్య సముదాయాలు, క్లబ్బులు, పార్కులు, ఫ్లై ఓవర్లు, రెస్టారెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మాల్స్ మొదలైన వాటికి కేటాయించే స్థలాల మధ్యలో మిగిలివున్న ఖాళీ భూముల్లో ప్రజలు అన్ని వసతులతో నివసిస్తేనే కదా అమరావతికి ఒక రూపు వచ్చేది. మయసభను తలపింపజేసే ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తున్నదో, వాటి మధ్య




ప్రజల నివాసానికి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. నివాసయోగ్య భూమిని ఐడెంటిఫై చేసి; 100, 200, 300, 400, 500 గజాల నివాస ప్లాట్లుగా విభజించాలి. ఒక్క ఆంధ్రప్రదేశ్ వాసులకు మాత్రమే కాక, మొత్తం భారతదేశ పౌరులు ఈ ప్లాట్లను సొంతం చేసుకుని, శాశ్వతంగా నివసించే అవకాశం కల్పించాలి. వంద గజాల స్థలం కావాలనుకునే వారి నుంచి లక్ష, 500 గజాల స్థలం కావాలని భావించే వారి నుంచి ఐదు లక్షలు– ఇలా కేటగిరీల వారీగా చెల్లించి పేరు నమోదు చేసుకోవడానికి– నమోదు రుసుము నిర్ణయించాలి. ఇందుకోసం అవసరమైన వెబ్‌సైట్‌ను సీఆర్‌డీఏ రూపొందించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలి. మొత్తం స్థలాల సంఖ్య కంటే దరఖాస్తులు ఎక్కువ రావడం సహజం. వాటిని పబ్లిక్‌గా డ్రా తీసి, స్థలాలు పొందిన వారి వివరాలు కూడా కేటగిరీ వారీగా వెబ్‌సైట్‌లో ఉంచాలి. స్థలాలు పొందినవారు చెల్లించిన రుసుమును నాన్–రిఫండబుల్ డిపాజిట్‌గా పరిగణించాలి. డ్రాలో పేర్లు రాని దరఖాస్తుదారుల రుసుములో 75 శాతం మొత్తాన్ని వారికి తిరిగి చెల్లించేయాలి. (25 శాతం నిర్వహణ ఖర్చులుగా ప్రభుత్వం మినహాయించాలి.)

ఇక, లాటరీలో నివాస స్థలాలు పొందినవారికి విశాఖలో పరిశ్రమల యూనిట్లకు కేటాయించిన రీతిలో చౌకగా ప్రభుత్వం విక్రయించాలి. వారికి కేటాయించిన నివాస స్థలంలో రెండు సంవత్సరాలలోనే భవనం నిర్మించాలన్న నిబంధన విధించాలి. ఒక్కో కేటగిరీలో ఒక్క డిజైన్‌లో మాత్రమే తమ భవనాలు/గృహాలు నిర్మించాలనే నిబంధన ఉండాలి. అంటే వంద గజాల స్థలంలో నిర్మాణాలు అన్నీ ఒకే రకం డిజైన్‌లో ఉంటాయి. అలాగే 500 గజాల వరకు. గృహస్థులకు కావలసిన ఇసుక, సిమెంట్, స్టీల్, విద్యుత్ కేబుళ్ళు, విద్యుత్ పరికరాల వంటి సమస్త నిర్మాణ సామగ్రిని యాభై శాతం సబ్సిడీపై ప్రభుత్వం వారికి అందుబాటులో ఉంచాలి. బ్యాంకుల నుంచి గృహ రుణాలకు ప్రభుత్వమే బ్యాంకులకు హామీ ఉండాలి. ఈ రెండేళ్లలో గృహాలకు కావలసిన రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు ప్రభుత్వం పూర్తి చేయాలి.

ప్రభుత్వ భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి నారాయణ ఎంతగా తహతహలాడుతున్నారో అలాగే నివాస గృహాలను కూడా ఏకకాలంలో నిర్మించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ విధంగా ఏర్పాటయ్యే 'అమరావతి' నగరం తెలుగు వారి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. మళ్ళీ జగన్ వస్తే, దానినో శ్మశానవాటికగా మారుస్తారేమో అనే భయం ఉండదు. 1591 ప్రాంతంలో మొహమ్మద్ కులీ కుతుబ్ షా పునాది వేసిన హైదరాబాద్ లాగా అమరావతి నగరం తరతరాల సంపదగా దినదినాభివృద్ధి చెందుతుంది. దానిని నిర్మిస్తున్న నారా చంద్రబాబు నాయుడు చరిత్రలో భాగంగా ఆచంద్రతారార్కం నిలిచి ఉంటారు.

■ భోగాది వేంకటరాయుడు





జానపద కళలను..
పరిరక్షించుకోవాలి
● నాట్స్ చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్ ● ఘనంగా సాంస్కృతిక సంబరాలు

8

పంచకుతంత్ర కథలు..

నరసరావుపేట చోర్ గ్యాంగ్ నేర విస్తరణ.. పంచతంత్ర కథల్లా ఒక్కొక్కటి ఆసక్తిని రేపు తోంది. ఒక్క రోడ్డు ప్రమాదం వీరి పాపాల పుట్టను పగల గొట్టడంతో.. చీమలు బయట కొచ్చినట్లు.. ఒక్కొక్కరిగా వీరికి సహకరించిన పోలీసు అధికారులు, సహచరులు బయటపడుతున్నారు. ఈ చోర్ గ్యాంగ్ పోలీసు శాఖలోని కొందరు అధికారుల సహకారంతోనే అప్రతిహతంగా నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడవుతోంది. విశాఖపట్నం లోనూ ఈ గ్యాంగ్‌కు లింకులు ఉన్నట్లు తాజాగా వెలుగు చూసింది. గ్యాంగ్‌లోకి కీలక సభ్యుడిని విశాఖలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నకరికల్లు మండలం నరసింగపాడుకు చెందిన మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తునట్లు సమాచారం. ఈ ముఠా తాము చేసే నేరాలను చూసీ చూడనట్లుగా వదిలేసినందుకు నలుగురు పోలీసు అధికారులకు 10 కార్లు బహుమతి ఇచ్చినట్లు జరుగుతున్న ప్రచారం సంచలం కలిగి స్తోంది. రాజకీయ అండదండల కోసం కొందరు నేతలకు కూడా చోరీ చేసిన కార్లను తక్కువ ధరకు విక్రయించినట్లు పోలీసు విచారణలో వెల్లడి కావడంలో.. సదరు నేతలు కలవరం చెందుతు న్నారు. ఓ ప్రజా ప్రతినిధి కాన్వాయ్‌లో అక్రమంగా నేతలు కొనుగోలు చేసిన కార్లను పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.



- విశాఖలో నరసరావుపేట చోర్ గ్యాంగ్‌కు లింకులు
- గ్యాంగ్ సభ్యుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నరసరావుపేటకు తరలింపు
- పరారీలో నరసింగపాడు గ్యాంగ్ సభ్యుడు
- పోలీసు అధికారులకు బహుమతిగా 10 కార్లు
- యువతిని బెదిరించి రూ.25 లక్షలు వసూలు
- మత్తు పదార్థాల విక్రయం.. నకిలీ నోట్ల చలామణీ.. విచారణలో కథలు కథలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
చిలకలూరిపేట పేట వద్ద జాతీయ రహదారిలో చోటుచేసుకున్న కారు ప్రమాదంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి కారకులైన గ్యాంగ్‌లోని ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నుంచి వారిని తప్పించేందుకు కొందరు పోలీసులు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రమాదం జరిగిన వెం టనే సస్పెండైన ఎస్‌ఐ ఘటానా స్థలానికి వెళ్ల డం వెనుక ఆ గ్యాంగ్‌ను రక్షించేందుకే అన్న

(మిగతా 8వ పేజీలో)

ప్రేమ జంటను బెదిరించి.. రూ 25 లక్షల వసూలు

నరసరావుపేట మండలం కోటప్పకొండ ప్రాంతంలో ఓ ప్రేమ జంటను ఈ ముఠా టార్గెట్ చేసినట్లు వెలుగులోని వచ్చింది. ప్రేమికులు కలసి ఉండగా ఫొటోలు చిత్రీకరించి వాటితో వారిని బెదిరించి డబ్బు గుంజినట్టు తెలిసింది. రూ.25 లక్షలు వరకు వసూలు చేశారని ప్రచారం జరుగుతోంది. ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసిన అనంతరం సదరు యువతి కుటుంబ సభ్యుడు ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదు.

ఓ పోలీసు అధికారికి నరసరావుపేట చోర్ గ్యాంగ్ నాలుగు కార్లు ఇచ్చినట్లు ప్రచారం జరుగు తోంది. అయితే తాను ఒక కారు తీసుకున్నట్లు నమోదు చేయమని నిఘా సిబ్బందికి ఆయన చెబుతున్నట్లు తెలుస్తోంది. దొంగ నోట్ల మార్పిడి, ఓ యువతిని బెదిరించి నగదు వసూలు, మత్తు పదార్థాల విక్రయాలు చేశారని.. నరసరావుపేట గ్యాంగ్ నేరాలను కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. పోలీసు శాఖలోని వ్యక్తుల అండదండలు ఉంటే ఎటువంటి నేరాలనైనా అలవోకగా చేసి తప్పించుకోవచ్చని ఈ గ్యాంగ్ రుజువు చేసిందని ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారు.

6వ ర్యాంకు జీడీడీపీలో..

- వ్యవసాయం, ఉద్యాన, పరిశ్రమల రంగాల్లో క్షీణత
- సచివాలయాల ఉద్యోగుల హాజరు నమోదులో నిర్లక్ష్యం
- కలెక్టర్ల సదస్సులో జిల్లా ప్రగతిపై ముఖ్యమంత్రి సమీక్ష
- నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని చంద్రబాబు సూచన



గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జీడీడీపీ)లో రాష్ట్రంలో జిల్లాకు ఆరో ర్యాంకు లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవల ద్రవ్య విలువ ఆధారంగా రూ.37,016 కోట్ల జీడీడీపీ సాధించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రూ.89,635 కోట్ల జీడీడీపీని లక్ష్యంగా నిర్దేశించిన దృష్ట్యా మార్చి నెలాఖరు లోపు రూ.52,619 కోట్లను సాధించాల్సి ఉంది. బుధవారం అమరావతి రాజధానిలోని సచివాలయంలో ప్రారంభమైన రెండు రోజుల కలెక్టర్ల సదస్సుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరయ్యారు. జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. నివేదికలను పరిశీలించి ఆయా అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు. కీలక పని తీరు సూచికలో 77 స్కోర్‌తో జిల్లా ఏ గ్రేడ్‌ని సాధించింది. వ్యవసాయ, అనుబంధ రంగంలో రూ.14,731 కోట్లు లక్ష్యం కాగా మొదటి ఆరు నెలల్లో కేవలం రూ. 4505 కోట్లు మాత్రమే సాధించింది. పరిశ్రమలకు సంబంధించి రూ. 20638 కోట్ల జీవీఏ లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.8,553 కోట్లు మాత్రమే సాధించింది. సేవల రంగంలో రూ.47,280 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.21,300 కోట్లు సాధించింది. ఉద్యాన శాఖ పరంగా రూ.5765 కోట్లు లక్ష్యం కాగా రూ.1755 కోట్లు సాధించింది. కేపీఐ ఆధారిత జిల్లా గ్రేడింగ్‌లో 62 స్కోరుతో బీ గ్రేడ్‌ని పొంది 25వ స్థానానికి పడిపోయింది. పశుసంవర్ధక రంగంలో రూ.5229 కోట్ల జీవీఏ లక్ష్యం కాగా రూ.2347 సాధించింది. పాలన ఉత్పత్తిలో జీవీఏ లక్ష్యం రూ. 2790 కోట్లు కాగా రూ. 1254 కోట్లు సాధించింది. మత్స్య రంగంలో రూ. 1,090 కోట్ల జీవీఏ లక్ష్యాన్ని తొలి ఆరు నెలల్లో రూ. 734 కోట్లను సాధించింది. కోడి గుడ్లు, మాంసం, పాల ఉత్పత్తి విషయంలో ఎక్కువ శ్రద్ధ పెట్టాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. జిల్లాకు 70,066 ఇళ్లు మంజూరైతే 32,920 మాత్రమే పూర్తి కాగా 31614 నిర్మాణ దశలో ఉండటంపై ప్రభుత్వం హెచ్చరించింది. 2026 ఉగాదికి 24,774 అర్బన్ బీఎల్‌సీ, 1,109 గ్రామీణ్, పీఎంఏవై అర్బన్ బీఎల్‌సీ 2.0 1,717 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించింది. పీజీఆర్ఎస్ కమ్యూనిటీ గ్రీవియన్స్‌లో 20 శాతం నెగెటివ్ రిపోర్టు వచ్చింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ గురించి జిల్లాలో 70.3 శాతం మందికి తెలియదని చెప్పారు. మన మిత్ర వినియోగం 79.8 శాతం మంది తెలియదన్నారు. డాక్యుమెంట్ అప్‌లోడ్ విషయంలో జిల్లా 34.15 శాతం పురోగతి సాధించ గలిగింది. సచివాలయాల ఉద్యోగులు హాజరు నమోదులో నిర్లక్ష్యంపై సమావేశంలో సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదీ ప్రగతి సాధన

రంగం	స్థానం
వ్యవసాయం	14
పరిశ్రమలు	21
ఉద్యాన శాఖ	14
మాంసం ఉత్పత్తి	5
పీఎంఏవై 1.0 పథకం	24
సేవలు	18
సుస్థిరాభివృద్ధిలో	8
ఎంఎస్ఎంఈలో	10

పర్యాటకం, పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పించాలని ముఖ్యమంత్రి కలెక్టర్‌కు సూచించారు. స్టార్ హోటల్స్, రిసార్టుల ఏర్పాటుకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. మొత్తం 17 టూరిజం ప్రాజెక్టులను రూ.3,960 కోట్లతో ఏర్పాటు (మిగతా 6వ పేజీలో)

అమరావతి పురోగతికి ఏజీఐసీఎల్ ఏర్పాటు

ఎండీగా విశ్రాంత ఐఏఎస్ ఎస్.వీ. రత్నశ్రీనివాస్ నియామకం




తుళ్లూరు, గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పురోభివృద్ధి కోసం, ప్రత్యేక ప్రాజెక్టుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమరావతి గ్రోత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమి టెడ్(ఏజీఐసీఎల్)ను ఏర్పాటు చేసింది. ఈ ఏజీఐసీఎల్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా విశ్రాంత ఐఏఎస్ ఎస్‌వీఆర్ శ్రీనివాస్ (శౌంఠి వెంకటరత్నం శ్రీనివాస్)ను నియమించింది. కాగా బుధవారం ఆయన రాయపూడి సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో భాధ్యతలు స్వీకరించారు. 1989 బ్యాంచ్‌కి చెందిన శ్రీనివాస్ మహారాష్ట్ర చెందిన వారు. పాలనా సం స్కరణలు, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పోర్టుల అభి వృద్ధిలో శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారు. ఏజీఐసీఎల్ అమ రావతిలో చేపట్టే పలు ప్రత్యేక ప్రాజెక్టుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలను రూపొందించడం, వాటిని అమలు చేయడం, ఆర్థిక వనరులు సమకూర్చడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిం చనున్నది. గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం, ఎన్టీఆర్ విగ్రహం, స్మార్ట్ పరిశ్రమలు, ఐకానిక్ వంతెన, స్పోర్ట్స్ సిటీ, రివర్ ఫ్రంట్ అభివృద్ధి, రోప్‌వే, ఇన్నర్ రింగ్ రోడ్(ఐఆర్ఆర్) ఇతర ప్రత్యే ప్రాజెక్టు పనులను కూడా పర్యవేక్షించనున్నది.

అభివృద్ధికి ఆహ్వానం

రాయపూడిలో 30.34 ఎకరాలకు బిడ్డింగ్ ● పీపీపీ విధానంలో ప్రతిపాదనలకు అవకాశం

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగరంలో కృష్ణానదికి అత్యంత సమీపంలో ఉండే రాయపూడి గ్రామంలో 30.34 ఎకరాల ల్యాండ్ పార్సిల్‌ని అభివృద్ధికి ఇవ్వాలని ఏపీసీఆర్డీఏ నిర్ణయించింది. పీపీపీ విధానంలో ప్రతిపాదన కోసం అభ్యర్థన(ఆర్ఎఫ్‌పీ)ని కోరుతూ బిడ్ డాక్యుమెంట్‌ని విడుదల చేసింది. అమరావతి మాస్టర్‌ప్లాన్‌లో స్పెషల్ జోన్-ఎస్3లో ఈ భూమి ఉన్నది. గరిష్ఠంగా ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్‌ని ఐదుగా నిర్ణయించింది. ఆసక్తి కలిగిన డెవలపర్లు ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ఆర్ఎఫ్‌పీలను పంపాలని సూచించింది. ఎవరైతే ఏపీ సీఆర్డీఏకి ఎక్కువగా గ్రాస్ ఫ్లోర్ ఏరియా(జీఎఫ్ఏ)ని వాటాగా ఇవ్వడానికి ప్రతిపాదన అందజేస్తారో వారినే ఎంపిక చేస్తారు. ఈ ప్రాజెక్టులో ఫేజ్-1ని మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకి సంబంధించి బిడ్డింగ్ డాక్యుమెంట్స్ వాల్యూమ్-1, 2లను ఈ నెల 17వ తేదీ బుధవారం నుంచే డౌన్‌లోడింగ్ చేసుకునే వెసులుబాటుని సీఆర్డీఏ కల్పించింది. ఈ నెల 22న ఉదయం 11.30 గంటలకు సీఆర్డీఏ తుళ్లూరు కార్యాలయంలో ప్రీబిడ్ సమావేశం కూడా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. జనవరి ఒకటో తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అలానే అదే రోజు మధ్యాహ్నం 3 గంటలలోపు ప్రతిపాదన నివేదించాలి. సాయంత్రం 4 గంటలకు టెక్నికల్ ప్రతిపాదన ఓపెన్ చేస్తారు. ఫైనాన్సియల్ ప్రతిపాదనని జనవరి 2న ఓపెన్ చేస్తారు. జాయింట్ వెంచర్ అయితే ముగ్గురు వరకు అనుమతిస్తారు. ఏవైనా సందేహాలుంటే అంజనా జేమ్స్ (8977732025)ని సంప్రదించాలని సీఆర్డీఏ సూచించింది. ఈ ప్రాజెక్టు అమరావతిలోని ఫైనాన్స్ సిటీ పరిధిలోకి వస్తుంది. బహుళ అవసరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలి. ఎంపికైన బిడ్డర్ ఎస్‌పీవీని ఏర్పాటు చేసుకోవాలి. అగ్రిమెంట్(నిర్మాణ సమయంతో కలిపి) 10 ఏళ్లుగా నిర్ణయించారు. ప్లానింగ్, డిజైన్, ఫైనాన్సింగ్, నిర్మాణం, ప్రాజెక్టు మార్కెటింగ్‌ని ఎంపికైన బిడ్డర్ చూసుకోవాలి.



ఫైనాన్సియల్ సిటీలో డెవలప్‌మెంట్ కోసం ప్రతిపాదించిన ప్రాంతం (సర్కిల్‌లో)

ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

అక్రమాలపై జీఎంసీ కమిషనర్ చర్యలు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను రశీదులో పేరు మార్పిస్తామని, అనధికారక నిర్మాణాలు ప్రోత్స హిసున్న ముగ్గురు ఉద్యోగులపై జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు. అక్రమవసూళ్లపై అందిన ఫిర్యాదులతో సంగడిగుంటలోని సచివాలయం 45లో డేటా ఎంట్రీ ఆపరేటర్ సాయికుమార్ పైన, అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నారని కాకాని రోడ్డులో ఇన్‌చార్జి టీపీబీఓ యాసిర్ అహ్మద్, ప్లానింగ్ సెక్రటరి ఆవుల వెంకటకృష్ణలను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడినా, అనధికారికంగా డబ్బులు వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



8

ధాన్యం రవాణాకు ప్రత్యేక రైల్వే వ్యాగన్లు

- తెనాలి నుంచి పెద్దాపురానికి వ్యాగన్ ప్రారంభం
- మధ్యాహ్న భోజనానికి రాష్ట్రమంతా బియ్యం పంపుతామన్న మంత్రి మనోహర్

పేదింటి కలకు పునాది!

ముగిసిన పీఎంఏవై దరఖాస్తు గడువు

- మూడు జిల్లాల పరిధిలో 76 వేల అర్జీలు
- తొలిదశలో పేదలు, సొంతిల్లు లేని వారికి ప్రాధాన్యం
- క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం తుది జాబితా

(తెనాలి, ఆంధ్రజ్యోతి)
పేద, మధ్య తరగతి వర్గాల సొంతింటి కలను గత ప్రభుత్వం ఓ ప్రహసనంగా మార్చేసింది. మొత్తం ప్రక్రియనే దశ దిశ లేకుండా మార్చేసింది. దీంతో ఎంతోమంది పేదలు సొంతింటి నిర్మాణంపై ఆలోచనే చేయలేదు. ముఖ్యంగా స్థలం ఉండి ప్రభుత్వం అందించే రాయితీలతో ఇంటి నిర్మాణం చేపట్టాలనుకునే వారి ఆశలను గత పాలకులు చిదిమేశారు. ఐదేళ్ల ఏలుబడిలో లక్షల సంఖ్యలో వినతులు వచ్చినా.. బుట్టదాఖలు చేశారు. కేంద్రంతో సంప్రదింపుల ద్వారా సాధ్యమయ్యే అనేక పథకాలను కూడా పట్టించుకోకపోవడంతో ఆ ప్రభావం పేద వర్గాలపై పడి.. తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్లక్ష్యాలన్నింటిపై దృష్టి సారించింది. దాదాపు నాలుగు నెలల క్రితమే కేంద్రంతో మాట్లాడి ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)గ్రామీణ కింద విరివిగా ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇప్పించుకోగలిగింది. ఈ పథకం గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కానుండడం, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటు కలిసి ఉండడంతో ప్రక్రియను వేగంగా పట్టాలెక్కించింది. గృహ నిర్మాణ యంత్రాంగం ద్వారా దరఖాస్తుల స్వీకరణకు ఆహ్వానం పలికింది. ఓ వైపు దరఖాస్తులు జరుగుతుండగానే, క్షేత్రస్థాయిలో ఎంత మంది పేదలు ఇంకా సొంతింటికి దూరంగా ఉండారనే సర్వే కూడా ప్రభుత్వం చేపట్టింది. పీఎంఏవై పథకానికి (మిగతా 8వ పేజీలో)



అద్దంకి : సింగరాయకొండపాలెంలో క్షేత్రస్థాయి సర్వే చేస్తున్న సిబ్బంది (పాతచిత్రం)

76 వేల దరఖాస్తులు..

పీఎంఏవై పథకం తొలి విడత కింద భారీగానే దరఖాస్తులు వచ్చాయి. బాపట్ల జిల్లాలో మొత్తం 21 వేలు, పల్నాడు జిల్లాలో ఈ సంఖ్య 35 వేలు, గుంటూరు జిల్లాలో 20 వేల దరఖాస్తులు రాగా ఫీల్డ్ సర్వేను గృహ నిర్మాణశాఖ ఇప్పటికే ప్రారంభించింది. అర్హులైన ఏ ఒక్కరికీ ఈ పథకం దూరం కావడానికి వీల్లేదనే ప్రభుత్వ ఆదేశాల మేరకు. పూర్తి పారదర్శకంగా సర్వేను నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. గ్రామాలలో సొంత స్థలం ఉండి, ఇంటి నిర్మాణం చేయలేని స్థితిలో ఉన్నవారికే ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై ఇప్పటికే కేంద్రం స్పష్టత ఇచ్చింది. సొంత స్థలం ఉండడం కానీ, లేదా లే అవుట్లలో స్థలం ఉంటే.. ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్, ఆధార్ తదితర ప్రామాణికాలతో లబ్దిదారుల ఎంపిక చేపట్టనున్నారు. ఇంటి నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంలో దాదాపు 50 శాతం రాయితీ పీఎంఏవై పథకం ద్వారా అందించనున్నారు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎయిమ్స్ ఈడీ శాంతా సింగ్

రోగుల సంరక్షణకు ప్రాధాన్యం

ఎయిమ్స్ దినోత్సవంలో ఈడీ శాంతా సింగ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య, పరిశోధనలు, రోగ సంరక్షణే ప్రాధాన్యతగా మంగళగిరి ఎయిమ్స్ పనిచేస్తుందని ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ అహంతెం శాంతాసింగ్ తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ నాల్గో వార్షిక పరిశోధనా దినోత్సవం సందర్భంగా బుధవారం అనుసంధాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శాంతా సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో మంగళగిరి ఎయిమ్స్ ప్రముఖ సంస్థలలో ఒకటిగా అవతరించిందని చెప్పారు. 2019లో వైద్య సేవలు ప్రారంభమైనప్పటి నుంచి రోజుకు సగటున 3,500 మంది రోగులు ఓపీ సేవలు పొందుతున్నారని, ఇప్పటివరకు 30 లక్షల మంది ఓపీ సేవలు పొందారని తెలిపారు. డాక్టర్ కే.బాబ్జీ మాట్లాడుతూ అనుసంధాన్ దివస్‌లో వందకు పైగా పరిశోధనా ప్రాజెక్టులను సమర్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ జాయ్ ఎ.ఘోషల్, డాక్టర్ సోమనాథ్ బసు, డాక్టర్ మోనికా బహల్, డాక్టర్ అరుణ్ భట్, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కరువు



- ప్రైవేటు పాఠశాలల ఆగడాలను పట్టించుకోని విద్యాశాఖ
- నెలవారీ మామూళ్లపై క్షేత్రస్థాయి అధికారుల కన్ను

8



నేటి నుంచి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే

- అర్హులకు సంక్షేమ ఫలాల లబ్ధిని చేకూర్చడమే లక్ష్యం
- సర్వే అనంతరం ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల అందజేత

తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

8

సీసీఐ మేనేజర్‌గా నీరజ్ కుమార్

గుంటూరు సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నూతన మేనేజర్‌గా నీరజ్‌కుమార్ నియమితులయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ మేనేజర్‌గా ఉన్న రాజేంద్ర షా కూడా గుంటూరులోనే ఉండనున్నట్లు తెలుస్తోంది.

బీచ్ గేమ్స్ ఎంపికలు రేపు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని కృష్ణానది ఒడ్డున మణిపాల్ ఆస్పత్రి దగ్గర శుక్రవారం ఖేలో ఇండియా మహిళలు, పురుషుల బీచ్ గేమ్స్-2025 ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ అధ్రోఫీజూన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్ సెపక్ తక్రా, వాలీబాల్, కబడ్డీలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 5 నుంచి జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్, ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని రావాల్సిందిగా సూచించారు. ఇతర వివరాలకు 98661 34016, 90524 64770 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏఎన్‌యూ క్రీడాకారులకు అభినందన


విజయకేతనం చూపుతున్న డైరెక్టర్, క్రీడాకారులు

ఏఎన్‌యూ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాల అథ్లెటిక్స్‌లో వర్సిటీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బాజీపాలెంలోని కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో పురుషుల విభాగంలో 6 బంగారు, 4 వెండి, 8 కాంస్య పతకాలు, మహిళల విభాగంలో 8 బంగారు, 6 వెండి, 2 కాంస్య పతకాలతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. ఏఎన్‌యూ వ్యాయామ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలవడంతో.. పిన్సిపాల్, ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ కళాశాలలో అభినందించారు. మేనేజర్ కె.ప్రసన్నకుమార్, కోచ్ ఎం.వినోద్ పాల్గొన్నారు.

జడ్పీలో నిధుల గలాటా

● రూ.40 కోట్లు ఉన్నాయంటున్న ప్రజాప్రతినిధులు ● రూపాయి లేదంటున్న జడ్పీ అధికారులు


గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లా పరిషత్ వాతావరణం వేడెక్కింది. పనుల కేటాయింపు వ్యవహారంలో ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య తీవ్రమైన గలాటా జరుగుతోంది. నిధులు పుష్కలంగా ఉన్నా అభివృద్ధి పనులకు అధికారులు ఆమోదం తెలపడం లేదని జడ్పీటీసీలు ఆరోపిస్తున్నారు. అసలు ఇచ్చిన పనులకే నిధులు సరిపోవే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. 2021-2025కు గాను జడ్పీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.133 కోట్లు రావాల్సి ఉంది. ఈ నిధులకు గాను రూ.179 కోట్ల వరకు అభివృద్ధి పనులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. వాటిలో సుమారు రెండేళ్లు దాటినా చాలా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ మధ్య కాలంలో మూడు జిల్లాల్లోని పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈలతో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఈలు తమ ప్రాంతంలో ఇంకా ఆరంభించని పనుల వివరాలు వెల్లడించారు. నీటి పథకాలు, వివిధ అభివృద్ధి పనుల కోసం కేటాయించిన సుమారు రూ.40 కోట్లు ఉన్నాయని వెల్లడించినట్లు తెలుస్తోంది. అవి కాక జిల్లా పరిషత్ జనరల్ ఫండ్ నుంచి కూడా కొన్ని పనులకు నిధులు కేటాయిస్తున్నారు. వాటిలో కూడా చాలా వరకు పనులు ఆరంభించ లేదని తెలుస్తోంది.

రూ.40 కోట్లు కేటాయించవచ్చు కదా

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆయా పనుల నిమిత్తం కేటాయించి మిగిలిపోయిన రూ. 40 కోట్లు ప్రస్తుతం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించవచ్చు కదా అన్నది ప్రజా ప్రతినిధుల వాదన. ఈ నిధుల కేటాయింపు కోసం జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీల నుంచి చైర్ పర్సన్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉంది. అటువంటి పరిస్థితిలో ఉన్న నిధులు కేటాయించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి చైర్‌పర్సన్ నుంచి వెళ్లిన పనులకు అధికారుల ఆమోద ముద్ర వేయాల్సి ఉండగా.. అది జరగడం లేదని తెలుస్తోంది.

నిధుల కోసం జడ్పీటీసీల గొడవ

తమ పదవీ కాలం ముగుస్తున్న గ్రామాల్లో సరైన అభివృద్ధి కార్యక్రమాలు చేయలేక పోయామన్న భావన ఉమ్మడి జిల్లాలోని జడ్పీటీసీల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే గత స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో జడ్పీటీసీలు అజెండాను కూడా ఆమోదించ లేదు. తాము చెప్పిన పనులకు నిధులు కేటాయిస్తే తప్ప అజెండా ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. వాళ్లకు సంబంధించిన పనుల ప్రతిపాదనలను సీఈఓ కార్యాలయానికి పంపినట్లు చైర్‌పర్సన్ స్థాయీ సంఘం సమావేశంలో వెల్లడించారు. తాము ఇచ్చిన ప్రతిపాదనలకు నిధులు ఇవ్వకుండా ఎమ్మెల్యేలకు ఎలా కేటాయిస్తారని జడ్పీటీసీలు వాదనకు దిగడం జరిగింది. ఒక వేళ అధికారులు చెబుతున్నట్లు నిధులు లభ్యత లేకపోతే కొన్ని నియోజకవర్గాలకు రూ.కోట్లకు కోట్లు ఎలా కేటాయిస్తున్నారని కొందరు జడ్పీటీసీలు ప్రశ్నిస్తున్నారు.

నిధుల లభ్యతను బట్టే వర్క్ ఆర్డర్ ఇవ్వాలి

జిల్లా పరిషత్‌లో నిధులు ఉన్నా అభివృద్ధి పనుల కోసం కేటాయింపులు జరగడం లేదన్న వాదన నిజం కాదని సీఈఓ విజ్యోతి బసు తెలిపారు. నిధుల లభ్యతను బట్టే వర్క్ ఆర్డర్ ఇవ్వాల్సిన బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే కొంతమంది కాంట్రాక్టర్లు చేసిన పనులకు నిధులు జమ కాక కోర్టు కూడా వెళ్లారని తెలిపారు. నిధులు ఉంటే కచ్చితంగా అభివృద్ధి పనులకు కేటాయించడం జరుగుతుందన్నారు. కొందరు జిల్లా పరిషత్ బడ్జెట్, నిధుల లభ్యతపై అవగాహన లేక విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు.

రైల్వేస్ క్రికెట్ జట్టుకు.. మార్గదర్శకుడిగా డీసీఎం ప్రదీప్


రైల్వే సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్ చిలుక

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు(ఆర్ఎస్‌పీబీ) భారతీయ రైల్వే సీనియర్ పురుషుల క్రికెట్ జట్టుకు స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ ట్రైనర్ కమ్ టీమ్ మెంటార్‌గా గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్ చిలుకను నియమించింది. ఆయన 2015 బ్యాచ్ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ అధికారి. ఉన్నతస్థాయి పరిపాలన సేవలతో పాటు క్రీడా రంగంలోనూ నైపుణ్యాన్ని సమన్వయపరిచిన అరుదైన వ్యక్తిత్వం కలిగిన అధికారిగా ఆయన గుర్తింపు పొందారు. డాక్టర్ ప్రదీప్ ఉస్మానియా వర్సిటీ నుంచి ఎంబీబీఎస్, శస్త్రచికిత్స నైపుణ్యం కాకతీయ మెడికల్ కాలేజ్ నుంచి ఆర్థోపెడిక్స్‌లో ఎంఎస్ పూర్తి చేశారు. క్రీడాకారుల గాయాల నివారణ, కండరాలు, ఎముకల ఆరోగ్యంపై లోతైన అధ్యయనం చేశారు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నుంచి డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ మెడిసిన్ కోర్సుని ప్రస్తుతం అభ్యసిస్తున్నారు.

టోర్నమెంట్ బాధ్యతలు

విజయ్ హజారే ట్రోఫీలో రైల్వే క్రికెట్ జట్టు పాల్గొనే మ్యాచ్‌లకు ఆయన ఎస్అండ్‌సీ ట్రైనర్‌గా వ్యవహరిస్తారు. ఈ నెల 16 నుంచి 23 వరకు బెంగళూరులోని రైల్‌వీల్ స్పోర్ట్స్ అసోసియేషన్‌లో నిర్వహించనున్న ప్రీ-పార్టిసిపేషన్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన పర్యవేక్షిస్తారు. అనంతరం, బెంగళూరులోనే జరుగనున్న లీగ్ దశలో జట్టుకు మార్గదర్శకత్వం వహిస్తారు. డాక్టర్ ప్రదీప్ నియామక కాలానికి.. ఆయనను విధుల నుంచి రిలీవింగ్ చేయాలని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్‌కు సూచించింది. ఈ కాలాన్ని అధికారికంగా ఆన్ డ్యూటీగా పరిగణిస్తారు.

జీడీడీపీలో.. 6వ ర్యాంకు

(5వ పేజీ తరువాయి)

చేసేందుకు ఆయా సంస్థలు ఎంవోయూలు చేసుకున్నాయని, వాటిని గ్రౌండింగ్ చేయించాలన్నారు. గ్లోబల్ క్లస్టర్ సెంటర్స్(జీసీసీ) ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. ఇటీవల విశాఖలో జరిగిన సదస్సులో గుంటూరు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కుదుర్చుకున్న ఎంవోయూలన్నీ 45 రోజుల్లో గ్రౌండింగ్ చేయాలన్నారు. ఐటీసీ సంస్థ రూ.380 కోట్లతో ప్రతిపాదించిన ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టుని త్వరితగతిన గ్రౌండింగ్ చేయించాలన్నారు. నడింపాలెంలో ఎఫ్ఎఫ్‌సీని 10 ఎకరాల్లో, చినకాకానిలో ఎంఎస్ఎంఈ పార్కు 20 ఎకరాల్లో పొన్నూరులో ఎంఎస్ఎంఈ పార్కు 45.10 ఎకరాల్లో, తెనాలిలో ఎఫ్ఎఫ్‌సీ ఎకరంలో ఏర్పాటు చేయాలన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, తాడికొండలోనూ పార్కులు ఏర్పాటు కావాలని ఆదేశించారు. నగరంలోని క్రైస్తవ భవనం పూర్తి చేసేందుకు రూ.10 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్ కోరారు.

ఐపీఎల్‌లో దుగ్గిరాల యువకుడు



దుగ్గిరాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐపీ ఎల్‌లో గుజరాత్ జట్టు దుగ్గిరాలకు చెం దిన యార్రా పృథ్వీ రాజ్ ఎంపిక య్యాడు. 1998 లో ఇక్కడ జన్మించిన పృథ్వీరాజ్ తల్లి దండ్రు లతో కలిపి ప్రస్తుతం విశాఖపట్నంలో ఉంటు న్నాడు. ఐపీల్ మినీ వేలంలో గుజరాత్ టైటాన్స్ రూ.30 లక్షలకు అతనిని దక్కించుకుంది. దేశీయ మ్యాచ్‌లలో 95 వికెట్లు తీసి మీడియం పేసర్‌గా పృథ్వీ రాణిస్తున్నాడు. 2019 వరకు కోల్‌కత్తా నైట్‌రైడర్స్, అనంతరం హైదరాబాద్ సన్‌రైజర్స్‌కు అతను ప్రాతినిధ్యం వహించాడు. అలాగే ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో 11 వికెట్లు తీసి, 2025-26లో సయ్యద్ ముస్తాఫ్ అలీ ట్రోఫీలో మీడియం పేసర్‌గా 28 వికెట్లతో పృథ్వీ సత్తా చాటాడు.

ఆహార భద్రత కోర్సుతో ఉద్యోగావకాశాలు

● డిప్లొమా కోర్సు ప్రారంభించిన వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆహారభద్రత, నాణ్యత కోర్సు.. ఉద్యోగావకాశాలతోపాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఎంతగానో దోహదపడుతుందని అచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి తెలిపారు. బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటిసారిగా పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, పంట కోత అనంతరం సాంకేతికత ఆహారభద్రత, నాణ్యతలో పీజీ డిప్లమో కోర్సును బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. వైస్‌చాన్సలర్ కోర్సును ప్రారంభించి దాని ప్రాముఖ్యతను వివరించారు. మంచి పారిశ్రామికవేత్తగా ఎదగడానికి ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ మాట్లాడుతూ.. ఈ కోర్సు ఎంపిక వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. డాక్టర్ యామని మాట్లాడుతూ ఈ పీజీ ప్రోగాం ముఖ్య ఉద్దేశం, ఆహార భద్రత, నాణ్యతల ప్రాధాన్యతను వివరించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్, ఫోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజి సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఏడుకొండలు, డాక్టర్ బి.రవిబాబు, డాక్టర్ బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ కె.కృపావతి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూ టై అండ్ డై శిక్షణ పోస్టర్ల ఆవిష్కరణ


గోడ ప్రతుల ఆవిష్కరణలో వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సీఎస్ఆర్ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్స్ విభాగం లో అందించే టై అండ్ డై ఉచిత శిక్షణ కార్యక్రమం పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.బబిత, ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ శివరామ్ ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దివ్య తేజోమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శిక్షణ శిబిరం ఈ నెల 29 నుంచి జనవరి 4వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదన్నారు. సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం. వెంకటరమణ పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు 98482 86477 నంబరు ద్వారా రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు.

అమరజీవి స్మృతి వనానికి

చీఫ్‌విప్ జీవీ రూ.10 లక్షల విరాళం


ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, చిత్రంలో కనపర్తి శ్రీనివాస్, ఉండవల్లి శ్రీదేవి

వినుకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మాణం చేపట్టనున్న 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం, స్మృతి వనానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వ్యక్తిగతంగా రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలసి నగదు చెక్కును అందజేశారు. భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా స్మృతి వనం తీర్చిదిదుతున్న నేపథ్యంలో తనవంతుగా ఏదైనా చేయాలని విరాళం అందించినట్లు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు.

ఉపాధ్యాయుల్లో వ్యాపార నైపుణ్యాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్సీ ఆలపాటి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్

వట్టిచెరుకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల్లో వినూత్న ఆలోచనలు, డిజైన్, థింకింగ్ వ్యాపార నైపుణ్యాల అభివృద్ధే ఐడీఈ, బూట్ క్యాంపు నిర్వహణ లక్ష్యమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, కేంద్ర విద్యా శాఖ ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఐడీఈ బూట్ క్యాంపును బుధవారం కిట్స్ కళాశాలలో ఆర్జేడీ లింగేశ్వరరెడ్డితో కలసి ఎమ్మెల్సీ ఆలపాటి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. తొలి రోజు స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రముఖ వ్యాపారుల ప్రేరణాత్మక ఉపన్యాసాలను.. ఆరు జిల్లాల నుంచి హాజరైన ఉన్నత విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ఇన్నోవేటర్లు, ఇన్నోవేషన్ అంబాసిడర్లు స్క్రీన్ పై ఆసక్తిగా తిలకించారు. మానవ కేంద్రిత దృక్పథం ద్వారా వినూత్న ఆలోచనలు, సమస్యల పరిష్కారం అనే అంశంపై శిక్షణా మ్యాడ్యువల్స్ నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ.. వినూత్న ఆలోచనలు, డిజైన్, వ్యాపార నైపుణ్యాభివృద్ధికి ఇది ఒక ప్రయోజనకర అనుభవంగా నిలుస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ కోయ శేఖర్, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రిన్సిపల్ పి.బాబు, డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

52,190 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 54,461 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 52,190 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,820 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15400
273	11500	14300
341	10500	16500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16000
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16400
దేవనూరు డీలక్స్	11000	17000
ఆర్మూరు	10500	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	17000
నెంబరు. 5	11000	15300
273	----	----
341	11000	16800
4884	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	10000	16300
దేవనూరు డీలక్స్	10500	15600
తాలుకాయలు	5000	7500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యం

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నాని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. పశ్చిమ కార్యాలయంలో 19, 22వ డివిజన్ల తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆమె ముఖాముఖి సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్ర స్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని మాధవి పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే మ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, వాటి ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, కొమ్మినేని కోటేశ్వరరావు, కసుకుర్తి హనుమంతరావు, రాళ్ళబండి రామరాజు, చింతకాయల సాయి, డివి జన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంటూరు సూపర్ బజారుకు కొత్త పాలకవర్గం

గుంటూరు సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు కల్పవల్లి కో-ఆపరేటివ్ స్టోర్స్ (సూపర్ బజార్)కు ప్రభుత్వం కొత్త పాలకవర్గాన్ని నియమించింది. ఈ మేరకు వ్యవ సాయ, సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు సభ్యులతో కూడిన నాన్- అఫీషియల్ కమిటీని ఏర్పాటు చేశారు. పర్సన్-ఇన్-చార్జ్‌గా పొన్నగంటి భారతీదేవి, సభ్యులుగా ఉప్పతల సాంబశివరావు, చింతకాయల వెంకట సాయి నియమితులయ్యారు. బుధవారం పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవిని మర్యాద పూర్వకంగా కలుసుకొని, తమ నియామకానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

బాబు వస్తే జాబు వస్తుందని నిరూపించారు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్



కత్తెర సురేష్‌కుమార్

గుంటూరు సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాబు వస్తే జాబు వస్తుందన్న మాటకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలీస్ ఉద్యోగాలు ఇచ్చి నిరూపించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. బుధ వారం ఆయన గుంటూరులో మాట్లాడుతూ యువత భవిత కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు నడుం కట్టారని తెలిపారు. దానిలో భాగంగానే కానిస్టేబుల్ నియామకం జరిగిందన్నారు. డీఎస్సీ నిర్వహించి 15,591 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు చెందుతుందన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు నిర్వహించాలి

గుంటూరు(మెడికల్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో రోగుల ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈహెచ్‌ఆర్) నిర్వహించవలసిన బాధ్యత సీనియర్ అసిస్టెంట్లదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి, ఎటువంటి సమాచారం, సమస్య అయినా, ఈ-ఆఫీస్ ద్వారానే జిల్లా కార్యాలయానికి రావాలని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టు లను వీలైనంత త్వరగా, భర్తీ చేయాలని తెలిపారు. స్క్రబ్ టైఫస్ జ్వరాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌వో తెలిపారు.

క్రిస్మస్ పండుగ శాంతి, కరుణకు ప్రతీక

గుంటూరు మెడికల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, కరు ణ, సేవా భావానికి ప్రతీక అని అహల్య హాస్పిటల్‌కు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి తెలిపారు. క్రైస్తవుల పవిత్ర పండుగ అయిన క్రిస్మస్‌ను పురస్కరించుకుని బుధవారం కొత్తపేటలోని అహల్య హాస్పిటల్‌లో అందంగా అలంకరించిన క్రిస్మస్ క్రిబ్ (యేసు ప్రభువు జననం దృశ్యం)ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, రోగులు, వారి కుటుంబసభ్యులకు స్వీట్లు పంపిణీ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ ఏసు ప్రభువు జననం మానవత్వానికి, త్యాగానికి, సర్వ సమానత్వానికి నిదర్శనమని వివరించారు. డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా తమ ఆస్పత్రికి వచ్చే రోగులకు నిజమైన 'హీలింగ్ హ్యాండ్స్' అందించేది వైద్యులు మాత్రమే కాదని, ఆ శక్తిని ప్రసాదించేది దేవుడేనని అన్నారు.



క్రిస్మస్ క్రిబ్ దగ్గర ఉమాశంకర్, రాజకుమారి తదితరులు

మెడికల్ కళాశాలలపై వైసీపీది నకిలీ ఉద్యమం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకర ణను అడ్డుకుంటామని వైసీపీ చేపట్టిన ఉద్యమం పూర్తిగా నకిలీదని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ అన్నారు. శంకర్‌విలాస్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంతకాల సేకరణలో విద్యావంతులు పాల్గొనలేదని, గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక ప్రజల వద్దకు వెళ్లి విషయం చెప్పకుండా సంతకాలు తీసుకున్నారని విమర్శించారు. మంత్రిగా పనిచేసే సమయంలో ఒక్క చెక్‌డ్యామ్ కట్టని అంబటి విద్యాంతుడైన పెమ్మసానిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ సెల్ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి రమణ, బొల్లెదు సుశీలరావు, ఈమని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ రాజశేఖర్, హోంగార్డు కిషోర్‌లకు ఎస్పీ అభినందన

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత నెల 30న విశాఖపట్నంలో నిర్వహిం చిన 'సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ - 2025' పరుగు పోటీల్లో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న రాజశేఖర్ బాబు, జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డ్‌గా పనిచేస్తున్న జి. కృష్ణకిషోర్ పతకాలు సాధించారు. అక్టోబరు 2న విజయవాడలో నిర్వహించిన 'స్వచ్ఛథాన్ 2025- హాఫ్ మారథాన్'లో పాల్గొని ఇరువురు 21 కి.మీ. పరుగును 2 గంటల్లో పూర్తి చేశారు. ఏఎస్‌ఐ రాజశేఖర్ బాబు, హోం గార్డు కిషోర్ ఎస్పీని కలవగా వారిని ఆయన అభినందించారు.

సచివాలయంలో అప్సా నామినేషన్ల సందడి

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో సచివాలయ సంఘం(అప్సా) నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం ఒక్క రోజే 36 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో వీసీ మెంబర్లకు 18 నామినేషన్లు, అప్సా అధ్యక్ష, కార్యవర్గ సభ్యులకు మరో 18 నామినేషన్లు దాఖలయ్యాయి.

ట్రినిటి పారిస్ చర్చిలో ఘనంగా సెమీ క్రిస్మస్

గుంటూరు డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని ఆసుపత్రి కాంపౌండ్‌లో గల ట్రినిటీ పారిస్ చర్చిలో బుధవారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏఈఎల్‌సీ పరిపాలనాధికారి జస్టిస్ జోసెఫ్ మాట్లాడుతూ ఏఈఎల్‌సీ పరిధిలో ఉన్న ఆసుపత్రులు, చర్చిలు విద్యాసంస్థలకు పూర్వ వైభవం రావాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించి కుగ్లర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేద పాస్టర్లకు, పేదలకు ఆర్థిక సహాయం అందించారు. వేడుకల్లో ఏఈఎల్‌సీ సెక్రటరీ ఎన్.జేసు రత్నకుమార్, బత్తుల లెనిన్, పాస్టర్ జొన్నలగడ్డ దైవాశీర్వాదం, పి.రమేష్ తదితరులు ప్రార్థన చేశారు.

సవాళ్లు విసురుతున్న కొత్త వ్యాధులు

● వీటిని సమర్థవంతంగా ఎదుర్కొందాం

● డీఎంఈ డాక్టర్ రఘునందన్ పిలుపు



ప్రసంగిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్, హాజరైన వైద్యులు

గుంటూరు (మెడికల్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో పలు రకాల కొత్త వ్యాధులు ప్రజారోగ్యానికి సవాల్ విసురుతున్నాయని, వీటిని సమర్థవంతంగా ఎదు ర్కొనేందుకు వైద్యవర్గాలు కూడా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) జీ రఘునందన్ పిలుపునిచ్చారు. కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్లో బుధవారం రాత్రి 'స్క్రబ్ టైఫస్, మెలియాయిడోసిస్ జ్వరాలపై' వైద్యులకు ఏర్పాటు చేసిన శాస్త్రీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో గుంటూరు తురకపాలెంలో వెలుగు చూసిన మెలియాయిడోసిస్ జ్వరాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారినట్లు డాక్టర్ రఘునందన్ తెలిపారు. ప్రస్తుతం పలు జిల్లాల్లో స్క్రబ్ టైఫస్ జ్వరాలు వెలుగు చూస్తున్నట్లు తెలిపారు. మారుతున్న నేటి వాతా వరణ పరిస్థితుల్లో కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయని, వీటిని సమర్థవంతంగా తిప్పికొ ట్టేందుకు వైద్యనిపుణులు ఆయా వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచిం చారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ మాదల మాట్లాడుతూ జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా కొత్త వ్యాధుల జాడ తెలిస్తే సంబంధిత వైద్యులు ఆ సమాచారం ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వెలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్‌పీ) పోర్టల్‌కు అందించాలని కోరారు. దీనివల్ల తమ వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆ వ్యాధి విస్తరించకుండా తగిన నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ టీ సేవకుమార్, కార్యదర్శి బీ సాయి కృష్ణ, ఎం శివప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, సీనియర్ వైద్యనిపుణులు గడ్డిపాటి బాబురా వు, కనుమూరి శ్రీనివాసరావు, ఆర్ వీరేన్, తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఉదయం 7 గంటల్లోపు ప్రధాన వీధులు శుభ్రం చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం లో ఉదయం 7 గంటలలోపే మెయిన్ రోడ్లు శుభ్రం చేయడం పూర్తి కావాలని, 7 తర్వాత ఇంటింటి చెత్త సేకరణ జరగాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం సంగడిగుంట, కాకాని రోడ్డు, వాసవీనగర్, సాయినగర్, బస్టాండ్, నందివెలుగు రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈలు కళ్యాణరావు, హనీఫ్, వెంకటరమణ, ఆర్‌వో సాదిక్‌బాషా, ఎస్ఎస్ సాంబయ్య, ఇంజనీరిం గ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళికాధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల త్యాగాలు మరువలేనివి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల త్యాగాలు మరువ లేనివని, 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సమరంలో 6 లక్షలకు పైగా ముస్లిం వీరులు ప్రాణ త్యాగం చేశారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. బుధ వారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్లో సయ్యద్ నసీర్ అహ్మద్ రచించిన అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ - షేక్ మదీనా పుస్తకావిష్కరణ కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ నాటి బ్రిటిష్ ప్రభుత్వం హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెట్టి పాలిస్తే నేడు మతోన్మాదులు మెజారిటీ వాదాన్ని ముందుకు తెచ్చి మైనారిటీలపై వివక్ష చూపుతూ మరోసారి విభజన రాజకీయాలు చేస్తున్నారని వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ నసీర్ అహ్మద్ భారత సమాజంలో ముస్లిం త్యాగజనుల కృషిపై ఇప్పటికే 26 చారిత్రక గ్రంథాలను రచించి ప్రజల్లో సోదర భావాన్ని పెంపొందించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, పుస్తక రచయిత సయ్యద్ నసీర్ అహ్మద్ ప్రసంగించారు.

పరీక్ష పే చర్చలో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించాలి

● డీఈవో ఎస్‌కే సలీం బాషా

గుంటూరు(విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష పే చర్చలో విద్యార్థులు అత్యధిక మంది పాల్గొనేలా పాఠశాల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని డీఈవో షేక్ సలీం బాషా సూచించారు. బుధవారం నగరంలోని నగరపాలక సంస్థ పరిధిలోని లూథరన్ మోడల్ హైస్కూల్, ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వందరోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్ఎంఎంఏ ఖుద్దూస్, ఎస్‌కేబీఎం హెచ్ఎం ఖాజావలి పాల్గొన్నారు.

పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందిం చాలని పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు పి.కేశవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టరేట్ రోడ్డులోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యాలయంలో బుధవా రం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత పెన్షన్ పితా మహుడు నకార చిత్రపటానికి సంఘ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కార్యదర్శిగా వై నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వి.పెద్దరత్తయ్య, గుం టూరు నగరశాఖ అధ్యక్షుడిగా షేక్ కరీముల్లా షా ఖాదరి, కార్యదర్శిగా బి.కోటే శ్వరరావు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు లక్ష ఆర్థిక సాయం

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 2026 సంవత్సరంలో హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు కూటమి ప్రభుత్వం ప్రతి హాజీకి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు జీవో జారీ చేసినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ జనాబ్ షేక్ హసన్ బాషా తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సహాయం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ జనాబ్ మీర్జా అబీద్ హుస్సేన్ తదితరులు పాల్గొని కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఈవ్‌టీజర్లపై స్పెషల్ డ్రైవ్

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఈవ్‌టీజర్లపై బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టుబడిన ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈవ్‌టీజింగ్, బైక్ రేసింగ్‌లను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈవ్‌టీజింగ్‌కి పాల్పడే 260 మందిని, బైక్ రేస్, రాష్ డ్రైవింగ్ చేసే 214 మందిని గుర్తించి, వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహించి, ఇటువంటి చర్యలు భవిష్యత్తులో కొనసాగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సత్కారం

గుంటూరు(విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడిగుంటలోని చలమయ్య డిగ్రీ కళాశాలలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను బుధవారం సత్కరించారు. కళాశాలలో డిగ్రీ చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షణీయ మని కళాశాల పాలక మండలి సభ్యుల పేర్కొన్నారు. అభ్యర్థులు పీటం వెంకటలక్ష్మి, పరాడి కళ్యాణి, కాసింశెట్టి అఖిల్ గోపీచంద్‌లను కార్యదర్శి సూర్యనారాయణ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు శ్రీధర్, చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో వికసిత్ భారత్ - స్వర్ణాంధ్ర సదస్సు

● సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులకు ఆహ్వానాలు

తుళ్లూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భారత్ సుస్థిర అభివృద్ధిని కాంక్షిస్తూ రానున్న ఫిబ్రవరి నెలలో రాజధాని గ్రామం నీరుకొండ ఎస్ఆర్ఎం విద్యాసంస్థ ల సమన్వయంతో వికసిత్ భారత్, - స్వర్ణాంధ్ర సాధన పేరిట జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహిస్తున్నామని 20 సూత్రాల కార్యక్రమాల(వికసిత్ భారత్- స్వర్ణాంధ్ర) అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. బుధవారం ఎస్ఆర్ఎం యూనివర్శిటీ వీసీ సీహెచ్ సతీష్‌కుమార్, గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.నారాయణరావులతో ఆయన సమావేశమయ్యారు. ప్రధాని మోదీ సంకల్పం వికసిత్‌భారత్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు విధేయమైన స్వర్ణాంధ్ర సాధన దిశగా ఈ సదస్సులో విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల భాగస్వామ్యం అనే అంశంపై ఫిబ్రవరిలో జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని దినకర్ వివరించారు. ఎస్ఆర్ఎం యూనివర్శిటీ వేదికగా దేశంలోని వివిధ విద్యాసంస్థలు, శాస్త్ర సాంకేతిక, విద్యారంగంలో నిష్ణాతులైన వారితో కలిసి ఈ సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనికి ముఖ్యఅతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను ఆహ్వానించనున్నామని చెప్పారు. దినకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సమావేశంలో సీఎఫ్ ఏవో సుమ, డీన్ రంజిత్, డైరెక్టర్లు పంకజ్, అనూప్‌సింగ్ ప్రొఫెసర్ సునీత పాల్గొన్నారు.

ఇంధన పొదుపును అలవాటుగా చేసుకోవాలి

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపును ప్రజలు అల వాటుగా చేసుకోవాలని గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం మహిళా కళాశాలలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఇంధన పొదుపుపై అవగాహన పెంచుకొని, సమాజంలో తోటి వారికి ఇంధన పొదుపుపై తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ పోటీ ల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజిక్స్ హెచ్‌వోడీ విజయశ్రీ, ఆపరేషన్ డిప్యూటీ ఈఈలు ముస్తాక్ అహ్మద్, సురేష్‌బాబు, ఏఈ ఎమ్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

'ఉపాధి హామీ'లో మహాత్ముడి పేరు తొలగించటం హేయం

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తుది శ్వాస విడిచే సమయంలోనూ హే రామ్ అన్న మహాత్మాగాంధీ నిజమైన రామభక్తుడని, ఒక పథకం ప్రకారం గాంధీపై బీజేపీ విషం చిమ్ముతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. జాతీయ ఉపాధి హామి పథకంలో మహాత్మాగాంధీ పేరు తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వ చర్యను నిరసిస్తూ బుధవారం హిమనీ సెంటర్లో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, చిలకా విజయ్‌కుమార్, జాన్‌బాబు, బిళ్ళా సునీల్ పలువురు నాయకులు మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. మహాత్మాగాంధీపై విషం చిమ్ముతూ చరిత్రను తప్పుదోవ పట్టించేలా చేస్తున్నారని, నిజమైన ఆర్ఎస్ఎస్ వాదులు, కూటమి పార్టీలు ఖండించాలని పిలుపునిచ్చారు. లింగంశెట్టి మాట్లాడుతూ జాతిపిత మహాత్ముడి పేరు మార్చాలనుకోవటం హేయమని విమర్శిం చారు.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 2005 ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని వ్యవ సాయ కార్మిక శాఖ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ఆరోపించారు. స్థానిక అరండల్‌పేటలో ఓ హోటల్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సరైన విధానం కాదన్నారు. నూతన చట్ట సవరణలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసనలు నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దండా లక్ష్మీనారాయణ, జొన్నా శివశంకర్, పాశం రామారావు, లక్ష్మణరావు, రామకృష్ణ, ఎస్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పని హక్కు పరిరక్షణకు సమష్టి పోరాటం అవసరం

● ఏపీ ప్రజా పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ కొండపల్లి సాల్మన్

గుంటూరు(విద్య), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా వ్యవసాయ కూలీలకు ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక స్వావలంబనాన్ని, భూస్వామ్య బంధనాల నుంచి స్వాతంత్ర్యాన్ని కల్పిస్తూ గ్రామీణ ఆర్థిక, సామాజిక ముఖ చిత్రాన్ని మార్చిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005లో మార్పులు చేయాలని కేంద్రం ప్రతిపాదించడం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రజా పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ కొండపల్లి సాల్మన్ పేర్కొన్నారు. స్థానిక చుట్టుగుంట సమీపంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడం సరికాదన్నారు. కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, పౌర సమాజం కొత్త బిల్లును వ్యతిరేకించాలని సంఘం నాయకులు కొండపల్లి సాల్మన్ పాల్, షేక్ బాజీ, కె.వెంకటేశ్వరరావు, మేకతోటి వీరయ్య, తురకా మంగయ్య తదితరులు విజ్ఞప్తి చేశారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానం ద్వారా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో బుధవా రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో 108, 107 జీవోల ద్వారా వైద్య కళాశాలల యాజమాన్య కోటా సీట్ల అమ్మకానికి అనుకూలంగా విధానాలు తీసుకువచ్చారని, ఆ సమయంలో టీడీపీ, జనసేన దీనిని తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. అధికారంలోకి రాగానే నాటి విధానాలనే అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయంతో బలహీన వర్గాలు, మైనార్టీలు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా గురువారం కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసనల్లో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, మేడా హనుమంతరావు, కోటా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

గుంటూరు(విద్య), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ వి.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రి, పీజీ కళాశాలలో ఈ4యూ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 26 మంది విద్యార్థులు 2.4 లక్షల వార్షిక వేతనంలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, లావు శ్రీకృష్ణదేవరాయలు సీఈవో మేఘన అభినందించారు.



మాయాబజార్‌లో డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

నియోజకవర్గ రూపురేఖలు మారుస్తాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మాయాబజార్‌లో చేపట్టిన సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని గత ఐదేళ్లలో అభివృద్ధికి దూరం చేశారని విమర్శించారు. మారుమూల ప్రాంతాలనే కాకుండా ప్రధాన రహదారులను సైతం పట్టించుకోలేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా చర్యలు చేపట్టామని తెలిపారు.

ముస్లింల అభ్యున్నతికే వక్ఫ్ బోర్డు నిధులు: ఎమ్మెల్యే నసీర్

వక్ఫ్ బోర్డు నిధులు ముస్లిం సమాజ అభ్యు న్నతికి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. వక్ఫ్‌బోర్డు ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం గుంటూరు తూర్పు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గతంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులు 65వేల ఎకరాలు ఉండేవని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉమిద్ పోర్టల్ తీసుకువచ్చి, దాని ద్వారా మరో 15వేల ఎకరాల వక్ఫ్ బోర్డు భూములు నమోద చేశామని చెప్పారు. తద్వారా రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులు 65వేల ఎకరాల నుంచి 81వేల ఎకరాలకు పెంచామని తెలిపారు. ఇప్పటికే వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతమయ్యాయని, వీటిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 900 కేసులు నమోదు చేశామని ఎమ్మెల్యే చెప్పారు. వక్ఫ్ బోర్డు నిధులను రూ.5 కోట్ల నుంచి 12 కోట్లకు పెంచామని చెప్పారు. ముస్లిం మహిళల ఆర్థిక అభ్యున్నతికి వక్ఫ్ బోర్డు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట చిట్‌రిజిస్ట్రార్‌గారి కోర్టు నందు
Dispute No : 114/2014 in I.A. 37/2025
వెంకట తిరుమల చిట్ ఫండ్(ప్రై)లిమిటెడ్
నరసరావుపేట Disputant
Vs
అలికేపల్లి వెంకట రెడ్డి మరియు ఇతరులు opponents

Notice as per rule 50 of the A.P. Chit Fund Rules 2008

Opponent 2 - వాకా కరుణాకర్ రెడ్డి S/o కోటిరెడ్డి, హౌస్‌నెం. 4-21-63/1, ఫ్లాట్ నెం. 303, లక్ష్మీ నివాసం అపార్ట్‌మెంట్, చైతన్యపురి, కొరిటెపాడు, గుంటూరు, గుంటూరు జిల్లా.

పైన తెలియపరిచిన Disputeకి సంబంధించి, మీరు Opponent 2 గా ఉన్నారు. ఈ Dispute లో వెంకట తిరుమల చిట్‌ఫండ్ వారు చిట్ రిజిస్ట్రార్ గారి కోర్టులో దాఖలు చేసియున్న Attachment Before Judgement పిటిషన్ నిమిత్తం నోటీస్ కమ్ కండీషనల్ అటాచ్‌మెంట్ ఆర్డర్‌ని ఇష్యూ చేయటం జరిగింది. As per the chit funds act 1982, under section 68 (1&2) ప్రకారం ఇష్యూ అయిన ఈ నోటీస్ కమ్ కండీషనల్ అటాచ్‌మెంట్ ఆర్డర్ కాపీని మీకు పంపించటం జరిగింది. మీరు ఈ నోటీస్ ని తీసుకొనకపోవటం వలన పై Dispute No. 114/2014 in I.A 37/2025 తాలూకా మీకు ఈ నోటీసు జారీ కాగలందులకు గాను, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసినదిగా ఆర్డర్ వేసినారు. కావున మీరు **ది.30-12-2025వ** తేదీన **ఉదయం గం॥ 10-30ని॥లకు** నర్సరావుపేట చిట్‌రిజిస్ట్రార్ గారి కోర్టులో హాజరు అయ్యి, మీకు గల ఆక్షేపణలను స్వయంగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని తెలియచేసుకొనగలరు. లేని యెడల మీపై పరోక్షంగా పై **Dispute 114/2024, in I.A. 37/2025** నందు మీ ప్రాపర్టీ ని జప్తు చేయుట జరుగునని మరియు మిమ్మల్ని Exparte గా తీర్మానం చేయబడునని ఇందుమూలంగా ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచటమైనది.

వాయిదా తేది : 30-12-2025, నర్సరావుపేట, పల్నాడు జిల్లా.

ఇట్లు : మేనేజరు / ఫోర్‌మెన్
వెంకట తిరుమల చిట్‌ఫండ్(ప్రై)లిమిటెడ్
నర్సరావుపేట.

నేటి నుంచి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే

● అర్హులకు సంక్షేమ ఫలాల లబ్ధిని చేకూర్చడమే లక్ష్యం
● సర్వే అనంతరం ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల అందజేత



సత్తెనపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు శ్రీకారం చుట్టింది. గురువారం నుంచి ఈ సర్వే ప్రారంభం కానుంది. గత ప్రభుత్వంలో కుటుంబ మ్యాపింగ్ సరిగా జరగకపోవటంతో ప్రభుత్వ పథకాల లబ్ధిని అర్హులు అందుకోలేక పోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అనేక పథకాలు ప్రవేశ పెట్టినా అవి అర్హులకు సరిగా అందకపోవటంతో కొంత మంది పేదలు రేషన్ కార్డు కూడా తీసుకోలేక పోయారు. నిరుద్యోగులను గుర్తించి వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి కౌసలం పేరుతో ఇటీవల సర్వే జరిగింది. ఆ సర్వేలోను కుటుంబ మ్యాపింగ్ సరిగా జరగలేదు. దీంతో నిరుద్యోగులను గుర్తించటంలో ఇబ్బందులు తలెత్తాయి. వీటన్నింటి దృష్ట్యా ప్రభుత్వం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే చేయించాలని నిర్ణయించింది. ఈ సర్వేలో ప్రజల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి కుటుంబాల ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ వివరాలు నమోదు చేస్తారు. సర్వే ఆధారంగా సహకరించిన డేటాతో అర్హులకు ప్రభుత్వ పథకాలు చేరవేయడంతో పాటు ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు జారీ చేయనున్నారు. సచివాలయాల వారీగా కుటుంబాల వివరాలు ఇప్పటికే ఒకసారి మ్యాపింగ్ చేశారు. కొత్తగా ఆ కుటుంబాలను మరోసారి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే చేయనున్నారు.

పర్యవేక్షణ కరువు

● ప్రైవేటు పాఠశాలల ఆగడాలను పట్టించుకోని విద్యాశాఖ
● నెలవారీ మామూళ్లపై క్షేత్రస్థాయి అధికారుల కన్ను

నెల వారీ మామూలు ఇస్తే చాలు ప్రైవేటు పాఠశాలల్లో ఏం జరిగినా పట్టించు కోము అన్న చందంగా విద్యాశాఖలో కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారు. నిర్దేశించిన విధంగా పాఠశాలల్లో తనిఖీలు మరిచి కాసుల వేటపై కన్నేసి విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా పట్టాపురంలోని జీకేఆర్ పబ్లిక్ స్కూల్లో చిన్న తప్పు చేశారని ఇద్దరు విద్యార్థుల్ని మోకాళ్ల దండన విధించి యాజమాన్యం పైశాచిక ఆనందాన్ని పొందిన సంఘటన వెలుగులోకి వచ్చినా కూడా ఎంఈవో స్థాయి అధికారులు స్పందించ లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో దాదాపు 200కు పైగా చిన్నాచితక ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిత్యం ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సమస్యలు అధికారుల దృష్టికి వచ్చినా వారు ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● ఇష్టారాజ్యంగా వసూళ్లు

ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్‌లు, స్టేషనరీ విక్రయించకూడదు. అయితే దాదాపు అన్ని పాఠశాలల్లో విక్రయ కేంద్రాలు వెలిసి విద్యార్థులను దోపిడీకి గురిచేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. బయట మార్కెట్లో రూ.2వేలు కూడా విలువచేయని పుస్తకాలకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేసి విద్యార్థులకు అంటగడుతున్నారు. ఇక పాఠశాల ఫీజును విద్యార్థుల స్థాయిని బట్టి వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సగటున రూ. 20 వేల నుంచి దాదాపు రూ. లక్ష వరకు వసూలు చేస్తున్న పాఠశాలలు ఉన్నాయి.

● పదో తరగతి పరీక్ష ఫీజు రూ.2వేలు వసూలు

పదో తరగతి పరీక్షల ఫీజును రూ.125 వసూలు చేయాల్సి ఉండగా దాదాపు అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రూ. 1500 నుంచి రూ. 2 వేల వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. అదేమని ప్రశ్నిస్తే పది పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారులకు ముడుపులు ఇచ్చుకోవాల్సి ఉందనే సాకు చెబుతున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కామన్ ఎగ్జామినేషన్ బోర్డు నుంచి వచ్చిన ప్రశ్న పత్రాలతో నిర్వహించే పరీక్షలకు కూడా కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

● ఫీజు చెల్లించని విద్యార్థులపై శిక్షలు

పాఠశాలల్లో ఫీజులు సకాలంలో చెల్లించని విద్యార్థిని విద్యార్థులను యాజమాన్యాలు రాచిరంపాన పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల ఫీజులు చెల్లించని విద్యార్థులను తరగతి గదిలో బెంచీలపై నిల్చోబెట్టడం, తల్లిదండ్రుల గురించి హేళనగా మాట్లాడటం చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. పదో తరగతి పాస్ అయిన తరువాత టీసీ, మార్కుల జాబితా తదితర సర్టిఫికెట్లు ఇవ్వాలన్నా కూడా ఒక్కో విద్యార్థి నుంచి రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నారు.


పాఠశాలలో మోకాళ్లపై కూర్చున్న విద్యార్థులు

● ప్రభుత్వ ఆదేశాలు అంటే లెక్కలేదు

ఇటీవల నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన మార్కులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ అధికారులు నెత్తి నోరు బాదుకున్నా యాజమాన్యాలు ఇప్పటి వరకు స్పందించలేదు. ఈ ఏడాది విద్యా హక్కు చట్టం ద్వారా పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ సీట్లు ఇవ్వాల్సి ఉండగా తొలుత దాదాపు అన్ని పాఠశాలలు తిరస్కరించాయి. ప్రభుత్వం నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి రావడంతో చివరకు నెలల తరబడి గడిచిన తర్వాత సీట్లు ఇచ్చారు. విద్యా హక్కు చట్టం ద్వారా చేరిన విద్యార్థుల వద్ద నుంచి కూడా ఫీజులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

● కట్టడి చేయని ప్రభుత్వం

ప్రైవేటు విద్యాసంస్థలను కట్టడి చేసేందుకు ఇటు ప్రభుత్వం అటు అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కనీసం పాఠశాలల్లో యాజమాన్యాలు చేస్తున్న ఆగడాలను ప్రశ్నించడానికి అవకాశం ఉండటం లేదు. తాజాగా పట్టాభిపురంలోని జీకేఆర్ పబ్లిక్ స్కూల్లో ఇద్దరు విద్యార్థులు బాత్రూం డోర్ కొట్టారని పాఠశాల డైరెక్టర్ విద్యార్థుల్ని మోకాళ్ల దండన విధించిన సంఘటన కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. వాస్తవంగా ఈ ఘటన జరిగి దాదాపు 15 రోజులు అవుతుంది. విషయం స్థానిక ఎంఈవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. చివరకు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా తరువాత మంత్రాంగం నడిపారని విచారణ చేశారు. మరోసారి తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అప్పుడు విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలో తనిఖీలు చేసి విచారణ చేపట్టారు. అయితే పాఠశాల యాజమాన్యం నుంచి క్షేత్రస్థాయి అధికారి భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని తల్లిదండ్రుల ఫిర్యాదును బుట్టదాఖలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే పాఠశాలలో ఓ డైరెక్టర్ విద్యాశాఖ అధికారులను బ్లాక్ మెయిల్ చేసే స్థాయికి ఎదిగిందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● టోల్ ఫ్రీ నెంబర్ పెట్టాలని డిమాండ్

ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల అక్రమాలు బహిర్గతం చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఉండాలని తల్లిదండ్రుల నుంచి డిమాండ్ వస్తోంది. కనీసం డీఈవో కార్యాలయాల్లో అయిన ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరణకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధాన్యం రవాణాకు ప్రత్యేక రైల్వే వ్యాగన్లు


తెనాలి రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక వ్యాగన్‌లో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న చిత్రం

● తెనాలి నుంచి పెద్దాపురానికి వ్యాగన్ ప్రారంభం
● మధ్యాహ్న భోజన పథకానికి రాష్ట్రమంతా పంపుతామన్న మంత్రి మనోహర్
● ధాన్యం లోడు చేయించిన సివిల్ సప్లయిస్ డీఎం

తెనాలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు జిల్లాలో రైస్ మిల్లుల ఖాళీ లేని సమస్యకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రత్యామ్నాయాన్ని చూపింది. గత వైసీపీ ప్రభుత్వంలో లారీలతో ఇతర జిల్లాల్లోని రైస్ మిల్లులకు ధాన్యం తరలించే భారాన్ని రైతుల నెత్తిపై మోపితే, కూటమి ప్రభుత్వం ఈ సమస్యకు వినూత్న పరిష్కారం చూపింది. జిల్లా నుంచి రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ధాన్యాన్ని తరలించేందుకు ఏకంగా రైల్వే వ్యాగన్లనే ఏర్పాటు చేసింది. బీపీటీ వంటి సన్నబియ్యం కృష్ణా జిల్లాలోనే పండుతుండటంతో వీటిని మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగించుకునేలా నేరుగా ధాన్యానే జిల్లాలకు పంపే ఏర్పాట్లు చేశామని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ధాన్యం రవాణాకు రైల్వేవ్యాగన్లు ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

● రోడ్డు రవాణాతో భారం అవుతుందనే..

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలోని 20 రైస్ మిల్లులకే పంపుతూ వచ్చింది. వీటి సామర్థ్యం 20 మెట్రిక్ టన్నులు కావడం, ఆ మొత్తం ఇప్పటికే నిండిపోడంతో రైస్‌మిల్లులు ఖాళీ లేక ధాన్యం కొనుగోలుపై ప్రభావం పడింది. దీంతో రైతులు గత వారం నుంచి ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీని వల్ల మద్దతు ధర లభించక నష్టపోతున్నామని పలువురు రైతులు తాజాగా మంత్రి మనోహర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిని పరిశీలించిన మంత్రి సన్న బియ్యాన్ని మధ్యాహ్న భోజనానికి ఉపయోగించుకునేలా గతంలో బియ్యం తరలించిన పద్ధతిని మార్చి నేరుగా ధాన్యాన్నే ఆయా జిల్లాల్లోని రైస్‌మిల్లులకు పంపాలని నిర్ణయించారు. అయితే రోడ్డు రవాణాతో ఇది భారం అవుతుందనే ఉద్దేశ్యంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైల్వే వ్యాగన్ల ద్వారా పంపగలిగితే సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆలోచనకు వచ్చారు. అనుకున్నదే తడవుగా దీని కోసం తెనాలి నుంచి మొదటి విడతగా కాకినాడ జిల్లా పెద్దపురానికి 30 ర్యాక్‌లతో ఉన్న ఓ గూడ్స్ రైలును ఏర్పాటు చేయించారు.

● 1350 మెట్రిక్ టన్నులు తరలింపు

గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన లారీలలోని ధాన్యాన్ని వ్యాగన్‌లో లోడ్ చేయించి బుధవారం 1,350 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కాకినాడ జిల్లాకు పంపారు. గురువారం మరో వ్యాగన్ ఏర్పాటుచేస్తున్నామని, జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం పరిమాణాన్ని బట్టి తరువాత కూడా ప్రత్యేక గూడ్స్ రైళ్లను సిద్ధం చేస్తామని మంత్రి మనోహర్ వివరించారు. జిల్లాలో 47 క్లస్టర్లు ఉంటే దానిలో 44 క్లస్టర్లలో ఇప్పటికే వరి కోతలు పూర్తయ్యాయి. రైతుల నుంచి 26 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వాటిని కొన్న 12గంటల లోపే రూ.53 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేశారు. మరో రూ.10 కోట్లు కూడా 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో వేసినట్లు సివిల్ సప్లయిస్ డీఎం తులసి వివరించారు. ఇకపై జిల్లానుంచి ప్రతిరోజు హెచ్‌సీఎల్ వ్యాగన్లద్వారా ధాన్యం రవాణా ఇతర జిల్లాలకు జరుగుతుందని, రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదని అన్నారు. మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

తిరుపతి దాకా రాలేను.. ఏడు కొండలు ఎక్కలేను.. ఇక్కడకే రమ్మని ఏ భక్తుడు పిలిచాడో ఏమో కానీ.. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుడు శ్రీదేవితో కలిసి పల్నాడుకు తరలి రానున్నారు. శ్రీవారికి పిడుగురాళ్లలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభోగంగా జరిపేందుకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 25వేల మందికి పైగా పాల్గొనే ఈ కల్యాణ వేడుక కోసం లైమ్ సిటీని మరో తిరుమల మాదిరిగా ముస్తాబు చేస్తున్నారు.

కల్యాణ వైభోగమే

● ఘనంగా వేంకటేశ్వరుని వివాహ వేడుక ఏర్పాట్లు
● శ్రీదేవి సమేతంగా లైమ్ సిటీకి తరలిరానున్న శ్రీవారు
● టీటీడీ నుంచి ఉత్సవ విగ్రహాలు.. పూజారులు రాక
● భారీ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీకారం


కల్యాణ వేడుకల నిర్వహణపై అధికారులు, పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గుంటూరు సిటీ/పిడుగురాళ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6గంటలకు పిడుగురాళ్లలోని జానపాడు రోడ్డులో ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం దగ్గర శ్రీనివాసుని కల్యాణ వేడుకలకోసం వేదికను సిద్ధం చేస్తున్నారు. సుమారు దశాబ్దకాలం తర్వాత గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఏర్పాటుచేస్తున్న తిరుమలేశుని పరిణయ మహోత్సవంలో నియోజకవర్గంలోని సామాన్యులనే 'మాన్యులు'గా భావించి వీఐపీ ట్రీట్మెంట్ ఇవ్వనున్నారు. తిరుపతి దేవేరీ, దేవేరులు తరలివస్తున్న వేడుకలో నియోజకవర్గ ప్రజలకు పెద్ద పీట వేయాలన్న ఆలోచనతోనే ముగ్గురు, నలుగురు తప్ప మిగిలిన ముఖ్యనేతలకు ఆహ్వానం లేనట్టుతెలుస్తోంది.

● తిరుపతి మాదిరి గానే...

పిడుగురాళ్లలో జరగనున్న వేడుకలకు తిరుమల తిరుపతి నుంచి ఉత్సవ విగ్రహాలు, పూజారులు రానున్నారు. ప్రసాదం కూడా అక్కడ నుంచే తీసుకువస్తారు. అక్కడ స్వామి వారి కల్యాణం ఏ రీతిలో జరగనుందో అదే పద్ధతిలో ఇక్కడ చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. అందుకోసం టీటీడీని ఎమ్మెల్యే యరపతినేని ప్రత్యేకంగా ఒప్పించారు. ఈ నేపథ్యంలో జానపాడు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం దగ్గర తిరుపతి నమూనాలో గుడి, గోపురం ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 3 గంటలకు పైగా సాగే వివాహ క్రతువులో ఆద్యంతం భక్తి భావం వెల్లి విరిసేలా.. పట్టణమంతా గోవింద నామ స్మరణ వినపడేలా అత్యాధునిక సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు.

● బిగ్ స్క్రీన్లు.. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 గ్యాలరీలు...

కార్యక్రమానికి సుమారు 25వేల మందికి పైగా హాజరు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. వచ్చినవారు ఎక్కడ నుంచి అయినా కల్యాణ ఘట్టం మొత్తం చక్కగా వీక్షించేలా జానపాడు రోడ్డులో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి 20 అడుగులకు ఒక స్క్రీన్ ఉండేలా చూస్తున్నారు. అలాగే ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 పేర్లతో గ్యాలరీలు ఏర్పాటుచేస్తున్నారు. 60 ఏళ్లుపై బడిన వారిని ఎల్ 1 గ్యాలరీకి, 50 ఏళ్లు దాటిన వారిని ఎల్ 2 గ్యాలరీకి, మధ్య వయస్కులకు ఎల్ 3 గ్యాలరీని కేటాయించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మరో 10 వేల మంది కూర్చొని చూసేలా ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాట్లు చేస్తున్నారు.

● సంప్రదాయానికి పెద్ద పీట

సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం వివాహ మహోత్సవం కావటంతో అక్కడకి వచ్చేవారికి కొన్ని ప్రత్యేక సూచనలు చేయాలని నిర్ణయించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా సంప్రదాయ దుస్తుల్లోనే రావాలని చెబుతున్నారు. పురుషులు పంచె, కండువా, ధోవతి, మహిళలు మన సంప్రదాయ కట్టు, బొట్టు ఉండేలా తరలిరావాలని సూచనలు చేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ తిరుపతి లడ్డు ప్రసాదం అందజేయనున్నారు.

● ఇంటింటికీ అక్షింతలు

తిరుమలేశుని కల్యాణం ముగిసిన తర్వాత గురజాల నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి స్వామి వారి అక్షింతలు, ఫోటో, ప్రసాదం పంపే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమం జరిగే రోజు జిల్లాలోని నలు మూలల నుంచి వచ్చిన భక్తుల కోసం ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయాలపై యరపతినేని శ్రీనివాసరావు పలు శాఖల అధికారులతో ఇప్పటికే ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం

● రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య


మాట్లాడుతున్న వి.కృష్ణయ్య, వేదికపై కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరులోని అరండల్‌పేటలో బుధవారం సంఘ జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకర్ అధ్యక్షతన పలు ప్రజా, రైతు సంఘాల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి కృష్ణయ్య ప్రసంగిస్తూ వ్యవసాయ రంగాన్ని నిలబెట్టుకునేందుకు రైతులను సంఘటిత పరిచేదిశగా ఉద్యమాలను రూపొందించాలన్నారు. ఇందులో భాగంగా గుంటూరులో జనవరి 29 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న అఖిలభారత కిసాన్ సమితి(ఏఐకేఎస్) జాతీయ సమావేశాల్లో ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ నాయకులు ఈ సమావేశంలో పాల్గొని, చేయనున్న తీర్మానాలు కీలకంగా మారనున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలోని సంక్షోభం వల్ల స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ వాటా తగ్గిపోయిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయరంగంలో ఒక్క పంటకి గిట్టుబాటు ధరలు లేదన్నారు. ఏఐకేఎస్ జాతీయ సమావేశాలకు రైతు సంఘం నాయకులు అశోక్ దావాలే, హనన్ మొల్ల, విజూ కృష్ణ పాల్గొని కీలక నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. అనంతరం జాతీయ సమావేశాల ఆహ్వానకమిటీని ఏర్పాటుచేశారు. సమావేశంలో తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ టి.రత్నారావు, బండ్ల సూరయ్యచౌదరి, ఆర్.అంకయ్య, వై.రాధాకృష్ణమూర్తి, వీవీకే సురేష్, పాశం రామారావు, ఈమని అప్పారావు, కె.అజయ్‌కుమార్, ముత్తవరపు సురేష్ పాల్గొన్నారు.

21, 22న వీవీఐటీయూ యువజనోత్సవం

● వివావీవీఐటీయూ 2కే25-26 బ్రోచర్ల ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయస్థాయి యువజనోత్సవం నిర్వహించనున్నట్లు వర్సిటీ ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ బుధవారం తెలిపారు. ఈ యువజనోత్సవానికి సంబంధించిన వివా వీవీఐటీయూ 2కే25-26 ప్రచార ప్రతులను విద్యార్థులతో కలసి వర్సిటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి కళాశాలలో ఆవిష్కరించారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యం, కళాత్మకతను వెలికితీసే విధంగా సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక విభాగాలు.. 93 అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శాక్ విద్యార్థి తనువృద్ధి నవ్య మాట్లాడుతూ.. వర్సిటీ ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి, అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువజనోత్సవంలో పాల్గొనే విద్యార్థులు "వివావీవీఐటీయూ.కామ్" వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం.. గుంటూరు, విజయవాడ, తెనాలి ప్రాంతాల నుంచి రవాణ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అడడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి.ఉదయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జానపద కళలను పరిరక్షించుకోవాలి

● నాట్స్ చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్

గుంటూరు (తూర్పు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత సంస్కృతి, అచార వ్యవహారాలను అద్దంపట్టే జానపద కళలును రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాట్స్) చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్ అన్నారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నాట్స్ ఆధ్వర్యంలో జానపద సాంస్కృతిక సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జానపదాల ప్రాధాన్యాన్ని భారతంలో వ్యాసమహర్షి ప్రస్తావించారని గుర్తుచేశారు. అటువంటి జానపదాన్ని పరిరక్షించుకునేందుకు నాట్స్ ముందుకు వచ్చిందన్నారు. తమ సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం నాట్స్ అధ్యక్షుడు మందాడి శ్రీహరి మాట్లాడుతూ, జానపదాలు అంతరించిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విస్తృత పరిధి కల్గిన జానపద కళలపై అనేక పరిశోధనలు చేసి గ్రంథాలను రచించారని, అంతటి ప్రాశస్త్యం ఉన్న వాటిని రక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమ కన్వీనర్ మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కళాకారులు, 36 మంది ఉపాధ్యాయులును, కవులను సత్కరించినట్టు తెలిపారు. జానపదాన్ని బతికించేందుకు నాట్స్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం ప్రజా గాయకుడు పీవీ రమణ నేతృత్వంలో పలు జిల్లాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన తప్పెడు గుళ్ల, గరగలు, కొమ్ముకోయి నృత్యం, కోలాటం, డప్పుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సభ్యులు వేమూరి శ్రీనివాసరావు, ఏ.ఆంజనేయులు, డాక్టర్ ఈవీ నారాయణ, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కాకుమాను నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జానపద సాంస్కృతిక సంబరాలను ప్రారంభిస్తున్న పిన్నమనేని ప్రశాంత్, కేఎస్ లక్ష్మణరావు తదితరులు






జానపద కళలను ప్రదర్శిస్తున్న కళాకారులు

ఐపీఎల్‌లో గుజరాత్‌కు దుగ్గిరాల క్రికెటర్ ప్రాతినిధ్యం

దుగ్గిరాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల యువ క్రికెటర్ యార్రా పృథ్వీరాజ్‌ను ఐపీఎల్‌లో గుజరాత్ జట్టు రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. 1998లో దుగ్గిరాలలో జన్మించిన పృథ్వీరాజ్ తల్లిదండ్రులతో విశాఖపట్నంలో ఉంటున్నాడు. మీడియం పేసరైన పృథ్వీరాజ్ దేశీయ మ్యాచ్‌లలో 95 వికెట్లు తీశాడు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో 11 వికెట్లు, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 28 వికెట్లు పడగొట్టాడు. 2019 వరకూ కోల్‌కత్తా నైట్‌రైడర్స్ జట్టులోనూ అనంతరం హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. పృథ్వీరాజ్ జట్టులో పాల్గొనడం పట్ల దుగ్గిరాల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచకుతంత్ర కథలు..

(5వ పేజీ తరువాయి)

విమ ర్శలున్నాయి. గ్యాంగ్‌లో ఐదుగురిని రోడ్డు ప్రమాదం కేసులో అరెస్టు చేయగా, మరో ఇద్దరి సభ్యులను గుర్తించారు. అయితే వీరిపై రోడ్డు ప్రమాదం మినహా ఎటువంటి కేసులు నమోదు చేయకపోవడం గమనార్హం.

గ్యాంగ్‌కు విశాఖలో లింకులు

నరసరావుపేట చోర్ గ్యాంగ్‌కు విశాఖతో లింకులు ఉన్నట్లు పోలీసు విచారణలో తేలినట్టు సమాచారం. కార్ల విక్రయాల్లో అక్కడి వ్యక్తి పాత్ర ఉందని తెలిసింది. సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారట. అతనిని విశాఖపట్నం నుంచి నరసరావుపేటకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇతనే కార్లకు నంబర్లు ప్లేట్లు, చాసిస్ నంబర్లు ఇచ్చాడని చెబుతున్నారు. అయితే.. తన గుట్టు పోలీసులు పసిగట్టారని తెలుసుకున్న సదరు వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేసినట్లు తెలిసింది. అతనికి వైద్యం అందించి నరసరావుపేటకు తరలించినట్టు తెలుస్తోంది.

పరారీలో నరసింగపాడు సభ్యుడు

నకరికల్లు మండలం నరసింగపాడు గ్రామానికి చెందిన మరోవ్యక్తి కూడా గ్యాంగ్‌లో కీలకమని పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాదంలో నిందితులను పోలీసులు అరెస్టు చేయడంతో సదరు వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇతనిని అంజి అనే పేరుతో పిలుస్తారని తెలిసింది. కార్ల విక్రయాల్లో ఈ వ్యక్తి కూడా కీలకమని చెబుతున్నారు. ఈ వ్యక్తి దొరికితే కార్ల విక్రయాలు పూర్తిగా వెల్లడయ్యే అవకాశాలున్నాయి. కార్లు కొట్టేయడంలో ఇతనిది కీలక పాత్ర అని చెబుతున్నారు.

దొంగ నోట్ల మార్పిడి

చోర్ గ్యాంగ్‌లో నాయుడు అనే ఆగంతకుడు దొంట నోట్ల మార్పిడిలో పోలీసులకు పట్టుబడినట్లు వెల్లడైంది. ఈ విషయంలో పోలీసులు కేసు కూడా నమోదు చేసినట్టు సమాచారం. ఈ ఉదంతం నేపథ్యంలోనే నాయుడు తండ్రిని సస్పెండ్ చేసినట్టు చెబుతున్నారు. నేర సామ్రాజ్యాన్ని కొన్నేళ్లుగా సాగిస్తున్నా తండ్రి పోలీసు శాఖలో పనిచేస్తుండటంతో.. కొందరు పోలీసు అధికారులు సహకరించారన్న ప్రచారం జరగుతోంది. కాగా బెంగళూరు నుంచి తీసుకొచ్చిన బిల్లల రూపంలో మత్తు పదార్థాలు కూడా విక్రయించారని ప్రచారం. ఈ కోణంలో కూడా పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది. పోలీసు శాఖలోని అధికారులకే పది కార్లు బహుమతిగా ఇచ్చారన్న ప్రచారం ఊపందుకుంది. దీనిపై పోలీసు శాఖ స్పందించడం లేదు. అయితే పోలీసు అధికారుల వద్ద ఉన్న కార్లను గుర్తించినట్టు తెలిసింది.

ఏఎస్ఐ బదిలీ.. ఎస్ఐ సస్పెన్షనా..

పోలీసు వర్గాల్లో ఆశక్తికర చర్చ జరగుతోంది. గ్యాంగ్ లీడర్ నాయుడు తండ్రి శ్రీనివాసరావును డీఎస్పీ కార్యాలయం నుంచి బదలీ చేశారు. చిలకలూరిపేట ఎస్ఐ రహంతుల్లాను సస్పెండ్ చేశారు. కొడుకు నేరాలకు పాల్పడితే ఏఎస్ఐని బదలీ చేసి.. మిన్నకుండటం ఏమిటన్న ప్రశ్నలు పోలీసుల వర్గాల నుంచే వ్యక్తమవుతుండటం గమనార్హం. ఎస్ఐని సస్పెండ్ చేయడం ఏమిటన్న కొందరు పోలీసలు ప్రశ్నిస్తున్నారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు గ్యాంగ్ విషయంలో ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటారా లేదా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్యాంగ్ నేరాలన్నిటిపై కేసులు నమోదు చేస్తారో లేదా చూడాలి.

పేదింటి కలకు పునాది!

(5వ పేజీ తరువాయి)

తొలుత ఇచ్చిన గడువు నవంబరు 30 కాగా, డిసెంబరు 15 వరకు దానిని పొడిగించారు. మూడు రోజుల క్రితమే గడువు ముగియడంతో దరఖాస్తుల పరిశీలనపై యంత్రాంగం దృష్టి పెట్టింది.

ముగిసిన గడువు..

దరఖాస్తుల స్వీకరణకు ఈ ఏడాది ఆగస్టులోనే ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. కానీ ఆయా జిల్లాలకు గృహాల మంజూరులో కేంద్రంతో చర్చలు జరిపే క్రమంలో మధ్యలో ఓ నెల రోజుల పాటు స్తబ్ధత నెలకొంది. అది కూడా కొలిక్కి రావడం, కేంద్రం కూడా ఉదారంగా వ్యవహరించడంతో మళ్లీ దరఖాస్తుల స్వీకరణ మొదలయింది. అక్టోబరు, నవంబరు నెలలో పీఎంఏవై పథకంపై జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. సొంతిల్లు లేని పేదల జాబితాను కూడా సర్వే ద్వారా యంత్రాంగం సిద్ధం చేసింది. దరఖాస్తుల సమర్పణకు ప్రభుత్వం తొలుత ఇచ్చిన గడువు నవంబరు 30 అయినప్పటికీ దానిని డిసెంబరు 15 వరకు పొడిగించారు. తాజాగా ఆ వ్యవధి కూడా ముగిసింది. వచ్చిన దరఖాస్తులను వడపోత చేసే కార్యక్రమంలో భాగంగా నిరు పేదలు, సొంత స్థలం ఉన్నవారికి తొలి దశలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ ప్రామాణికాల ప్రకారం మూడు జిల్లాల పరిధిలో దాదాపు 40 వేల కుటుంబాలు తొలి దశలో భాగంగా లబ్ధి పొందనున్నాయి. మలి దశలో మధ్య తరగతి వర్గాలు, సొంత స్థలం లేకపోయినా ప్రభుత్వమే దానిని మంజూరు చేసి ఇల్లు నిర్మించేలా ప్రణాళికలు రచించారు. ఇవన్నీ దశల వారీగా పక్కా పకడ్బందీగా చేపట్టే విధంగా ఇప్పటికే ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖకు రూట్ మ్యాప్‌ను కూడా విడుదల చేసింది.



కౌన్సెలింగ్

పిల్లల వ్యాధినిరోధక శక్తి పెరిగేలా

డాక్టర్! పిల్లల వ్యాధినిరోధక శక్తిని పెంచడం కోసం ఎలాంటి ఆహారాన్ని అందించాలి? అందు కోసం ఏయే పదార్థాలు, వంటకాలను ఎంచుకోవాలో సూచించండి

- ఓ సోదరి, వరంగల్.

తల్లులు పిల్లలకు అందించే ఆహారం పట్ల అవగాహనతో మెలగడం చాలా అవసరం.

- **ఇంట్లో వండిన తాజా ఆహారం:** పిల్లలను బడికి పంపించే హడావుడిలో నూడుల్స్, కార్న్‌ఫ్లేక్స్ లాంటి రెడీమేడ్ ఫుడ్‌కు ప్రాధాన్యం ఇవ్వకుండా గోధుమ రవ్వ ఉప్మా, ఇడ్లీ, దోశ, కిచిడి లాంటి బలవర్థక పోషకాహారం అల్పాహారంగా ఇవ్వాలి.
- **జంక్ ఫుడ్:** బిస్కెట్లు, చిప్స్, బ్రెడ్ లాంటి స్నాక్స్‌కు బదులుగా తాజా పళ్ల ముక్కలు, కూరగాయ ముక్కలు, డ్రై ఫ్రూట్స్ కలిపి ఇవ్వాలి.
- **కూరగాయలు:** భోజనంలో కనీసం రెండు, మూడు రకాల కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. బఠాణీ, బ్రొకొలి, తీపి మొక్కజొన్న, క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యాప్సికం... ఇలా భిన్న కూరగాయలను కలిపి కూరగా వండి, వడ్డించాలి.
- **ప్రొటీన్ ఎక్కువగా:** ఆహారంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం ప్రతి రోజూ ఉడకబెట్టిన గుడ్డు తినిపించవచ్చు. రోజు మొత్తంలో ఒక గ్లాసు పాలు ఇవ్వవచ్చు. చికెన్, చేపలు తగుమాత్రంగా ఇవ్వవచ్చు. సోయాలో కూడా ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. పప్పుదినుసులతో కూడిన కిచిడి, జీడిపప్పు వేసిన బొంబాయి రవ్వ ఉప్మాతో కూడా ప్రొటీన్ అందుతుంది.
- **రెండు పళ్లు:** రోజు మొత్తంలో కనీసం రెండు రకాల పళ్లు పిల్లలు తినేలా చూసుకోవాలి. యాపిల్స్, కివి, డ్రాగన్ ఫ్రూట్ లాంటి ఖరీదైన పళ్లనే ఎంచుకోవలసిన అవసరం లేదు. పిల్లలు ఇష్టపడే అరటిపండు, జామ పండు ద్వారా కూడా సరిపడా పోషకాలు అందుతాయి.
- **డ్రైఫ్రూట్స్:** రోజు మొత్తంలో కనీసం రెండు, మూడు రకాల డ్రై ఫ్రూట్స్ తినేలా చూసుకోవాలి. ఒకటి రెండు వాల్‌నట్స్, రెండు, మూడు బాదం, నాలుగైదు జీడి పప్పులు పిల్లలకు అందించాలి. వీటిని పొడిచేసి, స్నాక్స్‌లో కలిపి ఇవ్వవచ్చు. వేరుసెనగపప్పు కూడా మంచిదే! వీట న్నిటినీ కలిపి డ్రై ఫ్రూట్ లడ్డు తయారు చేసి, అందించవచ్చు.
- **స్నాక్స్:** పిల్లలతో పాటు బడికి పంపించే స్నాక్స్‌గా డ్రై ఫ్రూట్ పాయసం, ఫ్రూట్ సలాడ్, పళ్లముక్కలు ఇవ్వవచ్చు.

- డాక్టర్ సత్యన్నారాయణ కావలి
ఎమ్‌డి పీడియాట్రిక్స్,
సీనియర్ కన్సల్టెంట్, హైదరాబాద్.

చపాతీలు చక్కగా

చపాతీలు గుండ్రంగా, మెత్తగా, రుచికరంగా ఉండాలంటే పిండిని సరైన పద్ధతిలో ముద్దలా కలపాలి. దానితో పాటు తీసుకోవాల్సిన ఇతర జాగ్రత్తలు ఇవే...

- వెడల్పాటి గిన్నెలో గోధుమపిండిని తీసుకుని తగినంత ఉప్పువేసి బాగా కలపాలి. కొద్ది కొద్దిగా నీళ్లు చల్లుకుంటూ పిండిని కలపాలి. పిండి మరీ గట్టిగా లేదా మరీ పలుచగా కాకుండా మెత్తగా ఉండేలా కలపాలి. వేళ్లతో పిండిని నొక్కుతూ ముద్దలా చేయాలి. పిండిలో చెంచా నూనె లేదా నెయ్యి వేసి కలిపితే మెత్తగా వస్తాయి.



- పిండిని ముద్దలా కలిపి, దానిమీద కనీసం పావుగంటసేపు తడిగుడ్డ కప్పి ఉంచాలి. దీనివల్ల పిండి బాగా నాని మృదువుగా మారుతుంది. చపాతీలు పగుళ్లు లేకుండా గుండ్రంగా వస్తాయి.
- స్టవ్ మీద పెనం పెట్టిన తరువాత మంట మధ్యస్థాయిలో ఉండాలి. పెనం మీద నూనె, నెయ్యి రాయకూడదు. పెనం బాగా వేడెక్కిన తరువాతనే దానిమీద చపాతీని వేయాలి. వెంటనే చపాతీ అక్కడక్కడా చిన్నగా పొంగుతూ కనిపించాలి. లేదంటే కాలడానికి ఎక్కువ సమయం పట్టడమేకాదు అది గట్టిపడిపోతుంది కూడా.
- చపాతీని ఎక్కువసేపు కాల్చకూడదు. చివరగా దాని మీద కొద్దిగా నూనె లేదా నెయ్యి రాసి పళ్లెంలోకి తీయాలి. వెంటనే మూత పెడితే, చాలాసేపటి వరకు మెత్తగా ఉంటాయి.

హ్యాండ్ బ్యాగ్ మెరిసేలా



రోజూ వినియోగించే హ్యాండ్ బ్యాగ్‌ల మీద ఎక్కువగా దుమ్ము, ధూళి చేరుతుంటాయి. మరకలు ఏర్పడుతుంటాయి. ఇలా అందవిహీనంగా మారిన హ్యాండ్ బ్యాగ్‌లను కొత్త వాటిలా మెరిపించే చిట్కాలివే.

- పెద్ద గిన్నెలో గ్లాసు వేడినీళ్లు పోసి అందులో చెంచా లిక్విడ్ డిటర్జెంట్, ఒక చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. అందులో ఒక దూది ఉండను ముంచి దానితో హ్యాండ్ బాగ్‌ను తుడవాలి. చాలావరకు మురికి, మరకలు తొలగిపోతాయి.
- హ్యాండ్ బ్యాగ్‌ల మీద తరచూ పెన్ను గీతలు, సిరా మరకలు పడుతుంటాయి. పలుచని చేతి రుమాలుమీద కొద్దిగా శానిటైజర్ లేదా ఆల్కహాల్ వేసి బ్యాగ్‌ను తుడిస్తే ఈ మరకలు పూర్తిగా పోతాయి.
- ఎండ ఎక్కువగా తగలడంవల్ల బ్యాగ్ తేమను కోల్పోయి పెళుసుగా మారుతుంది. అలాంటప్పుడు చిన్న గిన్నెలో చెంచా అవిసె నూనె, రెండు చెంచాల వెనిగర్ వేసి కలిపిన మిశ్రమాన్ని చిన్న దూది ఉండతో అద్ది బ్యాగ్ మొత్తాన్ని తుడవాలి. పది నిమిషాల తరువాత పొడి గుడ్డతో తుడిచేస్తే బ్యాగ్ మృదువుగా మారి మెరుస్తుంది.
- లంచ్ బాక్స్‌లో తీసుకెళ్లే ఆహార పదార్థాల వల్ల కూడా హ్యాండ్ బ్యాగ్ మీద నూనె, జిడ్డు లాంటి మొండి మరకలు ఏర్పడుతుంటాయి. వీటి మీద కొద్దిగా బేకింగ్ సోడా, కార్న్‌ఫ్లోర్ చల్లి పలుచని చేతి రుమాలు లేదా పాత తువాలుతో తుడిస్తే ఫలితం కనిపిస్తుంది.

భారతీయ వైమానిక దళంలో స్క్వాడ్రన్ లీడర్‌గా సేవలందించిన చెన్నైకి చెందిన **అర్చన త్యాగరాజన్**, ఫ్రీడైవింగ్‌లో సైతం సత్తా చాటుతూ దేశ కీర్తిని రెపరెపలాడిస్తోంది. యాదృచ్ఛికంగా అడుగుపెట్టిన క్రీడ, తన జీవితాన్ని మలుపు తిప్పిన తీరు గురించి అర్చన ఇలా వివరిస్తోంది...

ఆకాశం అంచుల నుంచి లోతైన నీళ్లలోకి

స్ఫూర్తి



"**38 మీటర్లకు** మించి డైవ్ చేయడం అసాధ్యమనీ, అంతకుమించి డైవ్ చేస్తే, లోతైన నీళ్లలోని ఒత్తిడికి ఊపిరితిత్తులు నొక్కుకుపోయి ప్రాణాలు పోతాయని భావించేవారు. కానీ 1952లో రైమాండో బుచర్ అనే ఒక ఇటాలియన్ డైవర్, 39 మీటర్ల లోతుకు డైవ్ చేసి సురక్షితంగా పైకొచ్చి, మునుపటి సిద్ధాంతం తప్పని రుజువు చేశాడు. అప్పటి నుంచి ఫ్రీడైవర్లు డైవ్ చేసే లోతును అంతకంతకూ పెంచుతూ పోయారు. అందుకోసం కొందరు తాళ్లను ఉపయోగిస్తే, ఇంకొందరు ఫిన్స్, బరువులను ఉపయోగించారు. అయితే లోతైన నీటిలో ముప్పు తప్పక పొంచి ఉంటుంది. సముద్రజలాలు గాలి కంటే 840 రెట్లు ఎక్కువ సాంద్రతను కలిగి ఉంటాయి. దాంతో ఒత్తిడి విపరీతంగా ఉంటుంది. లోతుకు చేరుకునేకొద్దీ, ఒత్తిడి అంతకంతకూ పెరిగిపోతుంది. అయినా ఫ్రీడైవర్లు వెనుకంజ వేయరు. నా విషయంలో చెప్పాలంటే, లోతైన నీటిలోని ప్రశాంతత, నిశ్చలత్వాలే ఈ క్రీడ పట్ల నాలో ఆసక్తిని రేకెత్తించాయని చెప్పాలి. మనం, మన శరీరం తప్ప అక్కడ మరొక ఆలోచనకు తావుండదు." అంటూ డైవింగ్ గురించీ, తన డైవింగ్ అనుభవం గురించీ వివరిస్తోంది ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన మాజీ స్క్వాడ్రన్ లీడర్, అర్చన.

యాదృచ్ఛికంగా అడుగుపెట్టి...

అర్చన ఫ్రీడైవింగ్ యాదృచ్ఛికంగా మొదలైంది. భార్యాభర్తలిద్దరూ వైమానిక దళానికి చెందినవారే! ఇద్దరూ ఒకేసారి భారతీయ వైమానిక దళం నుంచి పదవీ విరమణ పొందడంతో ఏడాదిపాటు విరామం తీసుకోవాలని నిర్ణయించుకుని ఇండోనేషియా వెళ్లిపోయారు. అక్కడ అర్చన స్నేహితులు ఆమెను ఫ్రీడైవింగ్‌కు పరిచయం చేశారు. 'ఆ సమయంలో నేను స్కూబా కోర్సులో చేరదామనుకున్నా. కానీ ఈతలో నాకున్న పూర్వ అనుభవం ఫ్రీడైవింగ్‌కు ఉపయోగపడుతుందని అనడంతో, వెంటనే ఒప్పుకున్నాను' అంటూ వివరించింది అర్చన. 2024లో బిగినర్స్ కోర్సుకు హాజరైన తర్వాత, అర్చన శిక్షకుడు, స్థానిక పోటీలో పాల్గొనవలసిందిగా ఆమెను ప్రోత్సహించాడు. ఆ క్రీడకు కొత్త అయినప్పటికీ అర్చన, తొలి ప్రయత్నంలోనే ఏకంగా మూడు జాతీయ రికార్డులను నెలకొల్పింది. "అందుకు నెల రోజుల పాటు పాల్గొన్న యోగా కార్యక్రమానికే థ్యాంక్స్ చెప్పుకోవాలి. శ్వాసపరంగా యోగా నాకెంతో బాగా సహాయపడింది. ఫ్రీడైవింగ్‌లో శ్వాసను నిలిపి ఉంచడమే కీలకం. యోగా, ప్రాణాయామం, ఈత.. ఈ మూడూ జాతీయ రికార్డులను నెలకొల్పడంలో సహాయపడ్డాయని చెప్పాలి. అలాగే సైన్యం నేర్పించిన క్రమశిక్షణ, శ్వాస నియంత్రణ, శరీర దారుఢ్యం కూడా ఈ గెలుపునకు కలిసొచ్చాయి. ప్రతి వృత్తిలో సవాళ్లుంటాయి. సైన్యంలో ఉండే సవాళ్లు భిన్నమైనవి. కానీ ఫ్రీడైవింగ్‌లో సవాళ్లు కూడా మరో స్థాయిలో ఉంటాయి. ఈ క్రీడ 80% మానసికమైనది. 20% భౌతికమైనది' అంటూ ఫ్రీడైవింగ్ లోతుపాతుల గురించి వివరిస్తోంది అర్చన. గత ఏడాది జపాన్‌లో జరిగిన 34వ ఎఐడిఎ ఫ్రీడైవింగ్ ప్రపంచ పోటీల్లో, భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన మొట్టమొదటి మహిళగా అర్చన పేరు తెచ్చుకుంది. ఈ పోటీల్లో ఏకంగా నాలుగు కొత్త జాతీయ రికార్డులను నెలకొల్పడం విశేషం.

అవగాహన పెరగాలి

మన దేశంలో ఫ్రీడైవింగ్ పట్ల అవగాహన తక్కువ. కానీ ఈ క్రీడ పట్ల అవగాహన పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది. లోతు ఆధారిత ఫ్రీడైవింగ్ సముద్రాల్లోని స్వచ్ఛమైన జలాల్లోనే సాధ్యపడుతుంది. ఇందుకు అండమాన్, లక్షద్వీప్‌లు అనుకూలమైనవి. అయితే మన దేశంలోని ప్రధాన నగరాల్లో కొలను ఆధారిత ఫ్రీడైవింగ్ సాధ్యపడుతుంది. కాబట్టి ఇక్కడి ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాను. ప్రస్తుతం చెన్నై, బెంగుళూరుతో పాటు థాయిలాండ్, ఫిలిప్పైన్స్‌లో శిక్షణ ఇస్తున్నాను. 2025 ఏప్రిల్‌లో మొట్టమొదటి మహిళా మోల్చానోవ్స్ శిక్షకురాలిగా ఎంపికయ్యాను. ఇదొక ఎక్స్‌ట్రీమ్ స్పోర్ట్. ఈ క్రీడలో పాల్గొనడానికి కనీస అర్హత 18 ఏళ్లు. ఊపిరి బిగబట్టినప్పుడు శరీరంలో ఆక్సిజన్ తగ్గిపోతుంది. కాబట్టి ఎప్పుడు పైకి చేరుకోవాలో, మన పరిమితులేమిటో తెలుసుకుని ఉండాలి. అన్ని రోజులూ ఒకేలా ఉండవు. శక్తికి మించి శ్రమపడితే, శరీరం మొండికేసి, కుప్పకూలిపోవచ్చు. కాబట్టి ఎంతో అప్రమత్తంగా నడుచుకోవాలి' అంటున్న అర్చన ప్రస్తుతం మరిన్ని ఫ్రీడైవింగ్ పోటీల కోసం సిద్ధపడుతోంది.



సినిమానే నన్ను ఎంచుకుంది

బాలనటిగా సినీ ప్రేక్షకులకు బాగా దగ్గరైన నటి **సారా అర్జున్**. ఇప్పుడు 'ధురంధర్' సినిమాతో ఓవర్‌నైట్ సెన్సేషన్‌గా మారారు. రణ్‌వీర్‌సింగ్ సరసన ఆమె పోషించిన పాత్రకు ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో తన విజయంపై సారా పంచుకున్న విశేషాలివి.

"**మ**నం ఒకటి తలిస్తే దైవం మరోలా తలుస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. బోర్డింగ్ స్కూల్‌లో చదువు పూర్తిచేసి నటనలో శిక్షణ కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్న సమయంలో విధి నా కోసం అద్భుతమైన కథను సిద్ధం చేసింది. రణ్‌వీర్‌సింగ్ లాంటి స్టార్ హీరో సరసన ధురంధర్ సినిమాతో అరంగేట్రం చేసే అవకాశాన్ని అందించింది. ఈ ప్రయాణం నా కోసం విశ్వం రచించిన అద్భుత స్క్రిప్ట్" అంటూ సారా గుర్తుచేసుకున్నారు.

ఊహించని పిలుపు

యాక్టింగ్ కోర్స్ కోసం అమెరికాలోని లీ స్ట్రాస్‌బర్గ్ ఇనిస్టిట్యూట్‌కు పంపాలని తండ్రి (నటుడు రాజ్ అర్జున్) ఏర్పాట్లు చేస్తున్న రోజులవి. సరిగ్గా అప్పుడే క్యాస్టింగ్ డైరెక్టర్ ముకేశ్ ఛబ్రా కార్యాలయం నుంచి ఆడిషన్‌కు రమ్మంటూ సారాకు ఊహించని పిలుపు వచ్చింది. ఏ సినిమా కోసమో తెలియకుండానే ఆమె ఆడిషన్‌కు హాజరయ్యారు. ఒకదాని తర్వాత మరోటి ఇలా కొన్ని నెలలపాటు ఈ ప్రక్రియ కొనసాగింది. "నిజం చెప్పాలంటే నేను ఏ సినిమా కోసం ఆడిషన్ ఇస్తున్నానో చివరి నిమిషం వరకు నాకు తెలియదు. ప్రతి రౌండ్‌లోనూ భిన్నమైన భావోద్వేగాలు పలికించాను. చివరి ఆడిషన్ మాత్రం ముకేశ్ ఛబ్రా స్వయంగా నిర్వహించారు. ఆ రోజు సన్నివేశంలో నేను పూర్తిగా లీనమైపోయాను. ఆ గదిలోంచి బయటకు వచ్చే సరికి కళ్లలో నీళ్లు ఉన్నాయి" అని సారా గుర్తుచేసుకున్నారు.



నా కోసం ఎదురుచూసిన కథ

"ఆడిషన్ నుంచి బయటకు వచ్చిన ఆ క్షణమే నాకు అర్థమైంది. ఈ సినిమా నాకు కేవలం ఒక ప్రాజెక్టు కాదు. 'ఆగు, తొందరపడకు.. నీ కోసం ఇక్కడో కథ ఎదురుచూస్తోంది' అని ఈ విశ్వం నాతో మెల్లగా చెప్పినట్టు అనిపించింది. నాకు విజయం దక్కుతుందని గట్టి నమ్మకం ఉండేది. కానీ, అది ఎలా వస్తుందో అర్థమయ్యేది కాదు. ఈ సినిమా ఆ ప్రశ్నకు సమాధానం ఇచ్చింది" అని సారా అర్జున్ తన అనుభవాన్ని పంచుకున్నారు. ఇప్పుడు తనలో ఎలాంటి ప్రశ్నలు లేవని, మరిన్ని మంచి పాత్రలు చేయాలన్న తపన మాత్రమే ఉందని చెప్పుకొచ్చారు. ధురంధర్ సినిమా విజయం నాకు స్పష్టమైన దారిని చూపడమే కాకుండా, నా కలల ప్రయాణానికి బలమైన పునాది వేసింది" అని చెప్పుకొచ్చారు సారా అర్జున్.

టీ తాగుదాం.. రండి



చాలామంది గ్రీన్ టీ, బ్లాక్ టీ తాగుతుంటారు. వీటివల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు.

బ్లాక్ టీ: వేడి వేడి టీ డికాషన్‌లో కొద్దిగా తేనె లేదా చక్కెర, కొద్దిగా నిమ్మరసం కలుపుతారు. దీన్లో థియోబ్రోమిన్, థియోఫిలిన్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలో రక్తప్రసరణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. రక్తపోటు, కార్డియోవాస్క్యులర్ వ్యాధుల్ని తగ్గిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను నిర్మూలిస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు.. క్యాన్సర్ కారకాలను నిరోధిస్తాయి. దీన్ని భోజన సమయంలో తాగకూడదు.

గ్రీన్ టీ: అంతగా ప్రాసెస్ చేయని తేయాకు పొడిని చిన్నచిన్న పేపర్ బ్యాగ్‌లలో నింపుతారు. కప్పు వేడి నీటిలో ఒక టీ బ్యాగ్ వేసి, ఆపైన కొద్దిగా తేనె, నిమ్మరసం, రెండు పుదీనా ఆకులు వేసి గ్రీన్ టీ చేస్తారు. దీనిలో యాంటీఆక్సిడెంట్లు అధికం. ఇవి శరీరంలో పేరుకున్న టాక్సిన్లను బయటికి పంపుతాయి. చర్మ సౌదర్యానికి, శిరోజాల పెరుగుదలకు గ్రీన్ టీ దోహదం చేస్తుంది. గ్రీన్ టీని భోజనంతోపాటు తాగవచ్చు. రోజుకు రెండు కప్పులకు మించి తాగకూడదు.

సంకల్పం



ఈ అక్కచెల్లెళ్లు మార్పు సారథులు

రుమా, మేఘా భార్గవ... ఇద్దరు అక్కాచెల్లెళ్లు... రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లోని బాలికలకు అండగా నిలుస్తున్నారు. అనాదిగా వస్తున్న దురాచారాలను పారదోలి... రుతుక్రమ సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపుతున్నారు. అందు కోసం స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి... గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. వారి స్ఫూర్తిదాయక ప్రయాణం రుమా మాటల్లో...

"**కొ**న్నేళ్ల కిందట... నేను, మా సోదరి మేఘా కలిసి రాజస్థాన్‌లోని ఒక స్కూల్‌కు వెళ్లాం. చాలామంది ఆడపిల్లలు సరిగ్గా బడికి రావడంలేదు. కొంతమంది అయితే పూర్తిగా చదువు మానేశారు. కారణం ఏంటని ఆరా తీస్తే... రుతుక్రమ సమయంలో ఎదురయ్యే సమస్యలని తెలిసింది. సరైన శానిటరీ ప్యాడ్స్ లేక, ఉన్నా నాణ్యమైనవి కాకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కట్టుబాట్ల నేపథ్యంలో తమ అవస్థలను ఎవరికీ చెప్పుకోలేక పాఠశాలకు డుమ్మా కొడుతున్నారు. కొందరు తల్లిదండ్రులైతే తమ పిల్లలకు పిరియడ్స్ ప్రారంభం కాగానే పెళ్లిళ్లు చేసి బాధ్యత వదిలించుకొంటున్నారు. దీనివల్ల ఆడపిల్లలు చదువుకు దూరమవుతున్నారు. వారి భవిష్యత్తు మొగ్గలోనే వాడిపోతోంది. ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోయాం. వీటన్నిటికీ స్థిరమైన పరిష్కార కనుగొనాలని అనుకున్నాం. అందుకోసం ముంబయిలో 'సమర్పణ్' పేరుతో స్వచ్ఛంద సంస్థ నెలకొల్పాం.



అదే మా ఉద్దేశం...

రుతుక్రమం అనేది సహజంగా జరిగే ఒక జీవ ప్రక్రియ. దాన్ని కట్టుబాట్లకు ముడిపెట్టడం సరైంది కాదు. అమ్మాయిలు కూడా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారు దాని గురించి మాట్లాడటానికి సంకోచించడం గమనించాం. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని 'సమర్పణ్' ఏర్పాటు చేశాం. నాణ్యమైన, సురక్షితమైన ప్యాడ్స్ అందరికీ అందుబాటులో ఉంచడం, తద్వారా బాలికలు చదువుకు దూరం కాకుండా చూడాలనేది మా ప్రధాన ఉద్దేశం.

కలిసొచ్చింది...

రాజస్థాన్‌లోని కోట మా స్వస్థలం. మేఘా డెంటిస్ట్. తరువాత ఐఆర్‌ఎస్‌కు ఎంపికైంది. ప్రస్తుతం ఆదాయ పన్నుల శాఖలో పని చేస్తోంది. నేనూ ఎంబీబీఎస్ చదివాను. హెల్త్‌కేర్ రంగంలో ఉన్నాను. ఇద్దరం వైద్య విద్య అభ్యసించినవారం కావడం కలిసొచ్చింది. బాలికల సమస్యలు మరింత లోతుగా అర్థం చేసుకోగలిగాం. కేవలం నేప్‌కిన్స్ పంపిణీతోనే సరిపోదని, పిరియడ్స్‌ను ఒక కళంకంగా భావించే సమాజంలో మార్పు తెస్తేనే దీనికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలుసుకున్నాం. దాంతోపాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం కూడా మరో ప్రధాన అంశం. అలాగే చాలామందితో మాట్లాడిన తరువాత గమనించింది ఏమిటంటే... సింగిల్ యూజ్ ప్యాడ్స్ ఎక్కువసేపు ధరించలేకపోతున్నారని. ర్యాషస్ లాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని. అంతేకాదు... ఆ వ్యర్థాలు పేరుకుపోయి కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఈ క్రమంలో పునర్వినియోగ ప్యాడ్స్ రూపొందించాలని నిర్ణయించాం. వాటిని పంపిణీ చేసేముందు స్వయంగా మేమూ ఉపయోగించి చూశాం.

అవగాహన కల్పించి...

మా సంస్థ ద్వారా నాణ్యమైన, సౌకర్యవంతమైన పునర్వినియోగ ప్యాడ్స్ తయారు చేయించాం. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల బాలికలకు అందించాం. వారితో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన తరగతులు నిర్వహించాం. రుతుక్రమం, ఆ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాం. కొన్నాళ్ల తరువాత మా ప్రయత్నం మంచి ఫలితాలను ఇచ్చింది. ఆడపిల్లలు నిస్సంకోచంగా బడికి రావడం మొదలుపెట్టారు. మధ్యలో చదువు ఆపేసే పిల్లల శాతం గణనీయంగా తగ్గింది.

కమ్యూనిటీ పోలీసింగ్...

రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లోని మారుమూల గ్రామాలను గుర్తించి, అక్కడి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో కమ్యూనిటీ పోలీసింగ్‌ను తీసుకువచ్చాం. ఐదు వేల మంది బాలికలతో ఏర్పాటైన ఈ వ్యవస్థలో ఇప్పుడు 22 వేల మంది పని చేస్తున్నారు. రాబోయే నాలుగైదు నెలల్లో మరో ఐదు వేల మంది జత కలుస్తారు. ఇప్పటివరకు యాభై వేలమంది బాలికలను కలిశాం. వారి జీవితాల్లో మార్పుకు మావంతు ప్రయత్నం చేశాం. కేవలం రుతుక్రమానికి సంబంధించినవే కాకుండా... పోషకాహారం, పరిశుభ్రమైన తాగునీరు ప్రాధాన్యత గురించీ తెలియజేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో సౌర విద్యుత్‌ను ప్రోత్సహించాం. సంస్థ లక్ష్యం... దీర్ఘకాలిక ప్రయోజనం. మా వృత్తుల్లో ఎంత బిజీగా ఉన్నా... దాని కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటాం. ఈ ప్రయాణంలో ఎన్నో పురస్కారాలు, గౌరవాలు దక్కాయి. ఇవి మమ్మల్ని మరింత బాధ్యతగా లక్ష్యం వైపు నడవడానికి స్ఫూర్తినిస్తాయి."

ముత్యాల ముగ్గు

దురిశేటి భారతి,
విజయవాడ రూరల్





27 చుక్కలు, సరిచుక్క
9 వరుసలు 9 వచ్చే వరకు

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,34,510 ▲	1,23,300 ▲	2,22,000 ▲
విజయవాడ	1,36,800 ▲	1,28,800 ▲	2,00,550 ▲
విశాఖపట్నం	1,36,740 ▲	1,23,300 ▼	2,22,000 ▲
రాజమండ్రి	1,34,510 ▲	1,23,300 ▲	2,03,000 ▲
ప్రొద్దుటూరు	1,32,250 ▲	1,21,670 ▲	1,97,000 ▲
ముంబై	1,32,320 ▲	1,21,200 ▲	1,99,640 ▲

స్వయంకృషి పారిశ్రామికవేత్తల్లో దీపిందర్ గోయల్ టాప్

రెండో స్థానానికి జారుకున్న దమానీ ● మూడో స్థానంలో ఇండిగో ప్రమోటర్లు

శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డికి ఐదో స్థానం

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్-హురున్ ఇండియా జాబితా







న్యూఢిల్లీ: భారత్‌లో స్వయంగా ఎదిగిన పారిశ్రామికవేత్తల (సెల్ఫ్ మేడ్ ఎంట్రప్రెన్యూర్స్) జాబితాలో ఎటర్నల్ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ నంబర్ వన్ స్థానం దక్కించుకున్నారు. డీమార్ట్ సూపర్ మార్కెట్ల అధిపతి రాధాకిషన్ దమానీని వెనక్కి నెట్టి ఆయన ఆ స్థానాన్ని చేరారు. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో, క్విక్ కామర్స్ వేదిక బ్లింకిట్‌ల మాతృసంస్థ అయిన ఎటర్నల్ విలువ రూ.3.2 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాదితో పోలిస్తే 27% పెరిగింది. కాగా, గడిచిన ఏడాదికాలంలో డీమార్ట్ మాతృసంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ వ్యాపార విలువ 13% తగ్గి రూ.3 లక్షల కోట్లకు పరిమితమైంది. దాంతో ఈ ఏడాది జాబితాలో దమానీ రెండో స్థానానికి జారుకున్నారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రమోటర్లు రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్ మూడో స్థానం దక్కించుకున్నారు. ఇండిగో మార్కెట్ విలువ రూ.2.2 లక్షల కోట్లుగా ఉంది. ఇండిగో ప్రమోటర్లకు టాప్-10 స్థానం లభించడం ఇదే తొలిసారి. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్-హురున్ ఇండియా కలిసి బుధవారం విడుదల చేసిన 'టాప్-200 సెల్ఫ్ మేడ్ ఎంట్రపెన్యూర్స్ ఆఫ్ ది మిలీనియా 2025' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2000 సంవత్సరం తర్వాత ప్రారంభమైన వ్యాపారాలను ఈ జాబితాకు ఎంపిక చేసింది. కనీసం రూ.4,500 కోట్ల విలువైన కంపెనీలకు ఇందులో స్థానం కల్పించింది. ఐడీఎఫ్‌సీ-హురున్ కలిసి ఈ జాబితా విడుదల చేయడం ఇది మూడోసారి.

- మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్ల నెట్‌వర్క్ మ్యాక్స్ హెల్త్‌కేర్ లిమిటెడ్ (రూ.1,10,700 కోట్లు) ఛైర్మన్ అభయ్ సోయ్ నాలుగో స్థానంలో ఉన్నారు.
- తెలుగు ఎంట్రప్రెన్యూర్లు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డికి ఐదో స్థానం లభించింది. వీరు స్థాపించిన ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ వ్యాపార విలువ రూ.1.06 లక్షల కోట్లుగా ఉంది. గడిచిన ఏడాదికాలంలో 5% పెరిగింది.
- పేటీఎం (రూ.72,900 కోట్లు) వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ ఎనిమిదో స్థానానికి ఎగబాకారు. గడిచిన ఏడాది కాలంలో పేటీఎం విలువలో 67% వృద్ధి నమోదైంది.
- లెన్స్‌కార్ట్ వ్యవస్థాపకులు పియూష్ బన్సల్, అమిత్ చౌదరి, నేహా బన్సల్, సుమీత్ కపాహి పదో స్థానంలో నిలిచారు. గడిచిన ఏడాది కాలంలో లెన్స్‌కార్ట్ వ్యాపార విలువ 60% వృద్ధితో రూ.67,000 కోట్లకు పెరిగింది.
- జాబితాలోని 200 కంపెనీల మొత్తం విలువ రూ.42 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాదిలో నమోదైన రూ.36 లక్షల కోట్లతో పోలిస్తే 15% పెరిగింది. ఈ కంపెనీల్లో మొత్తం 8 లక్షల మంది పని చేస్తున్నారు.
- స్వయం శక్తి పారిశ్రామికవేత్తలు స్థాపించిన సంస్థల్లో కనీసం బిలియన్ డాలర్ల (100 కోట్ల డాలర్లు=రూ.9,000 కోట్లు) విలువ చేసే వాటి సంఖ్య ఈ ఏడాది 128కి చేరుకుంది. 2024లో ఈ సంఖ్య 121గా ఉంది.
- ఈ జాబితాలోని 200 కంపెనీల్లో అత్యధికం(52) బెంగళూరుకు చెందినవే. ముంబై(41), గురుగ్రామ్ (36), చెన్నై (11), ఢిల్లీ (10), హైదరాబాద్ (8), పుణె (8) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

సుంకాలే ఆయుధాలయ్యాయ్..

నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: ప్రపంచ వాణిజ్య మార్కెట్లో కొన్ని దేశాలు సుంకాలు, ఇతర చర్యలను ఆయుధాలుగా మలుచుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో భారత్ చాలా జాగ్రత్తగా సంప్రదింపులు జరపాల్సి వస్తున్నదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అంతర్జాతీయ వాణిజ్యం ఇక స్వేచ్ఛాయుతం, అనుకూలం ఏ మాత్రం కాదన్న విషయం స్పష్టమైందని టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా ఎకనామిక్ కాంక్లేవ్‌లో ఆమె పేర్కొన్నారు. అమెరికా తర్వాత తాజాగా మెక్సికో కూడా భారత్‌పై 50 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అప్పుల తగ్గింపుపై దృష్టి : ఆర్థిక నిర్వహణలో పాదర్శకత్వం, దేశ రుణ భారం తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుందని సీతారామన్ అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేందుకు రాష్ట్రాలు కూడా ఇదే బాటను అనుసరించాలని మంత్రి కోరారు.

8% వృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యం: గీతా గోపీనాథ్

వచ్చే 20 ఏళ్లపాటు 8% వృద్ధితో దూసుకెళ్లగలిగితే 2047 నాటికి వికసిత్ భారత్‌గా ఎదగాలన్న లక్ష్యాలకు చేరువయ్యేందుకు అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎంఎఫ్ మాజీ ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ అన్నారు. అయితే, 20 ఏళ్ల సుదీర్ఘకాలంపాటు నిలకడగా 8 శాతం వార్షిక వృద్ధిని సాధించడం అంత సులువు కాదని, ఎప్పటికప్పుడు సంస్కరణలు చేపట్టాల్సి ఉంటుందని ఆమె అభిప్రాయ పడ్డారు.

మూడో రోజూ నష్టాల్లో మార్కెట్

ముంబై: అమ్మకాల జోరుతో స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 120.21 పాయింట్ల నష్టంతో 84,559.65 వద్ద ముగియగా, నిఫ్టీ 41.55 పాయింట్ల నష్టంతో 25,818.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఒక దశలో 263.88 పాయింట్లు నష్టపోయి 84,415.98 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకిన సమయంలో ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు, ఇన్ఫోసిస్, మారుతి సుజుకీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో కొద్దిగా కోలుకుంది. అయినా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, బీఈఎల్, టైటాన్, ఏసియన్ పెయింట్స్ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి బుధవారం సూచీలను నష్టాలవైపు నడిపించాయి.

నెఫ్రోకేర్ షేర్ల శుభారంభం: హైదరాబాద్ కేంద్రంగా డయాలసిస్ సేవలందించే నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ షేర్లు లిస్టింగ్‌లో శుభారంభాన్నిచ్చాయి. ఇష్యూ ధర రూ.460 కాగా ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈలో 6.89% లాభంతో రూ.491.70 వద్ద లిస్టయ్యాయి. ఇంట్రాడేలో 8.41% లాభంతో రూ.498.70కి చేరినప్పటికీ ఈ షేరు చివరికి 2.52% లాభంతో రూ.471.60 వద్ద ముగిసింది.

వెండి @2.06 లక్షలు

ఒక్కరోజే కిలో రూ.7,300 పెరుగుదల

న్యూఢిల్లీ: జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు రేసు గుర్రాల్లా పరిగెడుతున్నాయి. బుధవారం ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.7,300 పెరిగి రూ.2,05,800కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఔన్స్ (31.10 గ్రాములు) వెండి ధర 66.52 డాలర్లకు చేరి రికార్డు సృష్టించింది. మేలిమి బంగారం సైతం ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.600 పెరిగి రూ.1,36,500కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ 24 కేరట్ల ఔన్స్ పసిడి ధర 4,335 డాలర్లకు చేరింది. దేశీయ మార్కెట్‌లో ఈ ఏడాది ఇప్పటి వరకు కిలో వెండి మదుపరులకు రూ.1,18,533 లాభం (135.34%) పంచినట్టయింది.

సైయెంట్ చేతికి అమెరికా కంపెనీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక సైయెంట్ సెమీకండక్టర్స్ అమెరికా కేంద్రంగా పనిచేసే కైనెటిక్ టెక్నాలజీస్ కంపెనీ ఈక్విటీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం 9.3 కోట్ల డాలర్లు (సుమారు రూ.837 కోట్లు) చెల్లించనున్నట్టు తెలిపింది. దీంతో దాదాపు 4,000 కోట్ల డాలర్లకుపైగా ఉన్న పవర్ సెమీకండక్టర్స్ మార్కెట్‌లో తమ స్థానం మరింత పటిష్ఠమవుతుందని తెలిపింది. పవర్ మేనేజ్‌మెంట్, హై పర్‌ఫార్మెన్స్ అనలాగ్, మిక్స్‌డ్ సిగ్నల్ ఐసీల్లో కైనెటిక్ టెక్నాలజీస్ కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా మంచి పట్టుందని సైయెంట్ టెక్నాలజీస్ తెలిపింది.

తిరిగే సీటుతో వ్యాగన్‌ఆర్



మారుతి సుజుకి బహుళ జనాదరణ పొందిన వ్యాగన్‌ఆర్‌లో సరికొత్త 'స్వివెల్ సీట్ (తిరిగే సీటు) ఆప్షన్‌ను ప్రవేశపెట్టింది. వృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం ఈ వెర్షన్‌ను తీసుకువచ్చినట్టు మారుతి సుజుకి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషి టకూచి తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
18వ తేదీ		విజయవాడ	700
హైదరాబాద్	671	గోదావరి	675
వరంగల్	673	విశాఖపట్నం	675
చిత్తూరు	688	డజను గుడ్లు రూ. 96	

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	125
కరీంనగర్	114	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	124
కర్నూలు	114	నెల్లూరు	129
విశాఖపట్నం	111	అనంతపురం	129
గోదావరి	120		

విశాఖ స్టీల్‌ప్లాంటు సీఎండీగా మనీష్‌రాజ్ గుప్తా



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్-విశాఖ ఉక్కు) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సెయిల్ కంపెనీ డైరెక్టర్ (టెక్నికల్, ప్రాజెక్ట్స్ అండ్ రా మెటీరియల్స్) మనీష్ రాజ్ గుప్తా నియమితులయ్యారు. ఆయన ఏడాది పాటు ఈ అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2026 జనవరి 1 నుంచి ఏడాది పాటు మనీష్ రాజ్ ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుత ఆర్ఐఎన్ఎల్ ఇన్‌చార్జి సీఎండీ ఏకే సక్సేనా పదవీ కాలం డిసెంబరు 31తో ముగుస్తోంది.

వచ్చే ఏడాది జీతాల్లో 9% వృద్ధి

మెర్సర్ సర్వే నివేదిక

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది దేశంలో ఉద్యోగుల జీతాల్లో సగటు వృద్ధి 9 శాతం ఉండవచ్చునంటున్నారు. అయితే స్వల్పకాలిక ప్రోత్సాహకాలు, నైపుణ్య ఆధారిత విధానాలపై కంపెనీలు మరోసారి దృష్టి సారించవచ్చునని ఒక అధ్యయనంలో తేలింది. మెర్సర్ కంపెనీ టోటల్ రెమ్యూనిరేషన్ సర్వే 2026 పేరిట నిర్వహించిన అధ్యయనంలో పలువురు ఈ అభిప్రాయాలు ప్రకటించారు. వ్యక్తిగత పనితీరు, ద్రవ్యోల్బణ ధోరణులు, ఉద్యోగాల మార్కెట్లో సంస్థల పోటీ సామర్థ్యం వంటి అంశాలు వేతనాల పెంపును ప్రభావితం చేస్తున్నాయని ఆ సర్వేలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. దేశంలోని చాలా కంపెనీలు వ్యయ ఒత్తిడులను సమతూకం చేసుకుంటూ ప్రతిభావంతులు తరలిపోకుండా కాపాడుకుంటూ వేతనాల పెంపును అమలుపరచవచ్చునని తమ సర్వేలో తేలిందని మెర్సర్ రివార్డ్స్ కన్సల్టింగ్ లీడర్ (ఇండియా) మాలతి కెఎస్ అన్నారు.

ముఖ్యాంశాలు...

- రంగాలవారీగా పరిశీలించినట్టయితే వేతన వృద్ధి ఆటోమోటివ్ రంగంలో అత్యధికంగా 9.5% ఉండవచ్చు. 9.3 శాతంతో హైటెక్ (ఉత్పత్తులు, కన్సల్టింగ్) రంగం తర్వాతి స్థానంలో నిలువవచ్చు.
- ఐటీ, ఐటీఈఎస్, జీసీసీలు ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నవ్య, ప్రగతిశీలక ప్రయోజనాలు ఉద్యోగులకు అందించే ఆస్కారం ఉంది.
- భారత్ డిజిటల్ పరివర్తన బాటలో నడుస్తున్న నేపథ్యంలో కంపెనీలు ఉత్పాదకతపై ఫోకస్ పెంచవచ్చు. వ్యయ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తూనే ఇంక్రిమెంట్లు పొందే అర్హత ఎంత మందికి ఉంది అని మదింపు చేసే ఆస్కారం ఉంది.



శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నజరానా

విశాఖలో 500 గజాల స్థలం

అమరావతి (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్‌కప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలైన కడప అమ్మాయి శ్రీచరణికి రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్లుగా భారీ నజరానా అందజేసింది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీచరణికి ప్రభుత్వం తరపున రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రూ.2.5 కోట్ల చెక్‌ను అందించారు. నగదుతో పాటు విశాఖపట్నంలో 500 గజాల స్థలం, డిగ్రీ పూర్తయిన తర్వాత గ్రూప్-1 ఉద్యోగం కూడా ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో క్రీడామంత్రి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, క్రీడాశాఖ కార్యదర్శి అజయ్ జైన్, శాప్ వీసీ ఎండీ భరణి, ఏసీఏ ప్రతినిధులు శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

పొగమంచు.. మ్యాచ్ రద్దు



- టాస్ కూడా పడలేదు
- సాగని భారత్-దక్షిణాఫ్రికా నాలుగో టీ20
- బీసీసీఐకి ముందుచూపు లేదా?

లఖ్‌నవూ: వర్షం కారణంగా మ్యాచ్‌లు రద్దు కావడం క్రికెట్ అభిమానులకు పరిచయమే. అయితే, మంచు కమ్మేయడంతో ఓ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ రద్దు కావడమనే అరుదైన ఘటన భారత్‌లో చోటు చేసుకొంది. ఇక్కడ దట్టమైన పొగమంచుతో భారత్, దక్షిణాఫ్రికాల మధ్య బుధవారం జరగాల్సిన నాలుగో టీ20 రద్దయింది. మ్యాచ్‌లో ఒక్క బంతి కూడా పడలేదు. మైదానాన్ని పూర్తిగా మంచు కమ్మేయడంతో ఎదురున ఉన్న వారు స్పష్టంగా కనిపించడమే గగనమైంది. దీంతో టాస్ కూడా వేయలేక పోయారు. రెండున్నర గంటలకు పైగా వేచిచూసిన అంపైర్లు ఈ మధ్యలో ఆరుసార్లు విజిబులిటీని పరిశీలించారు. ఇక, చివరగా రాత్రి 9.25 గంటలకు మరోసారి స్టేడియంలో కలియదిరిగారు. కానీ ఫలితం లేకపోవడంతో, మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మ్యాచ్ జరిగే అవకాశాలు లేవని ముందుగానే అర్థం కావడంతో చాలామంది ప్రేక్షకులు నెమ్మదిగా మైదాన్ని వీడారు. రద్దు ప్రకటన వచ్చే సమయానికి కొద్ది మంది మాత్రమే స్టాండ్స్‌లో కనిపించారు. దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యం టీమిండియా సిరీస్ గెలుస్తుందా? లేక సౌతాఫ్రికా సమం చేస్తుందా? అనేది శుక్రవారం అహ్మదాబాద్‌లో జరిగే ఐదో, ఆఖరి టీ20లో తేలనుంది.

వేళ్లన్నీ బీసీసీఐ వైపే..



శీతాకాలంలో వాతావరణ పరిస్థితులను అంచనావేయకుండా బీసీసీఐ ఉత్తర భారతంలో మ్యాచ్‌లను షెడ్యూల్ చేయడం విమర్శలకు దారితీసింది. లఖ్‌నవూ, న్యూ చండీగఢ్, ధర్మశాలలో ఈ రోజుల్లో చలి తీవ్రంగా ఉంటుంది. బుధవారం లఖ్‌నవూలో గాలి నాణ్యత కూడా ప్రమాదకర స్థాయికి పడిపోయింది. భారత జట్టు వామప్ చేసేటప్పుడు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించాడు. దీంతో ఆటగాళ్ల ఆరోగ్యం విషయంలో బోర్డుకు ఎంత శ్రద్ధ ఉందో ఇట్టే అర్థమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, రొటేషన్ పాలసీని అనుసరిస్తున్న బీసీసీఐ ఈ వేదికలను ఖరారు చేసింది. కానీ, వాతావరణం గురించి ఏమాత్రం ఆలోచించలేదు. న్యూజిలాండ్‌తో జనవరి 11 నుంచి జరిగే వైట్ బాల్ సిరీస్‌లకు పశ్చిమ, దక్షిణ భారతంలోని వడోదర, రాజ్‌కోట్, ఇండోర్, నాగ్‌పూర్, విశాఖపట్నం, తిరువనంతపురాన్ని వేదికలుగా ఎంపిక చేశారు. కానీ, వీటిని ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లకు ఎంపిక చేస్తే తాజా సిరీస్ సజావుగా సాగేదన్న కామెంట్లు వినిపిస్తున్నాయి. రొటేషన్ పాలసీకి న్యాయం చేసినట్టు ఉండేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ధర్మశాలలోని తీవ్ర చలికి తాను ఎంతో ఇబ్బందిపడినట్టు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి చెప్పాడు. ఈ నేపథ్యంలో బోర్డు ఆపరేషన్స్ టీమ్ పనితీరుపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణాన్ని గమనించి మ్యాచ్‌ను కొన్ని గంటల ముందు నిర్వహించేలా ప్లాన్-బిని సిద్ధం చేసి ఉంటే కొంతలో కొంత మెరుగ్గా ఉండేదని అభిప్రాయం వినవస్తోంది.

'ఈడెన్'లో ప్రపంచకప్ టిక్కెట్ రూ. 100

కోల్‌కతా: టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే గ్రూప్, నాకౌట్ మ్యాచ్‌లకు బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) టిక్కెట్ల రేట్లను బుధవారం ప్రకటించింది. మెగా టోర్నీ వచ్చే ఫిబ్రవరి 7న భారత్, శ్రీలంక వేదికలుగా మొదలవనుంది. బంగ్లాదేశ్-ఇటలీ, ఇంగ్లండ్-ఇటలీ, వెస్టిండీస్-ఇటలీ జట్ల మధ్య జరిగే గ్రూపు మ్యాచ్‌లకు టిక్కెట్ కనిష్ఠ ధర రూ. 100గా నిర్ణయించింది. సూపర్-8మ్యాచ్‌కు కనిష్ఠ రేటు రూ. 900గా ప్రకటించింది.

ఆర్చరీలో ధీరజ్ బృందానికి రజతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆర్చరీ రికర్వ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన బొమ్మదేవర ధీరజ్ బృందం రజత పతకం సాధించింది. బుధవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన టీమ్ ఈవెంట్ ఫైనల్లో ధీరజ్ నేతృత్వంలోని సుఖ్‌చైన్, రాహుల్, సచిన్‌తో కూడిన సర్వీసెస్ జట్టు 2-6 మహారాష్ట్ర చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. రైల్వేస్ జట్టు కాంస్యం గెలిచింది. మహిళల టీమ్ ఈవెంట్‌లో మహారాష్ట్ర స్వర్ణం, జార్ఖండ్ రజతం, ఉత్తరప్రదేశ్ కాంస్యంతో అందుకున్నాయి.



గిల్‌కు గాయం


చివరి మ్యాచ్‌కు దూరం!

పేలవ ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్‌ను గాయాలు వెంటాడుతున్నాయి. తాజాగా అతడి పాదానికి గాయమైనట్టు తెలుస్తోంది. దీంతో అహ్మదాబాద్‌లో జరిగే ఐదో టీ20లో అతడు ఆడేది అనుమానమే. నాలుగో టీ20 వేదికైన లఖ్‌నవూలో ప్రాక్టీస్ చేస్తుండగా అతడి కాలికి గాయమైనట్టు సమాచారం. ఆ మ్యాచ్ రద్దు కావడంతో అతడి గురించి ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. జట్టు వామప్ సమయంలో కూడా గిల్ కనిపించలేదు. 'నాలుగో టీ20 నేపథ్యంలో గిల్ ఎక్కువసేపు సాధన చేశాడు. సెషన్ ఆఖర్లో నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తుండగా బంతి బలంగా తగిలింది. అతడు బాధతో అతడు విలవిల్లాడాడు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. పొట్టి వరల్డ్‌కప్ ముందు భారత్‌కు న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ ఆఖరిది. ఈ సిరీస్‌లో ఆడిన జట్టును వరల్డ్‌కప్‌నకు ఎంపిక చేసే చాన్సుంది. మరి.. అప్పటికల్లా గిల్ ఫిట్‌నెస్ సాధిస్తాడా? లేదా? చూడాలి. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్‌లో మెడ పట్టేయడంతో రెండో టెస్ట్‌తో పాటు వన్డే సిరీస్‌కు గిల్ దూరమయ్యాడు.

సాత్విక్ జోడీ బోణీ

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్

హాంగ్జౌ: సీజన్ ముగింపు టోర్నీ, ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి డబుల్స్‌లో శుభారంభం చేశారు. బుధవారం మొదలైన ఈ టోర్నీ పురుషుల డబుల్స్ గ్రూప్-బి తొలి పోరులో ఏస్ జోడీ, ప్రపంచ మూడో ర్యాంకర్ సాత్విక్/చిరాగ్ ద్వయం 12-21, 22-20, 21-14తో ఒలింపిక్ రజత పతక విజేత, చైనా జంట లియాంగ్ వీ కెంగ్/వాంగ్ చాంగ్‌ను చిత్తుచేసింది. సరిగ్గా గంటపాటు జరిగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ కోల్పోయిన సాత్విక్ జంట.. అనంతరం పుంజుకొని వరుస రెండుగేముల్లో సత్తాచాటి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. తమ గ్రూప్‌లో భాగంగా గురువారం జరిగే రెండో మ్యాచ్‌లో ఇండోనేసియా జంట ఫజర్ అల్ఫియాన్/మహ్మద్ షోహిబుల్ ఫిక్రితో సాత్విక్ ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది.



కేరీ సెంచరీ

ఆస్ట్రేలియా 326/8

ఇంగ్లండ్‌తో యాషెస్ మూడో టెస్ట్

అడిలైడ్: సొంత గడ్డపై కీపర్ అలెక్స్ కేరీ (106) శతకంతో చెలరేగాడు. అతడికి ఉస్మాన్ ఖవాజా (82) అర్ధ శతకం తోడవడంతో యాషెస్ మూడో టెస్ట్ తొలి రోజును ఆస్ట్రేలియా గౌరవ ప్రదంగా ముగించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆతిథ్య జట్టు ఓ దశలో 94/4 స్కోరుతో ఇక్కట్లలో పడింది. ఐపీఎల్ మినీ వేలంలో రికార్డ్ స్థాయి ధర దక్కించుకున్న ఆసీస్ స్టార్ బ్యాటర్ గ్రీన్ (0) డకౌటయ్యాడు. అయితే కేరీ, ఖవాజా ఐదో వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. దాంతో బుధవారం ఆట ముగిసే సరికి కంగారూలు ఎనిమిది వికెట్లకు 326 పరుగులు చేశారు. స్టార్క్ (33 బ్యాటింగ్), నాథన్ లయన్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఆర్చర్ మూడు, బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

ఆంధ్ర జట్టు పరాజయం

సంతోష్ ట్రోఫీ



అనంతపురం క్లాక్ టవర్ (ఆంధ్రజ్యోతి): సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ స్టేడియంలో బుధవారం మొదలయ్యాయి. తొలిరోజు జరిగిన మ్యాచుల్లో ఆతిథ్య ఆంధ్ర జట్టుకు చుక్కెదురైంది. పుదుచ్చేరి 3-1 గోల్స్ తేడాతో ఆంధ్రపై గెలిచింది. మరో మ్యాచ్‌లో తమిళనాడు 6-0తో అండమాన్ నికోబార్‌ను ఓడించింది.

ఆరేళ్ల తర్వాత..

- టాటా స్టీల్ చెస్ బరిలో ఆనంద్
- గుకేష్‌తో అమీతుమీ



కోల్‌కతా: ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ 6 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత టాటా స్టీల్ చెస్ టోర్నీ బరిలో దిగనున్నాడు. జనవరి 7 నుంచి 11 వరకు ఇక్కడ జరిగే టాటా స్టీల్ చెస్, ఇండియా టోర్నమెంట్‌లో విషీ తలపడుతున్నాడు. అంతేకాదు..టోర్నీలో తన శిష్యుడు, వరల్డ్ చాంపియన్ గుకేష్‌ను ఢీకొననున్నాడు. ఈ టోర్నమెంట్‌లో ఆనంద్ చివరిసారిగా 2019లో ఆడాడు. ఓపెన్, మహిళల విభాగాలలో ర్యాపిడ్, బ్లిట్జ్ విధానంలో టోర్నీ జరగనుంది. ఓపెన్ కేటగిరీలో ఫిడే ప్రపంచ కప్ రన్నరప్ వీ ఈ, వెస్లీ సో, హాన్స్ నీమన్ తోపాటు భారత్ నుంచి ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసి తదితరులు పోటీపడుతున్నారు. మహిళల్లో..వరల్డ్ కప్ విజేత దివ్యా దేశ్‌ముఖ్, తెలుగు తేజం హారిక, అలెగ్జాండ్రా గొర్యాచ్కినా తదితరులు తలపడుతున్నారు.



కోచ్ జువాన్‌తో అల్కారజ్ కటీఫ్

వాషింగ్టన్: ప్రపంచ టెన్నిస్ నెంబర్‌వన్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్.. సుదీర్ఘ కాలంగా తనకు కోచ్‌గా వ్యవహరిస్తున్న 45 ఏళ్ల జువాన్ కార్లోస్ ఫెరెరోకు గుడ్‌బై చెప్పాడు. ఈ విషయాన్ని అల్కారజ్ బుధవారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. స్పెయిన్ మాజీ ఆటగాడైన జువాన్.. అల్కారజ్‌కు 15 ఏళ్ల వయసు ఉన్నప్పుడు అతని గురువుగా చేరాడు. చిరుప్రాయం నుంచే అల్కారజ్‌ను అద్భుత ఆటగాడిగా తీర్చిదిద్దడంలో జువాన్‌ది కీలకపాత్ర. జువాన్ హయాంలోనే అల్కారజ్ 6 గ్రాండ్ స్లామ్స్ సాధించాడు. 24 టూర్ స్థాయి టైటిళ్లు నెగ్గాడు. అంతేకాదు.. 19 ఏళ్ల వయసులోనే వరల్డ్ నెంబర్‌వన్‌గా నిలిచి ఈ ఘనత అందుకున్న తొలి ఆటగాడిగా రికార్డుకెక్కాడు.

జగన్ క్రిమినల్ క్రెడిట్‌ను ఎవ్వరూ చోరీ చేయలేరు: మేడా

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'జగన్ క్రిమినల్ క్రెడిట్‌ను ఎవ్వరూ చోరీ చేయలేరు' అని టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ఏ మంచి జరిగినా అంతా తన గొప్పే అంటున్న జగన్ ఆయన పాలనలో ఒక్క పరిశ్రమా రాష్ట్రానికి ఎందుకు రాలేదో, ఒక్క ఉద్యోగమైనా ఎందుకు ఇవ్వలేకపోయారో చెప్పాలి' అని మేడా డిమాండ్ చేశారు.

హిందువులకు జగన్ క్షమాపణ చెప్పాలి: వర్ల

కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ పరకామణి చోరీని చిన్న కేసుగా పేర్కొనడం సరికాదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ భక్తులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కోర్టు తీర్పును ప్రభుత్వానికి ఆపాదించడం జగన్ అజ్ఞానం: గొట్టిముక్కల

పరామర్శల పేరుతో బలప్రదర్శనలు చేయడం జగన్‌కి అలవాటుగా మారిందని ఏపీ బిల్డింగ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విజయవాడలో భవానీపురంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థలాన్ని ఖాళీ చేయిస్తే, కోర్టు తీర్పును ప్రభుత్వానికి ఆపాదించడం జగన్ అజ్ఞానానికి నిదర్శనం' అన్నారు.

కంభంపాటి తల్లి మృతికి సీఎం సంతాపం

టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కంభంపాటి రామ్మోహన్‌రావు తల్లి వెంకటనరసమ్మ మృతికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

జాతీయ స్థాయిలో ఎన్టీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

- అభినందించిన చంద్రబాబు, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి

జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన కామన్ లా ప్రవేశ పరీక్షలో ఎన్టీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు 13 మంది ప్రతిభ కనబర్చి మంచి ర్యాంకులు సాధించారు. ఆల్ ఇండియా స్థాయిలో 103, 129, 164, 179, 185, 264 ర్యాంకులు సాధించిన విద్యార్థులను సీఎం చంద్రబాబు, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అభినందించారు.

'హనుమాన్' ఫౌండేషన్‌కు పాలకవర్గం

రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణ, మానవ- అటవీ జంతువుల సంఘర్షణల నివారణ కోసం అటవీ శాఖ చేపట్టిన 'హనుమాన్' ఫౌండేషన్‌కు ప్రభుత్వం పాలక మండలిని ఏర్పాటుచేసింది. బుధవారం ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తెలంగాణకు న్యాయమే జరిగింది

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ సారథ్యంలోని కృష్ణా జలవివాదాల ట్రైబ్యునల్-2 ఎదుట ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా బుధవారం కూడా తన వాదనలు బలంగా వినిపించారు. ఉమ్మడి రాష్ట్రంలో సమన్యాయం కోసమే ఎస్ఎల్‌బీసీ, ఎస్ఆర్‌బీసీకి ఒకేసారి అనుమతులు తీసుకున్నామని తెలిపారు. అన్నీ సానుకూలంగా ఉన్నా.. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు పూర్తయినా శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ)ని తెలంగాణ పూర్తి చేయలేకపోయిందన్నారు. 'ఎస్ఆర్ఎస్‌పీని ఏపీ పూర్తి చేయడాన్ని తెలంగాణ ఎలా తప్పుబడుతుంది? ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయకుండా దానిని ఎవరడ్డుకున్నారు? ఎలిమినేటి మాధవరెడ్డి ఎడమ కాలువ పనులను ఉమ్మడి రాష్ట్రంలోనే పూర్తి చేశాం. ఇది సమన్యాయం కాదా' అని ప్రశ్నించారు. 1954లో నందికొండ ప్రాజెక్టు (ప్రస్తుతం నాగార్జునసాగర్) కట్టేముందే హైదరాబాద్, మద్రాసు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగిందని.. పరివాహక ప్రాంతం ఆవల కూడా నీటి కేటాయింపులు జరపాలని నాడు నిర్ణయించారని.. ఈ ఒప్పందం గురించి తమకు తెలియదంటూ తెలంగాణ ఇప్పుడు అభ్యంతరం వ్యక్తం చేయడం ఏమిటని నిలదీశారు. అలాగే 1944 ఒప్పందంలో మద్రాసు, హైదరాబాద్ రాష్ట్రాలు చెరో 65 టీఎంసీలు వాడుకోవాలని ఉన్నట్లు తెలంగాణ చెబుతోందని.. అందుచేత కృష్ణా జలాలను ఇప్పుడు సమంగా వాడుకోవాలని వాదించడం అర్థరహితమన్నారు. అసలీ ఒప్పందం అమల్లోకే రాలేదని.. దీని ఆధారంగా నీటి కేటాయింపులు చేయలేరని తేల్చిచెప్పారు. '1972లో కృష్ణా ట్రైబ్యునల్-1 స్పష్టమైన ఆదేశాలిచ్చింది. సమాన వినియోగం వర్తించదని.. ప్రాజెక్టుల వారీగానే కేటాయింపులు ఉంటాయని స్పష్టంగా పేర్కొంది. తుంగభద్ర ప్రాజెక్టు తెలంగాణ పరిధిలోకే రాదు. ఆ రాష్ట్రం వాదనలేవీ సరికాదు. 1956లో హైదరాబాద్‌ను మినహాయిస్తూ ఒప్పందం జరిగిందనడమూ చెల్లదు. న్యాయపరమైన వాదనలు వినిపించలేక.. చారిత్రక ఘట్టాలంటూ తెలంగాణ రాజకీయ వాదనలకు దిగుతోంది' అని తెలిపారు. కేసీ కెనాల్, ఆర్‌డీఎస్‌లకు నీటి అవసరాల దృష్ట్యా ఇండెంట్ పెట్టడమే తప్ప కేటాయింపుల్లేవని గుప్తా స్పష్టంచేశారు. ట్రైబ్యునల్ విచారణ గురువారం కూడా కొనసాగనుంది.

విశాఖలో ఐటీ భవనాల నిర్మాణానికి ఎందరు దరఖాస్తు చేశారు?

- భూకేటాయింపు విధానం ఏంటి?
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- రహేజాకు నిధులివ్వకుండా నిలువరించాలన్న పిటిషనర్ అభ్యర్థన తోసివేత
- విచారణ రెండు వారాలకు వాయిదా

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మధురవాడలోని ఐటీ హిల్-3 వద్ద ఐటీ సంస్థలకు అవసరమైన వాణిజ్య, నివాస భవనాల సముదాయాలు నిర్మించేందుకు రహేజా కార్పొరేషన్‌కు 27.10 ఎకరాలను కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ ప్రాజెక్టు కోసం ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు? భూకేటాయింపులో అనుసరిస్తున్న విధానం ఏమిటో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రప్రభుత్వం రహేజా కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు విడుదల చేయబోతోందని, ప్రక్రియను నిలువరించాలన్న సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అభ్యర్థనను తోసిపుచ్చింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్(ఎల్ఐఎఫ్‌టీ) పాలసీలో భాగంగా రహేజా కార్పొరేషన్‌కు 27.10 ఎకరాలను కేటాయించడాన్ని సవాల్ చేస్తూ 'సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ కాన్‌స్టిట్యూషనల్ రైట్స్' అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున పొన్నవోలు వాదనలు వినిపించారు.



రహేజాకు భూకేటాయింపు లిఫ్ట్ పాలసీ నిబంధనలకు అనుగుణంగా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. లిఫ్ట్ పాలసీని సవాల్ చేస్తూ ఇప్పటికే ఓ పిల్ దాఖలైందని.. ప్రస్తుత పిల్‌లో పాలసీతో పాటు రహేజా సంస్థకు భూకేటాయింపునూ సవాల్ చేశారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారికి భూకేటాయింపు చేశామన్న వాదనలో వాస్తవం లేదన్నారు. 15 వేల ఉద్యోగాలు కల్పించాలనే షరతుతోనే భూమి కేటాయించామని.. రహేజాకు విధించిన షరతులను పిటిషనర్ ఉద్దేశపూర్వకంగా కోర్టు ముందు ఉంచడం లేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది.

సంతకాలు ముందురోజు చేస్తా!

- ఏసీబీ కోర్టులో ఐపీఎస్ సంజయ్ పిటిషన్

విజయవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో వైద్యుల అపాయింట్‌మెంట్ నేపథ్యంలో ఏసీబీ అధికారుల ముందు ఈనెల 19(శుక్రవారం)న చేయాల్సిన సంతకాన్ని ముందురోజు గురువారమే చేస్తానని ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే, వచ్చే వారం క్రిస్మస్ పండగ నేపథ్యంలో ఆ మరుసటి రోజు సంతకం చేయడానికి రాలేనని, దానికి కూడా అనుమతి ఇవ్వాలని కోరారు. సంజయ్‌కు బెయిల్ మంజూరు చేసే సమయంలో ఏసీబీ విధించిన షరతుల మేరకు ఆయన ప్రతి శుక్రవారం ఏసీబీ అధికారుల ముందు హాజరై సంతకం చేయాల్సి ఉంది. అయితే, ఈ నెల 19న వైద్యుల అపాయింట్‌మెంట్ ఉండటంతో కోర్టుకు రాలేనని సంజయ్ తెలియజేశారు. పాస్‌పోర్టు, ఈ-మెయిల్ ఐడీ, వాట్సాప్ నంబరును కోర్టుకు సమర్పించారు.

పట్టు రైతులకు పెండింగ్ నిధులు విడుదల: అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టు రైతులకు 2021-22 నుంచి పెండింగ్‌లో ఉన్న రాష్ట్రవాటా నిధుల్ని పూర్తి స్థాయిలో విడుదల చేసినట్లు మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. సిల్క్ సమగ్ర-2 పథకం కింద 2023-24, 2024-25 సంవత్సరాలకు పట్టు పరిశ్రమశాఖకు రాష్ట్ర వాటాగా రూ.14కోట్లు విడుదల చేయగా, రూ.13.75కోట్లు లబ్దిదారులకు నేరుగా చెల్లింపులు జరిపినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 13,663 మంది పట్టు రైతులు లబ్ది పొందారన్నారు.

'జీరామ్‌జీ'తో రాష్ట్రాలపై ఆర్థికభారం

- వీహెచ్, గిడుగు, సీపీఐ నారాయణ, రామకృష్ణ వెల్లడి
- రేపు దేశవ్యాప్త ఉద్యమం: సంఘర్ష్ మోర్చా

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వీబీ జీ రామ్ జీ - 2025 బిల్లుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం పడనుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు, సీడబ్ల్యూసీ సభ్యుడు గిజుగు రుద్రరాజు, సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ నేత నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. పేదల ఆకలి తీరుస్తున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భవన్లలో వారు వేర్వేరుగా మీడియా సమావేశాల్లో మాట్లాడారు. గతంలో కేంద్ర ప్రభుత్వమే ఈ పథకం కోసం నూరుశాతం నిధులు కేటాయించేదని, ఇప్పుడు దాన్ని 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాలను 40 శాతం భరించాలని అంటున్నారని తెలిపారు. తద్వారా దశలవారీగా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయడానికి కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

బిల్లును వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం..

ఉపాధి హామీ పథకాన్నే కొనసాగించాలని, కొత్త బిల్లును వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లతో ఈ నెల 19న దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించనున్నట్టు ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా ప్రకటించింది. ఢిల్లీలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘర్ష్ మోర్చా నాయకుడు బి.వెంకట్ మాట్లాడుతూ.. కేంద్రం దిగివచ్చి కొత్త బిల్లును వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. దేశవ్యాప్తంగా 35 సంఘాలకు పైగా ఈ ఉద్యమంలో పాల్గొననున్నట్టు తెలిపారు.

ఏఎన్నార్ యూనివర్సిటీకి రూ.2 కోట్ల విరాళం



మనుషులు శాశ్వతం కాదని, వారు చేసే పనులే శాశ్వతమని తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు నిరూపించారని నాగార్జున అన్నారు. కృష్ణాజిల్లాలోని గుడివాడ ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవాల్లో రెండోరోజు బుధవారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 1950లో సినిమాకు కేవలం రూ.5 వేలు తీసుకునే రోజుల్లో తన తండ్రి గుడివాడ కళాశాల కోసం రూ.లక్ష విరాళమిచ్చారన్నారు. ఆంధ్ర యూనివర్సిటీకి రూ.25 వేలు, మద్రాస్ యూనివర్సిటీకి రూ.25 వేలు విరాళంగా ఇచ్చారని గుర్తుచేశారు. చదువు ద్వారా వేలాది మందికి బంగారు భవిష్యత్తు ఇవ్వాలని ఆయన కోరుకున్నారని చెప్పారు. రైతుబిడ్డ అయిన ఏఎన్నార్‌కు చదువు అంటే అమితమైన ఇష్టమన్నారు. ఏఎన్నార్ స్థాపించిన సంస్థలు తమకెప్పుడూ ప్రత్యేకమేనని నాగార్జున అన్నారు. కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్ కోసం తన తల్లిదండ్రులు అక్కినేని నాగేశ్వరరావు, అన్నపూర్ణమ్మ పేరుమీద, తమ కుటుంబం తరఫున రూ.2 కోట్లు ఇస్తున్నట్లు నాగార్జున ప్రకటించారు. అనంతరం యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించి ప్రధాని నరేంద్రమోదీకి అందించనున్న ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవం పుస్తకాన్ని నాగార్జున ఆవిష్కరించారు.

గుడివాడ, ఆంధ్రజ్యోతి

సంక్రాంతికి రెబల్ జాతర



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న హారర్ కామెడీ చిత్రం 'రాజాసాబ్'. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నుంచి 'సహన సహన' అంటూ సాగే బ్యూటిఫుల్ మెలోడీ పాటను బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అభిమానుల మధ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ 'రాజాసాబ్ ప్రచార చిత్రాలకు దక్కుతోన్న ఆదరణ సంతోషాన్నిస్తోంది. అభిమానులను అలరించడానికి ప్రభాస్ ఎప్పుడూ కష్టపడుతుంటారు. ఈసారి పండుగ 'రెబల్ సంక్రాంతి' అవుతుంది. అందరూ రెడీగా ఉండండి' అని అన్నారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'ప్రభాస్ అభిమానుల కోసం త్వరలో భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించబోతున్నాం. రిలీజ్ డేట్‌ను త్వరలో అధికారికంగా ప్రకటిస్తాం. అయితే అభిమానులు కోరుకున్నట్లు జనవరి 8న ప్రీమియర్స్ వేసేలా ప్లాన్ చేస్తున్నాం. ప్రభాస్ రేంజ్ ఏంటో ఈ సినిమాతో మరోసారి చూస్తారు' అని చెప్పారు. ముగ్గురు హీరోయిన్లతో ప్రభాస్ వేసిన స్టెప్పులు ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తాయని తమన్ అన్నారు.

ఎన్టీ రామారావు వీరాభిమాని 'ఎన్టీఆర్ రాజు' మృతి



దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు వీరాభిమాని, టీడీపీ సీనియర్ నేత ఎన్టీఆర్ రాజు (బి.రామచంద్ర రాజు) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన బుధవారం వేకువజామున తిరుమలలో తుదిశ్వాస విడిచారు. 1962లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక, జనరల్ సెక్రటరీగా నియమితులై ఎన్టీ రామారావుకు అత్యంత సన్నిహితుడిగా మారారు ఆయన. టీటీడీ బోర్డు సభ్యుడిగా పని చేసిన తొలి తిరుమలవాసి కూడా ఆయనే. ఎన్టీయార్ రాజు మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు.

తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో 'హోమ్‌బౌండ్'



నీరజ్ ఘైవాన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'హోమ్‌బౌండ్' చిత్రం భారతదేశం నుంచి అధికారిక ఎంట్రీగా ఆస్కార్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. కరణ్‌జోహార్ నిర్మించిన ఈ చిత్రంలో జాన్వీ కపూర్, ఇషాన్ కట్టర్, విశాల్ జెత్వా ముఖ్య పాత్రలు పోషించారు. మంగళవారం ప్రకటించిన ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో 'హోమ్‌బౌండ్' చిత్రం కూడా ఉండడంతో టీమ్ ఆనందం వ్యక్తం చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన 86 చిత్రాల నుంచి 15 సినిమాలను ఎంపిక చేయగా వాటిలో 'హోమ్‌బౌండ్' కూడా ఉండడం విశేషం. ఇంతవరకూ ఇలా ఆస్కార్ షార్ట్ లిస్ట్‌కు ఎంపికైన ఐదో భారతీయ చిత్రమిది. దీనివల్ల మరోసారి భారతీయ సినిమాకు ఆస్కార్ అవార్డ్ వచ్చే అవకాశాలు మెరుగయ్యాయని చెప్పవచ్చు. ఆస్కార్ అకాడెమీ సభ్యుల ఓటింగ్ ప్రక్రియ వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16 వరకూ జరుగుతుంది. వివిధ విభాగాల్లో ఫైనల్ నామినేషన్స్ వివరాలను జనవరి 22న ప్రకటిస్తారు.

ఆసక్తికరమైన కథతో..



శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి ప్రధాన పాత్రలు పోషించిన '45 ద మూవీ' చిత్రం జనవరి ఒకటిన విడుదల కానుంది. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం.రమేశ్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో చివరి షాట్, శివన్న గెటప్ నెక్ట్స్ లెవెల్ అని చెప్పాలి. అలాగే ఉపేంద్ర యాక్షన్, డైలాగ్ డెలివీరీ అందరినీ ఆకట్టుకుంటాయని మేకర్స్ చెప్పారు. విజువల్ వండర్‌గా '45 ద మూవీ' ప్రేక్షకుల ముందుకు రానుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



వారణాసి సినిమా సెట్స్‌కు రావొచ్చా..

-జక్కన్నను కోరిన జేమ్స్ కామెరూన్

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన 'అవతార్: ఫైర్ అండ్ యాష్' ఈ శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతున్న సంగతి తెలిసిందే. మన దేశంలో ఈ చిత్ర ప్రమోషన్స్‌ను ఓ విభిన్న రీతిలో ప్లాన్ చేసింది అవతార్ టీమ్. ఈ చిత్రాన్ని రాజమౌళితో సహా కొందరు సినీ ప్రముఖులకు విడుదలకు ముందే ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సినిమా చూశాక జేమ్స్ కామెరూన్‌తో వీడియో కాల్‌లో మాట్లాడారు రాజమౌళి. వారి మధ్య సంభాషణ ఇలా ఆసక్తికరంగా సాగింది.

జేమ్స్ కామెరూన్: మీరు 'వారణాసి' షూటింగ్‌లో బిజీగా ఉండి కూడా మా చిత్రాన్ని చూసినందుకు ధన్యవాదాలు.

రాజమౌళి: 'అవతార్ మూడో భాగాన్ని చూసిన తొలి భారతీయుడిని అయినందుకు ఎంతో సంతోషంతో ఉన్నాను. ఈ ప్రత్యేక అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఈ సినిమా చూస్తున్నంతసేపూ ఓ అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యాను. ఈ విజువల్ వండర్‌ను చూస్తూ థియేటర్‌లో పిల్లాడిలా మారిపోయాను. మీరు సృష్టించిన అవతార్ ప్రపంచం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసి నన్ను మరో లోకంలోకి తీసుకెళ్లింది. ముఖ్యంగా కథానాయకుడు జేక్ సలీ నైతిక సంఘర్షణ, ఆలోచనా తీరు నన్ను బాగా కదిలించాయి. ఈ అంశాలు మొదటి భాగంలో చాలా బలంగా అనిపించాయి. ఈ భాగంలో ఇవి మరింతగా వర్కౌట్ అయ్యాయి. వరాంగ్ నటన అద్భుతంగా ఉంది. పాత్రల మధ్య సంభాషణలు చాలా లోతుగా ఉన్నాయి. ఈ చిత్రంతో మరోసారి ప్రపంచ సినిమాకు ఓ సరికొత్త బెంచ్ మార్క్‌ను సెట్ చేశారు. నేను ఇంకొంచెం ఎక్కువ మాట్లాడితే స్పాయిలర్స్ అవుతాయి.

జేమ్స్ కామెరూన్: మీ 'వారణాసి' సినిమా సెట్స్‌కు రావొచ్చా? అక్కడ మీరు చేసే మ్యాజిక్‌ను చూడాలనుంది.. షూటింగ్ ఎంతవరకూ వచ్చింది.. 'ఆర్ఆర్ఆర్'లో విశ్రాంతి సందర్భంలో టైగర్, చీతాతో తీసిన సన్నివేశాల్లాంటివి మళ్లీ ఎప్పుడు తీస్తున్నారో చెప్పండి. ఆ రోజు కచ్చితంగా సెట్స్‌కొస్తాను. నాకూ ఓ కెమెరా ఇస్తే సెకండ్ యూనిట్ దర్శకుడిగా కొన్ని సన్నివేశాలూ తీస్తాను.

రాజమౌళి: మీరు రావడం మాకెంతో సంతోషాన్ని ఇస్తుంది. నాతో పాటు మా టీమ్ అంతా ఎగిరిగంతేస్తారు. చిత్రపరిశ్రమ మొత్తం థ్రిల్లవుతుంది. 'వారణాసి' షూటింగ్ ఏడాదిగా జరుగుతోంది. మరో ఏడెనిమిది నెలల్లో పూర్తవుతుంది. మీకు తెలుసా.. మా హైదరాబాద్‌లోని ఐమ్యాక్స్‌లో 'అవతార్'ను ఏడాది పాటూ ప్రదర్శించారు.

జేమ్స్ కామెరూన్: అవునా.. 'వారణాసి'ని చూడడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

రాజమౌళి: సినిమా బడ్జెట్ అదుపుదాటిపోతోంది. థియేటర్లకు ప్రేక్షకులు రావడం తగ్గిపోయింది. దీనిపై మీ కామెంట్ ఏంటి?


జేమ్స్ కామెరూన్: బడ్జెట్ అదుపు దాటిపోతున్న విషయం వాస్తవమే. ఒకప్పటిలా 'టైటానిక్' లాంటి భారీ బడ్జెట్ విన్యాసాలను నిర్మించడానికి నిర్మాణ సంస్థలు జంకుతున్నాయి. కొవిడ్ తర్వాత థియేటర్లకు ప్రేక్షకులు వచ్చే సంఖ్య చాలా శాతం తగ్గిపోయింది. ప్రేక్షకులు వెండితెరపై సినిమా చూసే అనుభూతిని కాపాడడం నిజానికి ఫిల్మ్ మేకర్స్‌గా మనదే బాధ్యత. బడ్జెట్‌ను తగ్గించడం, కొత్త వారికి అవకాశాలివ్వడం, వీఎఫ్ఎక్స్ వాడకాన్ని తగ్గించడంపై దృష్టిపెట్టాలి.

రాజమౌళి: ప్రేక్షకులు థియేటర్లకు మునుపటిలా వచ్చేలా చేయడానికి దర్శకులు కొత్త కంటెంట్‌ను సృష్టించడంపై దృష్టి పెడితే పరిష్కారం దొరుకుతుందా.. లేదా థియేటర్ల యాజమాన్యం కూడా ఏదైనా కొత్తగా చేయాలంటారా?

జేమ్స్ కామెరూన్: థియేటర్లు కొత్త సాంకేతికతను తీసుకువస్తే బాగుంటుంది. గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు అప్డేట్ అవుతుండాలి.

సినిమాల్లో కృతిమమేధను వాడడంపై మీ అభిప్రాయం?

జేమ్స్ కామెరూన్: కృతిమమేధ ప్రమాదకరమైనది. ఎంత తక్కువ వాడితే అంత మేలు. కానీ అది ఎప్పుడూ మానవ మేధస్సు సృష్టించినటువంటి అద్భుతాలను చేయలేదు. అలాగే మానవనైపుణ్యాన్ని భర్తీ చేయలేదు.



డేటా కరెక్టేనా ..

నీటి సంరక్షణ, నిల్వపై సమీక్షించే క్రమంలో, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని భూగర్భ జలాల నిల్వలపై ఆర్టీజీఎస్ డేటాను సీఎం పరిశీలించారు. 'డేటా కరెక్టేనా' అని అక్కడే ఉన్న ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్‌ను ప్రశ్నించారు. 'కరెక్టు కాకపోతే నా పరువు పోతుంది.. జాగ్రత్త' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అయితే, ఆ డేటా సరైనదేనని జిల్లాల కలెక్టర్లు కూడా ధ్రువీకరించారు. అయినా, మరోసారి చెక్ చేసుకోవాలని భాస్కర్‌కు సీఎం సూచించారు.

సిద్ధాంతాలు తిండిపెట్టవు

సంస్కరణలు, ఐటీతోనే మార్పులు : చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాకే మనుషుల ఆలోచనా విధానం మారిందని సీఎం చంద్రబాబు అన్నారు. సంస్కరణలు రాకముందు ప్రతి ఒక్కరూ సిద్ధాంతాలు మాట్లాడారని, అవి మనుషులకు తిండి పెట్టవని వ్యాఖ్యానించారు. కలెక్టర్ల సమావేశంలో ఆయన విలువలు, సిద్ధాంతాల గురించి మాట్లాడారు. సిద్ధాంతాలు, విలువలు వేర్వేరని, ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందాలంటే రోడ్లు, విద్యుత్, విద్యా సౌకర్యాలు బాగుండాలన్నారు. 1995 నాటికి టెక్నాలజీ రాగానే తొలిగా అందిపుచ్చుకొని పనిచేశామన్నారు. "దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినా, 1991 వరకు ప్రపంచం మన దేశాన్ని గుర్తించలేదు. ఎక్కడికిపోయినా తక్కువగా చూసేవారు. ఆర్థిక సంస్కరణలతోనే ప్రపంచం మన దేశాన్ని చూసే విధానం మారింది. ప్రధాని మోదీ ఇప్పుడు స్థిరమైన ప్రభుత్వం ఇచ్చారు. దీంతో ప్రపంచమంతా గర్వించేలా ముందుకు వెళ్తున్నాం. కేవలం ఈ 25 ఏళ్లలోనే ఇవన్నీ సాధ్యమయి ఫాస్ట్‌ట్రాక్‌లోకి వచ్చాం. గతంలో ప్రభుత్వ రంగంలో విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నా పవర్ ఉండేది కాదు. ప్రపంచంలో అత్యధిక తలసరి ఆదాయం తెలుగు వారికి వచ్చిందంటే నాలెడ్జ్ ఎకానమీలో ముందు ఉండటమే కారణం. 30 ఏళ్ల క్రితం ప్రైవేటు రంగంలో ప్రారంభించిన ఇంజనీరింగ్ కాలేజీలే దీనికి కారణం" అని సీఎం వివరించారు.

జనవరి నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తా!

ప్రభుత్వంపై ప్రజల స్పందన తెలుసుకుంటా

ఉగాది రోజున ఐదు లక్షల గృహ ప్రవేశాలు: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలుసుకునేందుకు జనవరి నుంచి జిల్లాల్లో ఆకస్మికంగా పర్యటిస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రభుత్వంపై ప్రజల స్పందనను తెలుసుకోవడం లక్ష్యంగా ఈ పర్యటనలు ఉంటాయని ఆయన వివరించారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఇ-గవర్నెన్స్, డేటాలేక్, ఆర్టీజీఎస్ అంశాలపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ విషయం తెలిపారు. అర్హులైన వారందరికీ గృహాలను అందించమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉగాది నాడు ఐదు లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు చేస్తామని ప్రకటించారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లలో, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లలో ఇళ్లు కట్టి ఇచ్చేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల కేటాయింపును శ్రీకాళహస్తిలో చేయడం వల్ల తిరుపతికి చెందిన లబ్ధిదారులు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారని కలెక్టరు తెలపగా, వీలైనంతవరకూ లబ్ధిదారులకు సమీపంలోనే భూమిని సేకరించాలని సీఎం ఆదేశించారు. ఒకవేళ భూమి దొరకపోతే, అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి వెళదామని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవల వినియోగాన్ని పెంచాలన్నారు.

కార్పొరేట్ వైద్యం అందిస్తే నష్టమేంటి?

- పీపీపీ విధానంపై వైసీపీకి సీఎం సూటి ప్రశ్న
- రుషికొండను తెల్లఏనుగుగా మార్చారు
- ఆ ఖర్చుతో మరో రెండు కాలేజీలు వచ్చేవి
- పీపీపీపై ఉద్దేశపూర్వక విమర్శలకు వెరవద్దు
- నిజాలను నేరుగా ప్రజలకు చెబుదాం
- కలెక్టర్లు, మంత్రులకు చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందిస్తే వచ్చే నష్టం ఏమిటని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. ఉద్దేశ్యపూర్వకంగా చేసే విమర్శలకు భయపడాల్సిన పని లేదని, ప్రజలకు మంచి అనుకున్నదే, వెనక్కు తగ్గకుండా చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటు నిర్వహణకు ఇవ్వాలని కూటమి సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. వైసీపీ దీన్ని వ్యతిరేకిస్తోంది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలంటూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో దీనిపై కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. వైసీపీ పేరు, ప్రస్తావన తీసుకురాకుండా, కొందరు నాయకులు మెడికల్ కాలేజీలు ప్రైవేటు చేశారంటూ మాట్లాడుతున్నారని సీఎం మండిపడ్డారు. కేంద్రంలోని నీతి ఆయోగ్ ముందడుగు వేసి పీపీపీ, హైబ్రిడ్, వయబులిటీ గ్యాప్ ఫండింగ్ వంటి అనేక విధానాలను తీసుకొచ్చిందన్నారు. ఒక పక్క ప్రజా సంక్షేమం, మరో పక్క అభివృద్ధి చేయాలి కాబట్టే, రాష్ట్రానికి మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటున్నామని, గత ప్రభుత్వంలా నిబద్ధత లేని నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు. "పీపీపీలో ఇచ్చే కాలేజీకి ప్రభుత్వ మెడికల్ కాలేజీ అన్న పేరే ఉంటుంది. పక్కన చిన్న అక్షరాల్లో దాన్ని నిర్వహించే వారి (ప్రైవేటు) పేరు ఉంటుంది. ఆస్తి ప్రభుత్వానిదే. గైడ్‌లైన్స్ ఇచ్చి నియంత్రించేదీ ప్రభుత్వమే. ఇప్పుడున్న దాని కంటే ఎక్కువగా సీట్లు పెరుగుతున్నాయి. 100 శాతం ఔట్ పేషంట్లకు చికిత్స ఉచితం. ప్రభుత్వ ఆస్పత్రుల కంటే ఉత్తమంగా చికిత్స దొరుకుతుంది. ఎన్టీఆర్ వైద్య సేవ నుంచి పంపించిన ఇన్ పేషంట్లు 70 శాతం ఉంటారు. ఒకప్పుడు వీళ్లే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కర్ణాటక, హైదరాబాద్, చెన్నైకి పంపించారు. ఎందుకు? అంటే ప్రభుత్వ సర్వీసులు చాలవనే కదా.? అలాంటప్పుడు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తే మీకు నష్టం ఏమిటి? మీరేమైనా ఈ ప్రాజెక్టులు పూర్తిచేయలేదు కదా?" అంటూ జగన్‌ను ఉద్దేశించి పరోక్షంగా చంద్రబాబు ప్రశ్నించారు. రూ.500 కోట్లు రుషికొండ ప్యాలెస్‌పై పెట్టి, పర్యావరణాన్ని ధ్వంసం చేశారని మండిపడ్డారు. "అదే డబ్బు పెడితే రెండు కాలేజీలు వచ్చేవి. వాళ్లది నిబద్ధత లేని పరిపాలన. నేనయితే ఆ పని చేయను. అలాంటి పని చేయనివ్వను. ఇప్పుడు అది తెల్ల ఏనుగులా తయారయింది." అని ఆందోళన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని, 13-14 శాతం వడ్డీతో అప్పులు తెచ్చారంటూ ధ్వజమెత్తారు. ఇప్పుడు ఆ వడ్డీ భారం అతిపెద్ద సమస్యగా మారుతోందన్నారు. గత ప్రభుత్వం అనాలోచిత ధోరణితో అప్పులు, ఖర్చులు చేసిందని చంద్రబాబు ధ్వజమెత్తారు. అన్ని రాష్ట్రాలూ ఎస్టాబ్లిషమెంట్ ధరలు తగ్గిస్తే ఏపీ అప్పట్లో 100 శాతం చేసిందని, రాష్ట్ర ఆదాయం మొత్తం దానికే సరిపోయిందన్నారు. తాము వచ్చాక ఆర్థిక శాఖను కూర్చోబెట్టి చర్చించి పనితీరు, విశ్వసనీయతను పెంచామని వివరించారు. ఇప్పుడు 9 శాతం వడ్డీకి మించి అప్పులు తీసుకోవడం లేదని, తాము తీసుకుంటున్న చర్యల వల్ల దాదాపు 25శాతం వడ్డీ తగ్గుతోందన్నారు. రుణ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించి స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు తీసుకుంటున్నామని, కొత్తగా సందనను సృష్టించడంతో పాటు, ఆదాయాన్ని కూడా పెంచుకుంటున్నామని వివరించారు. అందువల్ల పీపీపీ విధానంలో ఉన్న నిజాలు ప్రజలకు తెలియజేద్దామని కలెక్టర్లు, మంత్రులకు సీఎం సూచించారు.

సూపర్ సిక్స్ అమలుకు క్యాలెండర్

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించి క్యాలెండర్ రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అమలవుతున్న ముస్తాబు కార్యక్రమాన్ని అన్ని పాఠశాలలకు విస్తరించాలన్నారు. హాస్టళ్లలో ఏం జరిగినా ముందు వార్డెన్లను సస్పెండ్ చేసి, ఆ తర్వాతే మాట్లాడతామని హెచ్చరించారు. పీ4 కింద సంక్షేమ హాస్టళ్లను దత్తత తీసుకునే అంశాన్ని పరిశీలించాలన్నారు. గిరిజన కార్పొరేషన్ ద్వారా కొన్ని హోటళ్లు కట్టి.. వాటి నిర్వహణను కార్పొరేట్లకు ఇస్తే పర్యాటకులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశముందన్నారు. అన్నీ శాఖల్లో ఎస్సీ కాంపోనెంట్ నిధులతో తగిన వసతులు కల్పించాలంటూ కలెక్టర్లను సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్ ఆదేశించారు.



ఇది '4.5' వెర్షన్!

కలెక్టర్ల సదస్సుకు 'కొత్త సిరీస్'

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఇప్పటికి జిల్లా కలెక్టర్ల సదస్సులు నాలుగుసార్లు జరిగాయి. వాటికి... 1, 2, 3, 4 అని పేరు పెట్టారు. బుధవారం మొదలైన కలెక్టర్ల సదస్సు ఐదవది. కానీ... దీనికి '4.5'గా నామకరణం చేశారు. ఏమిటీ కొత్తదనమని ఆరా తీయగా... రెవెన్యూ శాఖ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఇది నాలుగోసారి. ఈ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న 5వ కలెక్టర్ల సదస్సు ఇది. ఆ నాలుగు, ఈ ఐదును కలిపి... సింబాలిక్‌గా '4.5' వెర్షన్ ఖరారు చేశామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. తదుపరి సదస్సును '4.6'గా పిలుస్తామన్నారు.

ఏటా 5 వేల మందికి క్వాంటమ్ శిక్షణ

కలెక్టర్ల సదస్సులో ఐటీ శాఖ కార్యదర్శి వెల్లడి

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2030 నాటికి ఏటా ఐదు వేల మందికి క్వాంటమ్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఐటీశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ వెల్లడించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, యువతకు అమరావతి క్వాంటమ్ అకాడమీ ద్వారా 2030 నాటికి ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి ఇప్పటికే రూ. 2,847 కోట్ల పెట్టుబడులతో 29 ఒప్పందాలు చేసుకున్నామని వెల్లడించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ హార్డ్ వేర్ రంగంలోనూ పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. ఇందుకోసం మరో 200 ఎకరాలు సేకరిస్తున్నామన్నారు. ఐబీఎం నుంచి రెండు క్వాంటమ్ కంప్యూటర్లు రానున్నాయన్నారు. క్వాంటమ్ వ్యాలీ భవనాలు త్వరలోనే పూర్తవుతాయని చెప్పారు. రాష్ట్రంలో రూ. 2,97,707 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నాయన్నారు. రాష్ట్రంలో 6.5 గిగావాట్ డేటా సామర్థ్యాని సాధించడమే లక్ష్యమని తెలిపారు.

గిరిజన ప్రాంతాలపై దృష్టి పెట్టాలి

- అక్కడ పాలనా సామర్థ్యం పెంచాలి
- కేంద్ర పథకాల అమలులో అల్లూరి, మన్యం భేష్
- కలెక్టర్ల భేటీలో డిప్యూటీ సీఎం పవన్ వెల్లడి

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అత్యంత వెనకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై కలెక్టర్లు దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్లను కోరారు. గిరిజన, ఇతర ప్రాంతాల్లో పాలనా సామర్థ్య పెంపు కోసం కృషి చేయాలన్నారు. కేంద్ర పథకాల అమలులో అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాలు 100 శాతం ఫలితాలు సాధించాయంటూ ఆ జిల్లాల కలెక్టర్లను పవన్ అభినందించారు. నాలుగు వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను నిర్మించామని, 1.20 లక్షల ఫాం పాండ్స్ తవ్వి లక్ష్యాలను చేరుకున్నామని వివరించారు. ఇప్పటి వరకు రూ.4,330 కోట్ల మేర ఎంజీ నరేగా ఉపాధి వేతనాలు చెల్లించామని, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయార్జనపై దృష్టి సారించామని పవన్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 41.12 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించామన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ రథం మంచి ఫలితాలు ఇస్తోందని తెలిపారు. కలెక్టర్లు ప్రజలకు నిబద్ధతతో సేవలందించాలని పవన్ సూచించారు.

కేంద్ర నిధులన్నీ ఖర్చు చేయాలి

జనవరి 15వ తేదీ నాటికి మిగిలిపోయిన వాటిని వినియోగించాలి

- నిధుల్లేక ఇబ్బందులు పడుతుంటే అలసత్వమేల?: సీఎం


అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులను కొన్ని శాఖలు కొన్ని జిల్లాల్లో పూర్తి స్థాయిలో వినియోగించకపోవడం సరికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మిగిలిపోయిన కేంద్ర నిధులను జనవరి 15వ తేదీ నాటికి ఖర్చు చేయాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, నిధుల వినియోగంపై కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం సమీక్షించారు. సమగ్ర శిక్ష పథకం కింద రూ.1,363 కోట్లకు గాను రూ.1,259 కోట్లు ఖర్చు పెట్టామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న నిధులను కూడా త్వరితగతిన ఖర్చు పెడతామని చెప్పారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి రూ.1,200 కోట్లు అడిగామని సీఎంకు వివరించారు. పీఎంఏవై-అర్బన్ నిధులు ఖర్చు పెట్టే అంశాన్ని పర్యవేక్షించాలని మంత్రి కొలుసు పార్థసారథిని సీఎం ఆదేశించారు. గతంలో విజిలెన్స్ విచారణ కారణంగా పనులు నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలకు వెసులుబాటు కల్పించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. తద్వారా పీఎంఏవై-అర్బన్ ఇళ్లకు మరింతగా ఖర్చు పెట్టే అవకాశముందన్నారు. వివిధ సీఎస్ఎస్ పథకాల ద్వారా రూ.24,513 కోట్ల విలువైన పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. ఇంకా రూ.6,252 కోట్ల నిధులు ఖర్చు పెట్టలేదని అన్నారు. ప్రభుత్వ శాఖలు కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకోవడంలో ఎందుకు వెనకబడుతున్నాయని ప్రశ్నించారు. ఏడాది చివరిలో కేంద్రంలోని వివిధ శాఖల వద్ద నిధులు ఉండిపోతున్నాయని.. వాటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. పీఎంఏవై-అర్బన్‌లో కేవలం 38 శాతం ఖర్చు చేయడమేంటన్నారు. జనవరి నాటికి పీఎంఏవై-అర్బన్‌లో 75 శాతం నిధులు ఖర్చు చేస్తే అదనంగా కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవచ్చని అన్నారు. జిల్లా కలెక్టర్లు కూడా ఈ నిధులను త్వరితగతిన ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు, రాష్ట్ర కృషీ వికాస్ యోజన కింద కూడా త్వరితగతిన నిధులు వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన మిగతా నిధులను కూడా కేంద్రం నుంచి సాధించే అవకాశం ఉంటుందన్నారు. నిధుల్లేక ఓ వైపు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర పథకాల నిధులను ఖర్చు చేయకపోవడమేమిటని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రం కేటాయించిన రూ.24,513 కోట్ల నిధులను ఖర్చు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రం నిధులు ఖర్చు చేస్తే మరో రూ.5-6 వేల కోట్లు అదనంగా తెచ్చుకుందామన్నారు.

కేంద్రంతో సంప్రదించాలి

ఈ ఏడాది కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రూ.30 వేల కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని చంద్రబాబు సూచించారు. కేంద్రంలోని సంబంధిత మంత్రులతో టచ్‌లోకి వెళ్లాలన్నారు. బడ్జెట్ తయారీ సమయంలోనే కలిస్తే ఏపీకి అదనంగా నిధులు సాధించుకునే అవకాశముంటుందన్నారు. 63 వేల ప్రభుత్వ ఖాతాలు ఇన్‌యాక్టివ్‌గా ఉన్నాయని, వాటిలో రూ.155 కోట్ల మేర నిధులు బ్యాంకుల్లో ఉండిపోయాయని చెప్పారు. ఆ నిధులను విత్‌డ్రా చేయించాలని, బ్యాంకుల్లో ఉండిపోయిన నిధులకు వడ్డీ వచ్చేలా చూడాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఆడిట్లు త్వరలోనే పూర్తి కావాలన్నారు. నిర్మాణ సంస్థలను, ఏజెన్సీలను ప్రతి పది రోజులకు ఒకసారి పిలిచి సివిల్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. వారాల తరబడి స్పందించకపోతే వాళ్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు.

రోజూ పిటిషన్లు తీసుకోండి: అనగాని

ప్రభుత్వం అంటే కలెక్టర్లేనని ప్రజలు భావిస్తున్నారని, వారి నమ్మకం నిలబెట్టేలా జాగ్రత్తగా పనిచేయాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కలెక్టర్లకు సూచించారు. వారంలో ఒక రోజు కాకుండా, ప్రతీరోజు ప్రజల నుంచి పిటిషన్లు తీసుకోవాలన్నారు. జిల్లాల పాలన పారదర్శకంగా, అంతిమంగా ప్రజా సంతృప్తి స్థాయిని పెంచే దిశగా ఉండాలని కోరారు. పరిశ్రమలకు ఇస్తున్న భూములకు, ప్రజల నుంచి సేకరిస్తున్న భూములకు సంబంధించి.. వివాదాలు లేకుండా చూడాలని అనగాని సూచించారు. రెవెన్యూ సంస్కరణలు క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలయ్యేలా చూడాలని కలెక్టర్లను కోరారు.



డిప్యూటీ సీఎం పవన్‌తో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పక్కన మంత్రులు పయ్యావుల, అచ్చెన్న

రెవెన్యూపై స్పందనలో కోనసీమ, కాకినాడ బెస్ట్

అధమస్థానంలో అనంత, పశ్చిమగోదావరి.. అర్జీల పరిష్కారంలో సగటు సంతృప్తి 53.39%

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే దరఖాస్తుల పరిష్కారం, తిరస్కారంలో కొన్ని జిల్లాలు ముందుంటే, మరికొన్ని అధమస్థానంలో నిలిచాయి. ఈ ఏడాది మార్చి నుంచి అక్టోబరు వరకు ప్రజల నుంచి 32,866 దరఖాస్తులు సీసీఎల్ఏకు వచ్చాయి. పరిష్కారం కోసం వీటిని ఆయా జిల్లాలకు పంపించారు. దరఖాస్తుల పరిష్కారంలో 74.24 శాతంతో కోనసీమ అగ్రస్థానంలో నిలిచింది. 73.40 శాతంతో కాకినాడ జిల్లా రెండో స్థానం దక్కించుకుంది. ఇక, అతి తక్కువ స్థాయిలో 69.86 శాతంతో అనంతపురం చివరి స్థానంలో ఉంటే, అత్యంత తక్కువస్థాయిలో 63.7 శాతంతో పశ్చిమగోదావరి నిలిచింది. దీనిని బట్టి, అర్జీల పరిష్కారంలో సగటున 53.39 శాతమే సంతృప్తి వ్యక్తమైంది. గత 15 నెలల కాలంలో మ్యుటేషన్‌ల కోసం 15,23,656 విన్నపాలు వస్తే, వీటిలో 3,45,612(23.65 శాతం) తిరస్కరించారు. ఇలా తిరస్కరించిన వాటిలో తొలిస్థానంలో విజయనగరం, తర్వాత నెల్లూరు, విశాఖ జిల్లాలు ఉన్నాయి. 'మీ భూమి' రికార్డుల్లో భూమి స్వభావం మార్చాలని 1.01 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో పార్వతీపురంమన్యం, కర్నూలు, శ్రీకాకుళం నుంచి ఎక్కువగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజల భూ సమస్యలకు పరిష్కారంగా ప్రభుత్వం ఇప్పటికే కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. జేసీలకు ఉన్న కొన్ని అధికారాలను ఆర్‌డీవో, తహసీల్దార్‌లకు బదిలీ చేయాలని, సర్వే అనంతరం వచ్చే విస్తీర్ణంలో తేడాలను రైతులకు అనుకూలంగా సెటిల్ చేయాలని నిర్ణయించింది.

51% కూటమి పాలనపై మంది సంతృప్తి

- వారికి ఏ సమస్యా లేదు.. ఇది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం
- 49 శాతం ప్రజలకు పలు సమస్యలు
- గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన వాటిపైనే అసంతృప్తి
- అసంతృప్తిలో రెవెన్యూదే అగ్రస్థానం: సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై 51 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని, తమకు ఎలాంటి సమస్యలు లేవని చెప్పారని సీఎం చంద్రబాబు తెలిపారు. వివిధ మార్గాల్లో సేకరించిన సర్వేల ఆధారంగా ప్రజల సంతృప్తిని అంచనా వేసినట్టు వెల్లడించారు. 51 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీఎం చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న సేవలతో సంతృప్తిగా ఉన్నామని 51 శాతం మంది చెప్పడం సర్కారు సాధించిన అతిపెద్ద విజయమని తెలిపారు. అయితే, రెవెన్యూ శాఖపై ప్రజలు అసంతృప్తి తీవ్రస్థాయిలో ఉందన్నారు. ప్రజల సంతృప్త స్థాయిని మరింత పెంచేందుకు మంత్రులు, శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు, కలెక్టర్లు, అధికారులకు కలిసి పనిచేయాలని సూచించారు. సీఎం వెల్లడించిన వివరాల ప్రకారం పలు అంశాల్లో ప్రజల సంతృప్త స్థాయి ఇదీ..

- రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి బాగోలేదని 17 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఏజెన్సీ ప్రాంతాల్లోని రోడ్లు ఉన్నాయి. కాగా, ఇది వారసత్వంగా గత వైసీపీ ప్రభుత్వం నుంచి వచ్చిన సమస్య అని సీఎం చంద్రబాబు తెలిపారు.
- పట్టణాలు, కార్పొరేషన్లు, గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ సరిగా లేదని సర్వేలో తేలింది. సర్వేలో పాల్గొన్నవారిలో 5.3 శాతం మంది ఈ సమస్యను ప్రస్తావించి అసంతృప్తి వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి చెప్పారు.
- గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని 4.3 శాతం మంది తెలిపారు.
- ఇంటి నిర్మాణం సహా స్థలం కావాలని కోరినా తమ విన్నపాలు పట్టించుకోవడం లేదని 3.8 శాతం మంది పేర్కొన్నారు.
- రాష్ట్రంలో నిరుద్యోగంపై 3.3 శాతం మంది అసంతృప్తి వెలిబుచ్చారు. తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.
- వ్యవసాయ రంగంలో ప్రభుత్వం నుంచి ఆశించిన మద్దతు, స్పందన లేదని 2.4 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు.
- కొత్తగా పింఛన్లు కోరుకుంటున్నవారి సంఖ్య 2 శాతంగా ఉంది.
- రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సరిగ్గా అమలు కావడం లేని 1.1% మంది చెప్పారు.
- భూ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఇది 1.3 శాతంగా ఉంది.
- విద్యుత్ చార్జీల భారం, కోతలు ఉన్నాయని 0.4 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యారంగంలో ఆశించిన విధంగా పనులు జరగడం లేదని 0.4 శాతం మంది, ప్రభుత్వ రంగ సంస్థలు అభివృద్ధి చెందడం లేదని 0.3 శాతం మంది చెప్పారు.




జిల్లా కలెక్టర్ల సమావేశంలో అధికారులు


జిల్లా కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సీఎస్, డీజీపీ, మంత్రులు ఫరూక్, అనగాని, లోకేశ్, అచ్చెన్న, నాదెండ్ల, అనిత, నిమ్మల

ఈసారి 17.11% వృద్ధి!

ఫలితాల కోసం విద్యార్థిలా ఎదురుచూస్తా: సీఎం

వ్యవసాయ రంగానికి ఎంత చేస్తున్నా చేయాల్సింది ఇంకా ఉంటుంది: సీఎం

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో సాధించిన త్రైమాసిక ఫలితాలపై పరీక్షలు రాసిన విద్యార్థిలా ఎదురుచూస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో చెప్పారు. ఈసారి వృద్ధి లక్ష్యాన్ని 17.11 శాతంగా పెట్టుకున్నామని.. దీనికి అనుగుణంగా అధికారులు పనిచేసి, లక్ష్యాలు చేరుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి యూనిట్, ప్రతి శాఖలో సామర్థ్యాలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని.. వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి ప్రగతిలో.. కలెక్టర్లు , ఉన్నతాధికారుల పనితీరులో కచ్చితమైన మెరుగుదల కనిపించాలని స్పష్టంచేశారు. 'అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా కొన్ని ప్రాంతాలకు చేయూతనిస్తున్నాం. గడచిన 2 త్రైమాసికాల్లో మెరుగైన ఫలితాలు సాధించగలిగాం. మొత్తం 17 విభాగాల్లో మనం ఫలితాలు సాధిస్తేనే జీఎస్‌డీపీ పెరుగుతుంది. జీఎస్‌డీపీ సాధనలో ప్రణాళిక అత్యంత కీలకం. జిల్లా స్థాయిలో పక్కా ప్లాన్లు రూపొందించుకోవాలి. పశుసంపద, ఉత్పాదక రంగం, ఫిషింగ్ తదితర రంగాల్లో ప్రగతి సాధించాలి. వ్యవసాయం ఎప్పుడూ డిమాండ్ ఆధారంగా ఉండాలి. పశుగ్రాసం పెంపకంలో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేయండి. గతంలో తెలంగాణతో పోటాపోటీగా ఉండేవాళ్లం. గత ప్రభుత్వం అవలంబించిన తప్పుడు విధానాలతో ఏపీ దక్షిణ భారతంలో చివరిస్థానానికి చేరింది. వృద్ధి సాధించి మళ్లీ అగ్రస్థానానికి చేరుకోవాలి. 2024 తర్వాత జీఎస్‌డీపీ కాస్త మెరుగుపడింది. వ్యవసాయంపై బాగా దృష్టి సారించాలి. ఈ రంగానికి ఎంత చేస్తున్నా చేయాల్సింది ఇంకా మిగిలే ఉంటుంది. మార్కెటింగ్ ఇంటెలిజెన్స్‌ను బలోపేతం చేయాలి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు మన ఉత్పత్తులు పంపేలా చేయగలిగితే వ్యవసాయ రంగం సుస్థిరత సాధిస్తుంది. ఉద్యాన పంటల్లో మనమే నంబర్ వన్‌గా ఉన్నాం. అయినా ఈ రంగంలో కూడా భారీగా రూ.60-70 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు రావలసిన అవసరం ఉంది. వ్యవసాయంలో మూడు సీజన్లు స్వల్పకాలిక, ఐదేళ్ల కాలంతో పాటు మధ్య 10-15 ఏళ్లకు దీర్ఘకాలిక ప్రణాళికలను తయారుచేసుకోవాలి. డిమాండ్ ఉన్న పంటలు, నీటిభద్రత, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్ లాంటి 10 సూత్రాలను వ్యవసాయ రంగంలో భాగం చేయాలి. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పూర్వోదయ కింద అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నాం. 2047కు ఏపీ అగ్రస్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఏ ఒక్కరు వెనుకబడినా లక్ష్యాలను చేరుకోవడం కష్టతరమవుతుంది. గేట్స్ ఫౌండేషన్, అగ్రివాచ్ లాంటి సంస్థల సేవలను వినియోగించుకుని రైతులకు లాభసాటిగా ఉండేలా చర్యలు తీసుకోండి. నాణ్యమైన ఉత్పత్తులను పండించేలా వారికి అవగాహన కల్పించాలి' అని సీఎం సూచించారు.

విశాఖ ఒప్పందాలపై దృష్టి: మంత్రి లోకేశ్

విశాఖ పెట్టుబడుల సదస్సులో చేసుకున్న ఒప్పందాలు అమల్లోకి వచ్చేలా భూ కేటాయింపులు చేపట్టాలని మంత్రి లోకేశ్ కలెక్టర్లను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు దీనిపై దృష్టి సారించాలన్నారు. ఐటీ, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ మంత్రులు ఈ ఒప్పందాలు అమల్లోకి తెచ్చేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ అవస్థలకు తక్షణమే స్వస్తి!

- బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ తెస్తున్నాం: ముఖ్యమంత్రి
- ఫైళ్ల పరిష్కారమంటే.. కిందకు తోసెయ్యడమే!
- తన వద్ద లేకుండా ఇతరులకు పంపేస్తున్నారు
- దీనివల్లే ప్రజల్లో సంతృప్తి రావడం లేదు: సీఎం

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూలోని దురవస్థలకు ఈ రోజే, తక్షణమే ముగింపు పలకాలని స్పష్టంచేశారు. ఫైళ్ల పెండింగ్‌కు సంబంధించి 'పెండింగ్ పెద్దన్న' శీర్షికన ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫైళ్ల పరిష్కారం తీరుపై సీఎం కలెక్టర్ల సదస్సులో కీలక వ్యాఖ్యలు చేశారు. 'కొన్ని శాఖలు వ్యవస్థాగత లోపాలతో వ్యవస్థను దుర్వినియోగం చేయడం వల్ల కొన్ని సమస్యలు వచ్చాయి. రెవెన్యూ సమస్యలూ అందులో భాగమే. ఫైలు పరిష్కారమంటే.. పై నుంచి కిందకు తోసెయ్యడమే! తన వద్ద ఫైలు లేకుండా వేరే వాళ్లకు పంపించేయడమనే ధోరణికి వచ్చారు. దీంతో రెవెన్యూ సేవలపై ప్రజల్లో సంతృప్తి రావడం లేదు. అందుకే ఇప్పుడు రెవెన్యూలో ఫైల్ సిస్టమ్‌ను ట్రాక్ చేస్తున్నాం. ఎవరు ఏ విధంగా ఫైలు పరిష్కరిస్తున్నారో తెలుసుకుంటున్నాం' అని తెలిపారు. రెవెన్యూలో కీలకమైన లింక్ ఫైళ్లు మాయమయ్యాయని, ప్రస్తుతం ఉన్న విధానంలో ఏ ఫైలు ఎక్కడికి వెళ్లిందో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యవస్థకు ఈరోజే ముగింపు పలకాలని, ఇందుకోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ తీసుకొస్తున్నామని తెలిపారు. 'దీనివల్ల ఫైలుపై ఎవరు ఏం రాసినా అందులో ఉంటుంది. దానిని తీసివేయలేరు. రేపటి రోజు ఆ అధికారి తప్పుచేశారు.. దుర్బుద్ధి ప్రదర్శించారంటే ఆటోమేటిగ్గా తెలిసిపోతుంది' అని చెప్పారు. ప్రభుత్వంలో ఒక శాఖ అద్భుతంగా పనిచేస్తే, మరో శాఖ దాన్ని అందుకోలేకపోతోందన్నారు.

గూగుల్‌కు లోకేశ్ బీజం వేశారు..

మంత్రి లోకేశ్ గతంలో ఎప్పుడో అమెరికా వెళ్లినప్పుడే గూగుల్ రాక కోసం విత్తనం వేశారని ముఖ్యమంత్రి చెప్పారు. గ్రీన్ ఎనర్జీ ఓ సానుకూల అంశమని.. అందుకే గూగుల్ ఆలోచించి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో వస్తోందని.. ప్రభుత్వ పట్టుదలకు, పనితీరుకు ఇదే నిదర్శనమన్నారు.

కేంద్రం సీఎస్ఎస్ లెక్కలడిగింది..

కూటమి అధికారంలోకి రాకముందు కేంద్ర ప్రాయోజిత పథకాలు(సీఎస్ఎస్) పనిచేయకుండా పోయాయని సీఎం చెప్పారు. ఈ స్కీములను పునరుద్ధరించి సాయం చేయాలని ఢిల్లీ వెళ్లి కేంద్రాన్ని కోరితే.. తనకో కౌంటర్ విష్‌లిస్టు ఇచ్చారని తెలిపారు. 'మీ దగ్గర సీఎస్ఎస్ స్కీముల అకౌంట్స్ సరిగా లేవు.. మీ రాష్ట్రానికి డబ్బులిచ్చాం.. ముందు వాటికి లెక్కలు చెప్పండి తర్వాత మీ కోరికలపై మాట్లాడదామని కేంద్రం చెప్పింది. వెంటనే ఢిల్లీ నుంచి వచ్చి ఆ పథకాల వివరాలు చూశాం. డబ్బుల్లేవు.. దీంతో దశల వారీగా క్లియర్ చేసి.. స్కీములను పట్టాలెక్కించాం' అని వెల్లడించారు.

ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు

ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు సూపర్‌సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని సీఎం చెప్పారు. 'గతంలో ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేదు. కానీ మేం వచ్చాక సమస్యలను పరిష్కరించి ఒకటో తేదీనే ఇస్తున్నాం. ఒకవేళ ఆ రోజు సెలవైతే ముందు రోజే ఇస్తున్నాం. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తున్నాం. కొందరికి ఆరుగురు, ఏడుగురు పిల్లలున్నా ఇస్తున్నాం. వారు భవిష్యత్ దేశభక్తులు. అన్నదాత సుఖీభవలో రెండో దశ చెల్లింపులు చేశాం. దీపం-2, స్త్రీశక్తి. మెగా డీఎస్సీ, కానిస్టేబుళ్ల నియామకాలు చేపట్టాం. ఇతర సంక్షేమ పథకాలను కూడా దారిలోకి తీసుకొచ్చాం. సూపర్‌సిక్స్‌పై ప్రజా సంతృప్తిస్థాయి 96 శాతం రావాలి' అని కలెక్టర్లకు సూచించారు.

15 వేలు వస్తున్నా..

ఓ వ్యక్తికి రూ.15 వేలు పింఛనుగా వస్తోందని, ఇంకా పెంచాలని తనను కోరారని సీఎం ప్రస్తావించారు. 'మంగళవారం టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి పిటిషన్లు తీసుకుంటుండగా ఓ వ్యక్తి నా వద్దకు వచ్చారు. తనకొస్తున్న పింఛను సరిపోవడం లేదని.. ఇబ్బందులు ఉన్నాయని, ఇంకా పెంచాలని అడిగారు. అందులో తప్పులేదు. అదొక ఆశ. కానీ మనం వారికి నచ్చజెప్పాలి' అని వ్యాఖ్యానించారు.

ఇదీ ప్రభుత్వం అంటే..

పోలీసు కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే సమావేశంలో జరిగిన సంఘటన గురించి సీఎం ప్రస్తావించారు. 'కానిస్టేబుల్‌గా ఎంపికైన బాబూరావుతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడినప్పుడు.. మా ఊరికి రోడ్డులేదని కానిస్టేబుల్ చెప్పారు. ఆ వెంటనే ఆయన డిపార్ట్‌మెంట్‌కు మెసేజ్ చేయగా ఆ ఊరికి రోడ్డు వేయడానికి రూ.3.9 కోట్లు ఖర్చవుతుందని అంచనావేశారు. దీంతో పవన్ నన్నడిగారు. వెంటనే అక్కడికక్కడే రోడ్డు మంజూరు చేశాం. ఆ మీటింగ్‌లోనే ప్రకటించాం. ఇదీ స్పందన అంటే. బాధ్యత కలిగిన ప్రభుత్వం అంటే ఇదీ' అని అన్నారు. విభిన్న రంగం నుంచి వచ్చినా పవన్ స్ట్రగుల్ అవుతున్నారని చెప్పారు.


కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అనగాని, లోకేశ్ సరదా సంభాషణ

పర్యాటకానికి తొలి ప్రాధాన్యం

- కంపెనీలకు భూ కేటాయింపులపై సీఎం దిశానిర్దేశం
- భూ కేటాయింపుల్లో కలెక్టర్లు చొరవ తీసుకోవాలి
- విజయవాడ, విశాఖలో భూ వివాదాలపై ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు భూ కేటాయింపుల్లో పర్యాటక శాఖకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. టూరిజం తర్వాత ఐటీ కంపెనీలకు భూములు ఇవ్వాలన్నారు. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన కంపెనీలకు భూముల కేటాయింపు అంశంపై కలెక్టర్ల సదస్సులో సీఎం సమీక్షించారు. ఏపీఐఐసీలో ఏ మేరకు భూమి అందుబాటులో ఉందనే అంశం చర్చకు వచ్చినప్పుడు.. ఏపీఐఐసీకి చెందిన సుమారు 82 వేల ఎకరాలు 22ఏ పరిధిలోకి వెళ్లాయని అధికారులు చెప్పారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుంటే ఆ భూములను 22ఏ పరిధి నుంచి తప్పించేందుకు క్యాబినెట్ సమావేశానికి తీసుకురావాలని సూచించారు. ఆయా జిల్లాల్లో పెట్టుబడుల ప్రతిపాదనలపై కలెక్టర్లు తీసుకోవాల్సిన చర్యలపై చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. "గడిచిన 18 నెలల్లో రూ. 8.55 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదం తెలిపాం. వీటికి సంబంధించిన ప్రాజెక్టుల్లో కొన్ని సివిల్ పనులు కూడా మొదలయ్యాయి. భూ కేటాయింపులకు సంబంధించిన అంశాల్లో కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. విజయవాడ, విశాఖపట్నంలోని భూ వివాదాలను త్వరగా పరిష్కరించడానికి ట్రైబ్యునల్ ఏర్పాటు చేయండి. ర్యాంప్ పథకంలో ఎంఎస్ఎంఈల వృద్ధిని నమోదు చేయండి. 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యాన్ని సాధించేందుకు ఎంఎస్ఎంఈలతో సమావేశాలు ఏర్పాటు చేయండి. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్రాజెక్టులకు భూ కేటాయింపులు పూర్తి చేయండి. అసైన్డ్ భూములకు కూడా రూ. 31 వేలు లీజు చెల్లించండి. నెడ్‌క్యాప్ ద్వారా ఈ భూములు లీజుకు ఇచ్చే అవకాశం ఉంది. విశాఖ, తిరుపతి, అమరావతి ప్రాంతాల్లో మంచి విద్యాసంస్థలు తీసుకొచ్చేందుకు కృషి చేయాలి. హోటళ్లు, టూరిజం ప్రాజెక్టులు పెద్దఎత్తున చేపట్టేలా చర్యలు తీసుకోండి' అని చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ టూరిజం అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖలో అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటుకు వండర్‌లా, తిరుపతిలో ఇమాజికా వరల్డ్ థీమ్ పార్క్ ఏర్పాటుకు ముందుకువచ్చాయని తెలిపారు. వండర్‌లా విశాఖలో 50 ఎకరాలు, ఇమాజికా వరల్డ్‌కు తిరుపతిలో 20 ఎకరాలు అవసరమన్నారు. టూరిజం ప్రాజెక్టులకు భూ కేటాయింపులపై ఎదురవుతున్న సమస్యల గురించి ప్రస్తావించారు. టూరిజం కోసం ఇచ్చిన భూములను తిరిగి ఇతర శాఖలకు కేటాయించిన సందర్భాలు ఉన్నాయన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భూ కేటాయింపుల్లో టూరిజానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మొదట బస, తర్వాత పని అన్నట్లు భూ కేటాయింపులు ఉండాలని సూచించారు. హోటళ్లకు ప్రాధాన్యం ఇవ్వడం గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం ఇవ్వాలి

ఫుడ్ ప్రాసెసింగ్‌లో కనీసం రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈరంగంలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమైతే.. 22 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 వేల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వస్తాయని, ఈ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా డ్వాక్రా గ్రూపులను ప్రోత్సహించాలని కలెక్టర్లను ఆదేశించారు. తాను దావోస్‌కు వెళ్లే ముందే విశాఖ సదస్సుకు సంబంధించిన ప్రాజెక్టుల గ్రౌండింగ్ ప్రక్రియ మొదలు కావాలన్నారు. 175 నియోజకవర్గాల్లో అభివృద్ధి చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈ ప్రాజెక్టులను ప్రారంభించేలా మంత్రులు, కలెక్టర్లు కలిసి కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు భూములిచ్చేవారు కూడా సంతోషంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సేవల రంగం కూడా మరింత అభివృద్ధి చెందాలన్నారు. గిగ్ వర్కర్ల కోసం సదుపాయాలు కల్పించేలా కలెక్టర్లు కృషి చేయాలని కోరారు. నైపుణ్యాలను పెంపొందించి యువతకు ఉద్యోగాల కల్పనపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారకానికి మచిలీపట్నంలో రెండెకరాల భూమిని కేటాయించాలని సీఎం ఆదేశించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు సమీపంలో టౌన్‌షిప్ అభివృద్ధి చేయాలన్నారు. కాగా, పెట్టుబడుల ప్రతిపాదనలపై పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో సంపద సృష్టితోపాటు నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు నెల రోజుల్లో శంకుస్థాపనలు చేయాలని కలెక్టర్లను కోరారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ. 13.26 లక్షల కోట్ల విలువైన 538 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని, జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల్లో ఆయా ప్రాజెక్టులను గ్రౌండ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.



'అగ్రి'లో రాష్ట్రం అగ్రపథం

వ్యవసాయ అనుబంధ రంగాల్లో భారీ వృద్ధి

జాతీయ స్థాయిలో 1.8.. రాష్ట్రంలో 10.70%

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోంది. 2025-26 రెండో త్రైమాసికంలో జాతీయ స్థాయి వృద్ధికంటే అత్యధిక శాతం సాధించింది. ప్రస్తుతం జాతీయ వృద్ధి 1.8 శాతం ఉండగా, ఏపీలో 10.70 శాతంగా నమోదైంది. ఇదే సమయంలో ప్రస్తుత ధరల వద్ద స్థూల విలువ జోడింపు(జీవీఏ) జాతీయ స్థాయిలో రూ.10,55,598 కోట్లు ఉండగా, రాష్ట్రంలో రూ.1,25,577 కోట్లుగా నమోదైంది. గత మూడేళ్లలో రెండో త్రైమాసికం(జూలై నుంచి సెప్టెంబరు)లో వ్యవసాయ రంగ జీవీఏను పరిశీలిస్తే.. 2023-24లో రూ.99,262 కోట్లు, 24-25లో 1,13,441 కోట్లు ఉండగా,25-26లో రూ.1,25,577 కోట్లకు చేరింది. ఆక్వాలో 26.27% వృద్ధి రేటు నమోదవగా, వ్యవసాయంలో 11.43%, ఉద్యాన రంగంలో 4.35%, పశుసంవర్ధకంలో 4.18%, అటవీ, కలప ఉత్పత్తుల్లో 5.59% వృద్ధి నమోదైంది. అయితే, రెండో త్రైమాసికంలో వరి ఉత్పత్తి 24% పెరిగి, 2.93 లక్షల టన్నుల నుంచి 3.64 లక్షల టన్నులకు చేరింది. పత్తి ఉత్పత్తి 31% వృద్ధి చెందింది. అరటి ఉత్పత్తిలో 151% వృద్ధి సాధించింది. మత్స్య రంగం మరింత వృద్ధి చెందింది. రొయ్యల ఉత్పత్తి 5.47 లక్షల టన్నుల నుంచి 6.95 లక్షల టన్నులకు(27%) పెరిగింది. మాంస ఉత్పత్తి 8%, కోడి గుడ్ల ఉత్పత్తి 6.7% పెరిగాయి. 2025-26లో వ్యవసాయ అనుబంధ రంగాల్లో వృద్ధి రేటు 16.47శాతంతో జీవీఏ రూ.6,02,278 కోట్లు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు తొలి 6 నెలల్లో జీవీఏ రూ.2,07,073 కోట్లు(34.36శాతం) మాత్రమే సాధించింది. దీంతో అక్టోబరు నుంచి మార్చి వరకు మిగతా జీవీఏ రూ.3,95,655 కోట్లు(65.64 శాతం) సాధించాలని ప్రభుత్వం అధికారులకు నిర్దేశించింది.

జూలై నుంచి సెప్టెంబరు వరకు వ్యవసాయ అనుబంధ రంగాల ప్రగతి

శాఖ	జీవీఏ (రూ.కోట్లలో)	వృద్ధి(%)
వ్యవసాయం	1,784	11.43
ఉద్యానపంటలు	39,624	4.35
పశుసంవర్ధకం	40,687	4.18
అటవీ, కలప	2,411	5.59
ఆక్వా	41,070	26.27

ప్రజలు మెచ్చాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల్లో ఆశించిన స్పందన లేదు." అంటూ స్పష్టమైన గణాంకాలు వినిపించారు. బుధవారం సచివాలయంలో మొదలైన జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడూ కలెక్టర్లు, ఇతర అధికారులపై పల్లెత్తు మాట అనని, వారిపై మాట పడనివ్వని చంద్రబాబు, దానికి భిన్నంగా తొలిసారి వారి విషయంలో వాస్తవిక పరిస్థితి ఏమిటనేది స్పష్టం చేశారు. కలెక్టర్ల పనితీరు, జిల్లాల్లో ప్రజా సంతృప్తి స్థాయి, సంక్షేమ పథకాల అమలు, ఇంకా పరిపాలన, ఈ-ఫైల్ విధానం, రెవెన్యూ అంశాలపై సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం ఏమన్నారనేది...ఆయన మాటల్లోనే...

సంతృప్తి స్థాయే ముఖ్యం...

"సుస్థిర అభివృద్ధి సాధన కోసం జరిగే పాలనలో ప్రజల సంతృప్తి స్థాయే ముఖ్యం. కానీ ప్రజా సంతృప్తితో సంబంధం లేకుండా మనం పనిచేస్తున్నాం. అందుకే నాతో సహా అందరం మనం చేసే పని వల్ల ప్రజలు మనతో కలిసి వస్తున్నారా, లేదా లేనేది చూడాలి. మీ జిల్లా, గ్రామీణ డేటా అంతా మీకు అందుబాటులో ఉంది. ఎక్కడ ఏ సమస్య ఉందో తెలుసుకోవడం చాలా సులభం. హార్డ్ వర్క్ కాదు..స్మార్ట్ వర్క్ చేసి ప్రజలను మెప్పించాలి."

క్లియరెన్స్‌ల్లో మీ స్పీడ్ చూస్తా..

"కూటమి ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకంతో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. వేగంగా ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నాం. కానీ వాటికి అవసరమైన క్లియరెన్స్‌లన్నీ ఆలస్యమవుతున్నాయి. ప్రాజెక్టుల కోసం కొంతమంది తిరిగీ తిరిగీ మానేస్తున్నారు. ఇకపై ఏ కలెక్టరు ఏ ప్రాజెక్టును ఎంత స్పీడ్‌గా తీసుకెళ్లారో చూస్తా. పెట్టుబడులను పెట్టేవారిని తక్కువగా చూడటం సరి కాదు. ఏ రాష్ట్రానికీ రాని పెట్టుబడులు ఇక్కడకు వస్తున్నాయంటే మన విధానాలే అందుకు కారణం కలెక్టర్లుగా మీరు బాగా పనిచేస్తే అది ఆచరణలో కనిపించాలి. అది ప్రజలకు స్పష్టంగా, ప్రభావవంతంగా కనిపించాలి. అలా కాకుండా ఏదో పనిచేశామని 4 సార్లు ప్రెస్ మీట్‌లు పెట్టి చెప్పడం వల్ల ఏం ఉపయోగం? ఇది నాకు కూడా వర్తిస్తుంది. నేను ఇప్పుడు మాట్లాడినదానిపై తర్వాత రివ్యూ చేసుకుంటా. ప్రతి నిమిషం చెక్ చేసుకుంటా. మీరు కూడా పనిచేసిన తర్వాత ఆ ఫలితం ఎలా ఉంది....ప్రజలకు చేరిందా, లేదా.. అనేది సమీక్ష చేసుకోండి."

ప్రభుత్వానికి పేరు తీసుకురావాలి..

"జిల్లాల్లో సానుకూల వాతావరణం ఏర్పడాలంటే అది కలెక్టర్లపైనే ఆధారపడి ఉంటుంది. మంత్రులు ప్లానింగ్ బోర్డు ఛైర్మన్‌లుగా, రాజకీయ పెద్దలుగా (పొలిటికల్ హెడ్) ఉంటారు. ప్రభుత్వ పనితీరు, ఫలితాలు మంత్రి ద్వారానే జిల్లాలోని ప్రజలకు చేరాలి. బెస్ట్ కలెక్టర్‌గా మీరుండాలి. అలాగే ప్రభుత్వానికి పేరు రావాలి. ఈ రెండూ జరగాలి. లేదంటే, మీరు బాగా పనిచేయవచ్చు గానీ, దానివల్ల ఫలితం ఉండదు. ఓ కంప్యూటర్ చిప్‌లా ఆలోచించాలి. ఒకప్పుడు ఆంధ్ర అంటే రైటాఫ్. ఇప్పుడు ఏపీ అంటే... 'అక్కడ అభివృద్ధి జరుగుతోంది... గూగుల్ వచ్చింది... పరిపాలన బాగుంది... సీఐఐ సమ్మిట్ బాగా జరిగింది... ఇప్పుడిప్పుడే ఓ ప్రభావం కనిపిస్తోంది..' అని అనుకుంటున్నారు. ఏపీ గురించి దేశమంతా మాట్లాడుకోవాలి. ప్రపంచం అంతా మనవైపు చూసే పరిస్థితి రావాలి. ఏపీలో ఏఐ ఉంది. డేటా సెంటర్లు వస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటర్, వాటి ఉత్పత్తి వస్తోంది. స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్, ఏరో స్పేస్ సిటీలు, సెమీకండక్టర్ లు వస్తున్నాయి. ప్రపంచంలో డేటాలేక్ పెట్టి సమాచారాన్ని ఒక్క ఏపీలోనే ఇంటిగ్రేట్ చేయడం జరుగుతోంది."

రోడ్ బ్లాకర్‌గా మారొద్దు


"అభివృద్ధికి అడ్డుగా ఉన్న రోడ్ బ్లాక్‌లను క్లియర్ చేస్తున్నాం. కానీ మీరే రోడ్‌బ్లాక్‌గా తయారు కావొద్దు. సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోండి. ప్రభుత్వంలో నేను, పవన్ కల్యాణ్, బీజేపీ వ్యక్తిగత ఇష్టాయిష్టాల కంటే పనితీరుతో కూడిన పరిపాలనకే ప్రాధాన్యం ఇస్తాం. మాకు రాగద్వేషాలు లేవు. పారదర్శకత కోసమే కలెక్టర్ల సదస్సును లైవ్ ఇస్తున్నాం. ఇది జిల్లా యంత్రాంగం చూడాలని ఆన్‌లైన్‌లోకి తీసుకున్నాం. రహస్యంగా మీ 26 మందితో మాట్లాడి, మేం 100 మందిమి మిమ్మల్ని ఒత్తిడి చేసే బదులు, పారదర్శకంగా ఉండాలనే లైవ్ ఇస్తున్నాం. వచ్చే జనవరి నుంచి ప్రభుత్వంలో ఫైళ్లన్నీ ఆన్‌లైన్ పరిధిలోకి వస్తాయి. రాబోయేది డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునే విధానం. దాని ఆధారంగానే కీలక నిర్ణయాలు ఉంటాయి."

నమ్మకం చేతలతోనే వస్తుంది

"ప్రభుత్వంపై నమ్మకం మాటలతో కాదు, చేతలతోనే వస్తుంది. ఒక వ్యక్తి లేదా కంపెనీ, ప్రభుత్వానికి విశ్వసనీయత ఉంటుంది. దీంతో కాలానుగుణంగా ఓ నమ్మకం వస్తుంది. దాన్ని మనం నెలకొల్పాలి. ఇన్ని పెట్టుబడులు వచ్చాయంటే అది మనపై ఉన్న విశ్వాసంతోనే సాధ్యం అయింది. నమ్మకాన్ని పెంచుకోవాలంటే రైట్‌వర్క్ చేయాలి. తప్పుడు పనులు చేయాల్సిన అవసరం లేదు."

మంత్రులు, కలెక్టర్లకు ఇదే గీటురాయి

"మీ జిల్లాలో ప్రజా సంతృప్తి స్థాయిని చూస్తే మంత్రులుగా మీ నాయకత్వం ఎలా ఉందో తెలిసిపోతుంది. రాష్ట్రంలో అత్యధిక సంతృప్తిస్థాయి పింఛన్‌లపైనే ఉంది. 92%గా నమోదైంది. కలెక్టరుగా ప్రతి వర్గం ప్రజలను, గ్రామాన్ని టచ్ చేయాలి. ప్రభుత్వానికి కావాల్సింది ఫలితాలు. ఈ విషయం అండర్‌లైన్ చేసుకోవాలి. జిల్లాలో పౌరుల సంతృప్తి స్థాయినే కలెక్టర్ పనితీరుకు కొలమానంగా ఉంటుంది. మిగతావేవి కావు."


కలెక్టర్ల భేటీలో సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎస్ విజయానంద్

102 కొత్త ఇంధన ప్రాజెక్టులు!

21 సంస్థలు ఇప్పటికే ఏర్పాటు: సీఎస్

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 102 ఇంధన ప్రాజెక్టులు రానున్నాయని, ప్రస్తుతం అవి వివిధ దశల్లో ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక సీఎస్ కె.విజయానంద్ తెలిపారు. ఆ ప్రాజెక్టుల విలువ రూ.6 లక్షల కోట్లని కలెక్టర్ల సదస్సులో చెప్పారు. వీటిలో ఇప్పటికే 21 ప్రాజెక్టులు ఏర్పాటు కాగా మరో 16కు భూకేటాయింపు పూర్తయిందన్నారు. ఇంకో 45 ప్రాజెక్టులకు భూసేకరణ జరుగుతోందని, మిగిలిన 20 ప్రాజెక్టులు డీపీఆర్, ఫీజిబిలిటీ అధ్యయన దశలో ఉన్నాయని వివరించారు. వీటి మొత్తం సామర్థ్యం 86,578 మెగావాట్లుగా పేర్కొన్నారు. వీటి ద్వారా 4.39 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టులకు 6.85 లక్షల ఎకరాల భూమి కావాల్సి ఉండగా, 1,47,399 ఎకరాల రెవెన్యూ భూమి ఉందని, ఇప్పటికే 38 వేల ఎకరాలను కేటాయించారని తెలిపారు. విశాఖ సదస్సులో ఇంధనశాఖకు చెందిన 50 ప్రాజెక్టులకు ఎంవోయూలు చేసుకున్నట్టు తెలిపారు. వీటి విలువ రూ.4.54 లక్షల కోట్లని, 2.48 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులన్నింటినీ 45 రోజుల్లోగా గ్రౌండింగ్ చేయాలని సీఎం ఆదేశించారని, కలెక్టర్ల సహకారం తప్పనిసరని విజయానంద్ చెప్పారు.



ఏపీలో విద్యావిధానం భేష్!

(మొదటి పేజీ తరువాయి)

మాతృభాష ఆధారిత బహుభాషల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, ఆదివాసీ భాషల్లో కూడా చిన్న చిన్న పుస్తకాలు, పాఠ్యప్రణాళికలను రూపొందించారని యునెస్కో ప్రశంసించింది. ఏపీలో లిపి-భాష మధ్య సంబంధాలు, డిజిటల్ సంసిద్ధత అత్యధికస్థాయిలో ఉందని తెలిపింది. డిజిటల్ మౌలిక సదుపాయాలు, బహుభాషలతో కూడిన పుస్తకాలు ఉన్న గ్రంథాలయాలు, అనువాద సౌలభ్యాల వల్ల కొత్త మార్గాలు ఏర్పరిచారని పేర్కొంది. రాష్ట్రస్థాయి విద్య, పరిశోధన, శిక్షణ(ఎస్‌ఈఆర్‌టీ)లు, చదువరులకు లక్షిత సూచనలు(టీఆర్‌ఐ)లు, యూనివర్సిటీలు, ఎన్‌జీవోలు, సాంస్కృతిక సంస్థలు, సాంకేతిక బృందాల మధ్య బలమైన భాగస్వామ్యాలు ఉన్నాయని నివేదిక వివరించింది. ఆదివాసీల భాషలు, సంప్రదాయాలు, భాష, సంస్కృతి, పర్యావరణం, అనుభవం ద్వారా నేర్చుకోవడం మొదలైన వాటిని అనుసంధానం చేయడం ద్వారా బలమైన పునాది ఏర్పడుతోందని తెలిపింది. ఏపీలో ఎన్‌సీఆర్‌టీ, సీఐఐఎల్‌తో పాటు రాష్ట్ర సంస్థల తోడ్పాటుతో ప్రయోగాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొంది. బహుభాషల్లో బోధనను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలను ఏపీలో బాగా నిర్వహిస్తున్నారని యునెస్కో నివేదిక తెలిపింది. రాష్ట్రంలో ఆదివాసీ విద్యార్థుల నమోదు శాతం అత్యధికంగా ఉందని, ప్రాథమిక స్థాయిలో ఇది 118.5 శాతం కాగా, సెకండరీ స్థాయిలో 96.6 శాతం, హయ్యర్ సెకండరీలో 69 శాతంగా నమోదైనట్టు పేర్కొంది. కథల ద్వారా ఆదివాసీ పాఠశాలల్లో విద్యాబోధన సమర్థవంతంగా జరుగుతోందని తెలిపింది. కోయ, కువి, జాతాపు, సవర, ఆదివాసీ, ఒడియా, కొండ దొర భాషల్లో చిన్న చిన్న పుస్తకాలను రూపొందించారని ప్రశంసించింది. అదేవిధంగా సాల్ట్(సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) సంస్కరణల ద్వారా అధ్యాపకులకు వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంచే కార్యక్రమాలు అమల వుతున్నాయని తెలిపింది, బహుభాషల్లో ఈ-పుస్తకాలు, క్యూఆర్ కోడ్‌తో అనుసంధానమైన ఆడియో, వీడియో పాఠాలు, కమ్యూనిటీ రేడియో ద్వారా ఆదివాసీ ప్రాంతాల్లో మాతృభాష సహా బహుభాషల్లో బోధన జరుగుతోందని, దీక్షా పోర్టల్‌ను కూడా సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నారని నివేదిక వివరించింది.

ఏపీలో అణుశక్తి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయండి

» లోక్‌సభలో టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అణుశక్తితోనే వికసిత్ భారత్ సాధ్యమని టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం లోక్‌సభలో శాంతి బిల్లు-2025పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో అణుశక్తి కీలక పాత్ర పోషించనుందన్నారు. అమెరికా, ఫ్రాన్స్, జపాన్ తదితర దేశాలు తమ విద్యుత్ అవసరాల్లో 50శాతానికిపైగా అణుశక్తి ద్వారా పొందుతుంటే భారత్ మాత్రం 3శాతానికే పరిమితమైందని తెలిపారు. 2047 నాటికి భారత్‌లో 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోవడం హర్షణీయమన్నారు. ఐటీ రంగంలో తెలుగు యువత ప్రపంచాన్ని ఏలుతున్నట్లుగానే అణుఇంధన రంగంలోనూ రాణించేలా నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఏపీలో అణుశక్తి పరిశోధన, నైపుణ్య అభివృద్ధి కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'ను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు.

ఐదు జిల్లాలకు ఇన్‌చార్జిలుగా సీనియర్ ఐఏఎస్‌లు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐదు జిల్లాలకు సీనియన్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం జిల్లా ఇన్‌చార్జిలుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు జి.వీరపాండియన్, కాకినాడ జిల్లాకు ప్రసన్న వెంకటేశ్, బాపట్ల జిల్లాకు మల్లికార్జున్, శ్రీసత్యసాయి జిల్లాకు గంధం చంద్రుడు, నంద్యాల జిల్లాకు సి.హెచ్.శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. సీనియర్ ఐఏఎస్ అధికారులు జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు పాటించాల్సిన విధానాలను అమలు చేయడం, ఇంటర్ డిపార్ట్‌మెంట్స్ కో - ఆర్డినేషన్ కోసం పని చేయాల్సి ఉంటుంది.

షర్మిలకు పవన్ జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ మేరకు ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఆమెకు భగవంతుడు చిరాయువునిచ్చి, సుఖసంతోషాలు అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

కాగితాలతోనే ఖాకీల కుస్తీ

» టెక్నాలజీకి దూరంగా క్షేత్రస్థాయి పోలీసులు
» హెడ్ క్వార్టర్స్‌లోనే టెక్.. జిల్లాల్లో మాన్యువల్
» చాలా జిల్లాల ఎస్పీలు ఈ-గవర్నెన్స్‌కు దూరం
» ప్రభుత్వం జీవో విడుదల చేసి పలుమార్లు ఆదేశాలిచ్చినా పట్టనివైనం
» బాధితులకు అందని సత్వర న్యాయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'పాలనలో పారదర్శకత.. నిర్ణయాల్లో వేగం.. టెక్నాలజీ వినియోగం.. ఇవే ప్రభుత్వ పాలనకు మూల స్తంభాలు' అని ముఖ్యమంత్రి పదే పదే చెబుతున్నారు. కానీ ఈ మాటలు జిల్లాల ఎస్పీలకు వినిపించడం లేదు. ప్రభుత్వం డిజిటల్ పాలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నా.. క్షేత్రస్థాయిలోని ఖాకీలు మాత్రం కాగితాలకే పరిమితమవుతామని అంటున్నారు. పాలనలో ఏకరూపత కోసం కలెక్టర్లు, ఎస్పీలు తప్పనిసరిగా ఈ-గవర్నెన్స్ అంది పుచ్చుకోవాలని ముఖ్యమంత్రి నిరంతరం చెబుతూనే ఉన్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ ఆదేశాలు పాటిస్తున్నా.. పోలీసు యూనిట్లలో మాత్రం విజయవాడ, విశాఖపట్నం కమిషనర్లు.. ఏలూరు, మరో రెండు మూడు జిల్లాల ఎస్పీలు మినహా ఇతరులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం అధికారికంగా జీవో విడుదల చేసి పలుమార్లు ఆదేశాలిచ్చినా పలు జిల్లాల ఎస్పీలు మాత్రం.. 'టెక్నాలజీతో మాకేంటి పని' అన్నట్టుగా ఉంటున్నారు. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల సదస్సు సందర్భంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్లు డిజిటల్ వ్యవస్థలోకి మారినా ఎస్పీలు మాత్రం పేపర్‌తోనే పని చేస్తామంటే జిల్లాల్లో పాలన ఎలా పరుగులు పెడుతుంది? ప్రజలకు వేగవంతమైన సేవలు ఎలా అందుతాయి? అని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది. గురువారం జరిగే సమీక్షలో ఈ విషయంలో ఎస్పీలను గట్టిగా హెచ్చరించే అవకాశముంది. సుమారు ఐదున్నర కోట్ల జనాభా ఉన్న రాష్ట్రంలో 26 జిల్లాలు ఉన్నాయి. కలెక్టర్లు, ఎస్పీలే జిల్లాల్లో కీలకమైన అధికారులు. కలెక్టర్ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి చూస్తే.. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించే బాధ్యత ఎస్పీలదే. కూటమి ప్రభుత్వం వచ్చాక పాలనలో వేగం పెంచేందుకు ఆర్టీజీఎస్‌లో అన్ని వర్గాల డేటా నింపారు. ఎవరికి ఎలాంటి సంక్షేమ పథకాలు అందుతున్నాయనే దగ్గరి నుంచి ఎవరికి ఎటువంటి ఆరోగ్య సమస్యలున్నాయి.. ఎవరిపై పోలీసు కేసులున్నాయనే వరకూ ఆర్టీజీఎస్‌లో డేటా ఉంది. ఈ-గవర్నెన్స్‌కు అలవాటు పడితే నిమిషాల్లో డేటా తీసుకుని అంతే వేగంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. అయితే మూస ధోరణి, పాత పద్ధతుల నుంచి పోలీసులు బయటపడక పోవడంతో జిల్లాల ఎస్పీలు సైతం అదేబాటలో నడుస్తున్నారు. ఫలితంగా సిబ్బంది సమస్యలతో పాటు బాధితుల వినతులకు సైతం సత్వర న్యాయం లభించడంలేదు. జిల్లాల్లోని మెజారిటీ ఎస్పీల పరిస్థితి ఇలా ఉండగా, ఆర్టీజీఎస్‌తో నిరంతరం అనుసంధానంతో ఉండే ఐపీఎస్‌లకు అన్ని విషాయలు తెలుస్తున్నాయి.

చేయాలన్న తపన ఉంటే..

'ఏడేళ్లుగా మీరు వెదుకుతున్న దొంగ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఉన్నాడు. ఫొటో పంపా చూసుకోండి. వెళ్లి పట్టుకోండి..' అని ఒక ఐజీ ర్యాంకు అధికారి శ్రీకాకుళం పోలీసులకు రెండు నెలల క్రితం కీలక సమాచారం ఇచ్చారు. 'జగ్గయ్యపేట దగ్గర ట్రాఫిక్ జామ్ అయింది.. వెళ్లి తొందరగా క్లియర్ చేయండి..' అని అక్కడి పోలీసు అధికారులకు విజయవాడ పోలీస్ కమిషనర్ ఆదేశాలిచ్చారు. ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలోని టెక్ టవర్‌లో ఉన్న ఐజీ ర్యాంకు అధికారికి శ్రీకాకుళం పోలీసులు వెదుకుతున్న దొంగ శ్రీకాళహస్తిలో ఉన్నట్లు ఎలా తెలిసింది? తెలంగాణ సరిహద్దుల్లో ట్రాఫిక్ జామ్ అయితే విజయవాడలో ఉన్న పోలీస్ కమిషనర్‌కు ఎలా తెలిసింది? ఈ ప్రశ్నలకు ఒక్కటే సమాధానం.. టెక్నాలజీ. ఒకరు టెక్ టవర్‌లో ఉంటూ సీసీ కెమెరాలు పర్యవేక్షించడం.. మరొకరు టెక్నాలజీ వినియోగించి అధునాతన సాంకేతికతను అనుసరించడంతో గుర్తించగలిగారు. సీసీ కెమెరాలతో పాటు డ్రోన్లు వినియోగించి 'అస్త్రమ్' అనే యాప్ ద్వారా బెజవాడ కమిషనరేట్ నుంచి ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తుంటారు. ఇక ఏలూరులో ఎక్కడ రోడ్డుకు అడ్డంగా వాహనం ఆగినా గాల్లో ఎగురుతూ ఒక డ్రోన్ వస్తుంది. ఆ వాహనం నంబర్, కంపెనీ పేరు చెప్పి 'ఇక్కడి నుంచి తొందరగా తీసేయండి.. లేదంటే టోయింగ్ వాహనం వచ్చి తీసుకెళ్తుంది' అని మైకులో హెచ్చరిస్తుంది. ఐఐటీ పట్టభద్రుడైన ఏలూరు ఎస్పీ డ్రోన్‌లో కెమెరాలతో పాటు మైకులు ఏర్పాటు చేయించారు. కంట్రోల్ రూమ్‌లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆ డ్రోన్ విజువల్స్ చూసి కారు నంబర్ చెప్పి హెచ్చరించేలా ఏర్పాట్లు చేశారు. ఒకప్పుడు గజిబిజిగా ఉన్న ఏలూరు ట్రాఫిక్‌లో ఇప్పుడు మార్పు కనిపిస్తోంది.

ఏఐ అంటారు.. యాప్ పనిచేయదు

'రాష్ట్రంలో లక్షల్లో సీసీ కెమెరాలు అందుబాటులోకి తెస్తాం. ప్రతి జిల్లాకు సైబర్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తాం. అన్నింటినీ మించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో పోలీసింగ్ తీరు తెన్నులే మార్చేస్తాం' అని హోం శాఖ మంత్రి అనితతో పాటు ఉన్నతాధికారులు చెబుతుంటారు. అయితే వాస్తవానికి మాత్రం ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను పోలీసులు అనుసంధానం చేసుకొంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్లలో ఉండే వాటిని పోలీసులు అనుసంధానం చేసుకుని వాటిని తామే ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఏఐ పోలీసింగ్ కోసమంటూ రెండు నెలల క్రితం గుంటూరులో పోలీసులు ఏఐ హ్యాకథాన్ నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన మార్పులేంటి? అమలు ఎంత వరకూ వచ్చింది? అనే సంగతి పక్కనపెడితే అందుబాటులో ఉన్న ఏపీ పోలీస్ సేవా యాప్ పనిచేయడం లేదు. ప్రజలకు సంబంధించి సుమారు 76 రకాల సేవలు అందుబాటులో ఉండే యాప్ ఎందుకు పనిచేయడం లేదనే ప్రశ్నకు పోలీసు ఉన్నతాధికారుల నుంచి సమాధానం లేదు. ఫిర్యాదుదారులు తమ కేసు స్టేటస్ తెలుసుకోవాలంటే ఆన్‌లైన్‌లో సాధ్యం కావట్లేదు.



అమిత్ షాకు వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, పక్కన బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్

సుపరిపాలన యాత్ర ముగింపు సభకు రండి

» అమిత్ షాకు బీజేపీ ఏపీ నేతల వినతి
» పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్‌తో భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో ఈ నెల 25న నిర్వహించనున్న అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ముగింపు సభకు రావాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఏపీ బీజేపీ నేతలు కోరారు. బుధవారం, పార్లమెంటులోని అమిత్ షా కార్యాలయంలో ఆయనతో బీజేపీ స్టేట్ చీఫ్ పీవీఎన్ మాధవ్, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం, ఇటీవల బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్‌ను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

రఘురామను తొలగించాలి

» అన్ని పదవుల నుంచి సస్పెండ్ చేయాలి
» ఐపీఎస్ సునీల్‌కుమార్ పోస్టు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుపై సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సోషల్ మీడియాలో చేసిన పోస్టు వైరల్ అయింది. 'దర్యాప్తు సక్రమంగా జరగడం కోసం నన్ను సస్పెండ్ చేశారు. మంచిదే.. మరి సమన్యాయం కోసం రఘురామకృష్ణరాజును కూడా అన్ని పదవుల నుంచి సస్పెండ్ చేయాలి కదా.. సీబీఐ దర్యాప్తు సక్రమంగా జరగడానికి ఆయన్ను అన్ని పదవుల నుంచి తొలగించాలి. చట్టం అందరికీ సమానం అనే సందేశం వెళ్లాలి' అంటూ ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పీవీ సునీల్ ఉన్నప్పుడు అప్పటి నరసాపురం ఎంపీగా ఉన్న రఘురామను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని గుంటూరు సీఐడీ కార్యాలయంలో కస్టోడియల్ టార్చర్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రఘురామ ఫిర్యాదు మేరకు గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసి పీవీ సునీల్‌ను ఇటీవలే ప్రశ్నించారు. రఘురామపై ఉన్న సీబీఐ కేసుల విచారణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో పీవీ సునీల్ పోస్టు చేశారు.

చంద్రబాబు కేసుల వివరాలపై దాఖలైన పిటిషన్ వెనక్కి

» విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వు

విజయవాడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసిన సీఎం చంద్రబాబు కేసులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు బుధవారం రిటర్న్ చేసింది. మద్యం, ఫైబర్‌నెట్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. వాటిలో ఫైబర్‌నెట్, మద్యం కేసులను ఇటీవల కోర్టు కొట్టేసింది. వాటికి సంబంధించిన ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదిక, తీర్పు కాపీలు, 164 సెక్షన్ కింద రికార్డుచేసిన వాంగ్మూలాల ప్రతులను తనకివ్వాలని రైల్వే విశ్రాంత ఉద్యోగి వేము కొండలరావు న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. బుధవారం దానిని ఆయనకు వెనక్కి ఇస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులిచ్చారు.

కమీషన్ల కోసమే వైద్య కళాశాలల ప్రైవేటీకరణ

» వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: సజ్జల

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కమీషన్ల కోసమే చంద్రబాబు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారని వైసీపీ రాజకీయ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 175 నియోజకవర్గాల నుంచి కోటి సంతకాలను సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సంతకాలతో కూడిన పత్రాలను బుధవారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. వాటిని పరిశీలించిన అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. 'ప్రభుత్వ నిర్ణయాన్ని కోటి మంది ప్రజలు వ్యతిరేకించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం ద్వారా పేదవాడి ఉసురును చంద్రబాబు తీశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి' అని సజ్జల డిమాండ్ చేశారు.

ఇకపై ఐదేళ్లకోసారి ఎన్‌వోసీ..!

» జూనియర్ కాలేజీలకు అనుమతుల్లో ఉపశమనం

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక అనుమతుల విషయంలో ప్రైవేటు జూనియర్ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపశమనం కలిగించింది. ప్రతి సంవత్సరం ఎన్‌వోసీ తీసుకునే నిబంధన స్థానంలో ఐదేళ్లకోసారి తీసుకునేలా నిబంధనలు మార్చింది. అధికారంలోకి వచ్చాక ఈ నిబంధనను మార్చి ఐదేళ్లకోసారి ఎన్‌వోసీ ఇచ్చేలా మార్పులు చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాలేజీ యాజమాన్యాలకు లోకేశ్ హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగా ఇప్పుడు నిబంధనలు మార్చారు. కాగా.. గత వైసీపీ ప్రభుత్వం కాలేజీలను వేధించడమే లక్ష్యంగా ప్రతిఏటా ఫైర్ ఎన్‌వోసీ తీసుకోవాలనే నిబంధన తీసుకొచ్చిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు.

ఎండీఎం ఇండెంట్లకు ఒకే సమయం ఇవ్వండి

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం (ఎండీఎం)కు సరఫరా చేసే బియ్యం, రాగి పిండి, బెల్లం, గుడ్లు, చిక్కీల ఇండెంట్ల నమోదుకు ఒకే సమయం ఇవ్వాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రకాశ్‌రావు, ఎంజీ మెహది ప్రభుత్వాన్ని కోరారు. ప్రతినెలా 9 నుంచి 25 వరకు ఇండెంట్లు పెట్టాల్సి వస్తోందని, బదులుగా అన్నిటికీ కలిపి ఏవైనా ఐదు రోజులు అమలుచేయాలని కోరుతూ సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు బుధవారం వారు లేఖ రాశారు.

టెట్‌కు 90 శాతంపైగా హాజరు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు బుధవారం 90శాతానికిపైగా హాజరు నమోదైందని టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. సోషల్ 2ఏ పేపర్‌కు ఉదయం సెషన్‌లో 15,698 మందికి గాను 14,262 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం 11,386 మందికి గాను 10,618 మంది హాజరయ్యారని వివరించారు.

'ఉపాధి'లో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

» పనిదినాల పెంపు హర్షణీయం
» ఏపీకి అదనపు తోడ్పాటు ఇవ్వండి: లావు

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అశాస్త్రీయ విభజన వల్ల ఏపీ రెవెన్యూ లోటుతో ఇబ్బంది పడుతోందని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 92 కేంద్ర పథకాలు అటకెక్కాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాదిన్నర కాలంలో ఆ పథకాలను మళ్లీ గాడిలో పెట్టామని వివరించారు. బుధవారం లోక్‌సభలో 'వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్- గ్రామీణ్(వీబీ-జీరామ్‌జీ) బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏపీకి సాయం అందించేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వీబీ-జీరామ్‌జీ బిల్లు ప్రకారం రాష్ట్రం భరించాల్సిన 40 శాతం వాటా విషయంలో ఏపీకి ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని లేదా అదనపు సాయం అందించాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధి హామీ పథకంలో సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందన్నారు. పని దినాలను 125 రోజులకు పెంచడం సరైన నిర్ణయమని కొనియాడారు. నిధులను వ్యక్తుల ప్రయోజనాల కోసం కాకుండా గ్రామాల్లో శాశ్వత సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో పేదరికం తగ్గుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకాన్ని ఉత్పాదకత పెంచేలా తీర్చిదిద్దాలని కోరారు. ఈ పథకంలో జరుగుతున్న అవినీతిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీలో గత పదేళ్లలో రూ.82 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయని, వాటిలో రూ.48 కోట్లు మాత్రమే రికవరీ అయ్యాయని తెలిపారు. నిధుల రికవరీతో మాత్రమే సరిపెట్టకుండా అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేలా చట్టంలో మార్పులు తేవాలని డిమాండ్ చేశారు.

పల్నాడులో మిర్చి పరిశోధన కేంద్రం

పల్నాడు జిల్లాలో జాతీయ మిర్చి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రానికి లావు విజ్ఞప్తి చేశారు. పల్నాడు-గుంటూరు ప్రాంతం భారత్‌లో అతిపెద్ద, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మిర్చి ఉత్పత్తి కేంద్రమన్నారు. పల్నాడు మిర్చి రైతులకు అధిక దిగుబడినిచ్చే తెగుళ్లను తట్టుకునే రకాలు అందుబాటులో లేవని తెలిపారు. సంప్రదాయ పద్ధతుల్లో పంటను ఆరబెట్టడం వల్ల నాణ్యత తగ్గి, అంతర్జాతీయంగా ఎగుమతుల్లో వెనుకంజలో ఉంటున్నారని చెప్పారు.


ఏఐ ల్యాబ్స్‌గా రాష్ట్రంలో 9 ఐటీఐలు

» లోక్‌సభలో కేంద్రం వెల్లడి

ఇండియాఏఐ మిషన్ కింద ఆంధ్రప్రదేశ్‌లోని 9 ప్రభుత్వ ఐటీఐలను డేటా అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ల్యాబ్స్‌గా మార్చేందుకు అనుమతి ఇచ్చినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. లోక్‌సభలో ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఏలూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, డోన్, గాజువాక, కాకినాడ, విజయవాడ, కడప, నెల్లూరు ఐటీఐలను డేటా అండ్ ఏఐ ల్యాబ్స్‌గా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

స్క్రబ్ టైఫస్‌తో వృద్ధురాలు మృతి

» అన్నమయ్య జిల్లా పీలేరులో ఆలస్యంగా వెలుగులోకి



పీలేరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో స్క్రబ్ టైఫస్ మరణం వెలుగుచూసింది. అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలోని మోడల్ కాలనీలో ఓ వృద్ధురాలు స్క్రబ్ టైఫస్‌తో మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. కేవీపల్లె మండలం ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన వీరనాగయ్య, మంగమ్మ (65) దంపతులు 30 ఏళ్లుగా మోడల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కొంతకాలం క్రితం వీరనాగయ్య పక్షవాతం బారినపడడంతో అప్పటి నుంచి దంపతులిద్దరూ సొంతూరు ముప్పిరెడ్డిగారిపల్లెలో ఉంటున్నారు. మంగమ్మ పింఛను కోసం ప్రతినెలా మోడల్ కాలనీకి వచ్చి వెళ్తుంటుంది. ఇటీవల ఆమెకు జ్వరం రావడంతో స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గలేదు. దీంతో తిరుపతిలో ఉంటున్న ఆమె కుమారుడు గత శనివారం ఆమెను రుయా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు ఆమెకు స్క్రబ్ టైఫస్ పరీక్షలు నిర్వహించగా ఆదివారం పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆమె కన్నుమూసింది. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య, తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు బుధవారం పీలేరులోని మోడల్ కాలనీని సందర్శించారు. అధిక జ్వరంతో బాధపడుతున్నవారికి స్క్రబ్ టైఫస్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

నేతలతో జగన్ చెడుగుడు!

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారు. అయితే.. రాజకీయంగా బలమైన పునాదులు లేని తనను అక్కడకు పంపితే మరోసారి బలిపశువును అవుతానంటూ రజని వాపోతున్నారట. సహజంగా ఎన్నికలకు ఏడాది లేదా ఆరు మాసాల ముందు పార్టీలు అంతర్గత సర్వేలు నిర్వహించి.. అభ్యర్థుల మార్పులు చేర్పులపై కసరత్తు చేస్తాయి. కానీ, 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికలపై 2025లోనే జగన్ నిర్ణయానికి రావడం చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు పార్టీలో ఒక వెలుగు వెలిగిన రజినీ.. ఇప్పుడు అడపాదడపా స్థానిక మీడియా ముందు మాట్లాడటం మినహా ఆ జోరును చూపించలేకపోతున్నారు.

బాషా.. ఘోష!

కడప మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అంజాద్ బాషా ఘోష మరో విధంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వకూడదని జగన్ నిర్ణయించినట్టు సమాచారం. ఆయనకు బదులుగా బాషా సోదరుడి కుమారుడుని రంగంలోకి దింపే ఆలోచనలో జగన్ ఉన్నారని పార్టీనేతలు వెల్లడిస్తున్నారు. కడప ఎన్నికల్లో ఓటమి పాలైన నాటి నుంచి అంజాద్ బాషాను జగన్ దూరం పెట్టారు.

దేవినేని అవినాశ్ దారెటు?

ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న వైసీపీ యువ నేత దేవినేని అవినాశ్ పరిస్థితి కూడా డోలాయమానంలో పడిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన అవినాశ్ పరాజయం పాలయ్యారు. అయితే.. కాపు, కమ్మ సామాజికవర్గాల ప్రభావం ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా గెలవడం కష్టమనే అభిప్రాయంలో అవినాశ్ ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. తన తండ్రి దేవినేని నెహ్రూ ప్రాతినిధ్యం వహించిన కంకిపాడు(ప్రస్తుతం పెనమలూరు) నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న యోచనలో అవినాశ్ ఉన్నారని అంటున్నారు. అయితే... 'నిన్ను ఎమ్మెల్యేగా చూడాలని ఉంది.' అంటూ అవినాశ్‌ను బుజ్జగించేలా మాట్లాడడమే తప్ప.. పెనమలూరుకు మార్చడంపై జగన్ ఎలాంటి హామీని ఇవ్వడం లేదని పార్టీవర్గాలు చెబుతున్నాయి. తాజాగా.. విజయవాడ ఎంపీగా పోటీ చేయాలని అవినాశ్ ముందు జగన్ కొత్త ప్రతిపాదన పెట్టారని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. అయితే.. లోక్‌సభకు పోటీ చేయాలంటే నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల బరువు బాధ్యతలను చూసుకోవాల్సి ఉంటుందని.. అంత ఆర్థిక శక్తి.. స్తోమత కూడా తనకు లేవని అవినాశ్ చెబుతున్నట్టు సమాచారం. కానీ, జగన్ మాత్రం తన మాటే వినాలన్న వైఖరిలో ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న అవినాశ్ అన్యమనస్కంగానే, అరకొరగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

హవా శ్యామలదే!

వైసీపీలో ఇప్పుడు యాంకర్ శ్యామల హవానే కనిపిస్తోంది. సీనియర్ నేతలు రోజా, విడదల రజినీ వంటి వారిని సైతం తప్పించి యాంకర్ శ్యామలను అధికార ప్రతినిధిని చేశారు. ఈ విషయంలో పార్టీ నేతల అభిప్రాయాలను, మనోభావాలను జగన్ ఏమాత్రం పట్టించుకోలేదు. రాజకీయంగా ఎలాంటి అనుభవం లేకపోయినా.. ప్రత్యర్థులను ఎద్దేవా చేసేలా మాట్లాడుతున్న శ్యామలను జగన్ తన స్వభావానికి అనుకూలంగా ప్రోత్సహిస్తున్నారనే చర్చ సాగుతోంది. అయితే.. ఆమె హవా ఎంత కాలం కొనసాగుతుందనే విషయం చెప్పలేమని పలువురు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. జగన్‌ను మెప్పించినంత కాలమే ఎవరికైనా మనుగడ అని చెబుతున్నారు.

కొడాలి పరిస్థితి ఇదీ...

రాజకీయ స్వయంకృతాపరాధం ఒకవైపు, జగన్ వ్యవహరిస్తున్న తీరు మరోవైపు కొడాలి నానికి పాలుపోని పరిస్థితి తెస్తోందని వైసీపీ నాయకులు అంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదేళ్లలో కొడాలి నాని నోటికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఎన్నికల తర్వాత రెడ్ బుక్ భయంతో కొడాలి వెనక్కి తగ్గారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయంగా మరో నాయకుడి కోసం జగన్ వెదుకుతున్నట్టు తెలుస్తోంది. ఈ సమాచారంపై అవగాహన వల్లే ఇటీవల.. తాను డాక్టర్ల సలహా మేరకు రాజకీయాల్లో చురుగ్గాలేనని.. మరో ఆరు నెలల తర్వాత పూర్తిస్థాయిలో రాజకీయాల్లో ఉంటానని.. ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటానని కొడాలి ప్రకటించారు. అయితే.. అల్లుడొచ్చేదాకా అమావాస్య ఆగదన్నట్లుగా జగన్ మాత్రం తన ఆలోచనలను అమలు చేయడంపై దృష్టి సారించారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

నారాయణ.. నారాయణ!

రాష్ట్రంలో బలమైన ఎస్సీ సామాజికవర్గనికి చెందిన జీడీ నెల్లూరుకు చెందిన కిళత్తూరు నారాయణస్వామికి ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చి ఘనంగా చెప్పుకొన్న జగన్ ఇప్పుడు ఆయన్ను కూడా పక్కన పెట్టారని పార్టీ నేతలు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నారాయణస్వామి కుటుంబంలో ఎవరికీ సీటు ఇచ్చే అవకాశం లేదని అంటున్నారు.

'మార్గం' మూత?

గత ఎన్నికల్లో రాజమండ్రి రూరల్ బరి నుంచి వైసీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగి ఓటమిపాలైన మాజీ ఎంపీ మార్గాని భరత్‌కు రాజకీయ భవిష్యత్తు ఏమిటో అంతుచిక్కడం లేదని అంటున్నారు. 2019లో రాజమండ్రి ఎంపీగా విజయం సాధించిన భరత్‌ను మళ్లీ అదే స్థానం నుంచి పోటీ చేయించేందుకు జగన్ ధైర్యం చేయలేదు. 2024లో రాజమండ్రి రూరల్ నుంచి పోటీలో పెట్టారు. కానీ.. ఇప్పుడు ఆయనను ఎక్కడికి పంపించాలో జగన్ నిర్ధారించుకోలేకపోతున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి.

రోజా రూటెటు?

ఉమ్మడి చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి ఆర్కే రోజా విషయంలోనూ జగన్ అనిశ్చితి కొనసాగిస్తున్నారని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా స్థానిక వైసీపీ నేతలకు రోజా అంటే గిట్టడం లేదని పార్టీనేతలు అంటున్నారు. ఇప్పటి దాకా నగరిపై జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోయినా.. పరిస్థితులను గమనిస్తున్నారని, ఎన్నికలకు ముందు సర్వేల పేరిట రోజాను తప్పించే వీలుందని పార్టీనేతల్లో అంతర్గతంగా చర్చసాగుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.